ADVA103B139

# యదార్థ - భారతి

## (నిమ్నజనోద్ధరణము)

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10176

★

రచన:
సాహిత్య సమ్రాట్టు, సాహిత్య అకాడమీ సభ్యులు
డాక్టర్ : త్రిపురనేని వేంకటేశ్వరరావు

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10176

కవిరాజ సాహిత్య విహారము, గుడివాడ.

వెల : రూ 5-00

2

సాధారణ : విరోధికృతు
1971
ప్రథమ ముద్రణ : వేయి ప్రతులు,

కత్తిపోటును మీరదో కలము పోటు.

సర్వోదయ ప్రెస్, గుడివాడ.

# జన్మ భూమి

సీ॥ నగరాజ ముఖ మహోన్నత శైలములతోడ
జాహ్నవీ ముఖ్య - నిర్ఝరులతోడ
అమృత సరోది పద్మాకరంబులతోడ
నందన బృందావనములతోడ
మహితగంగా సింధు మైదానములతోడ
కరవీర కదళికా తరులతోడ
కాళిఘట్టాది నగర రాజములతోడ
గటిగత లవణ సాగరముతోడ

గీ॥ బహుళ నవరత్న ధాన్య సంపదలతోడ
వరలు యేబది నలుకోట్ల ప్రజలతోడ
నతుల సర్వాంగ సుందరివైన నీకు
వందనములమ్మ! గుణజాత భరతమాత !!

305.56072
VEN

# నవోదయము

సీ॥ సర్వ జీవైక్య విజ్ఞాన భావప్రభల్
గ్రక్కుచుండెడి వేఁగుఁజుక్కకాంతి
సామ్యసౌదర్య స్వేచ్ఛా ప్రబోధములూఁదు
ప్రకృతి వైతాళిక శ్రావ్యగీతి
నిందితాచార వినీతి, మాంద్యముఁజోపు
సంస్కర్తృ మాతరిశ్వములయొలపు
పారతంత్ర్యత మోలి పాటవంబొనరించు
స్వాతంత్ర్య బాలభాస్కరుని వెలుగు

తే॥ గీ॥ లందుకొని యాటవిక మానవాళికూడ
మేలుకొని, యభ్యుదయగతి మెలగుచుండ
నిద్రమాంద్యంబె పోదాయె నీదు ప్రజకు
వడి ప్రబోధింపు మికనైన భారతాంబ!

—



కృతికర్త:
సాహిత్య సమ్రాట్టు, సాహిత్య అకాడమీ సభ్యులు
డా॥ త్రిపురనేని వేంకటేశ్వరరావు,
యం. బి. బి. యస్.,



స్వీకర్త:
శ్రీ దామోదర సంజీవయ్య
ఆలిండియా కాంగ్రెసు ప్రెసిడెంటు.

# అస్పృశ్యత

(౦)

భారతీయులలో మాల మాదిగలను పేర్ల వర్తించు ఆది ద్రావిడ సోదరులకు స్వమతావంబులగు సవర్ణులు చిర కాలము నుండియు అంటరాని సంఘములుగ పరిగణించి సర్వదా సంఘ దూరులను గావించి హింసించుచున్న యంశము ఎల్ల రెఱింగినదె.

జాతికి కళంక దాయకము అమానుషమగు ఈ అస్పృశ్యతను తొలగించుటకై బద్ధకంకణుడైన గాంధీ మహాత్ముడు దీన జనావనుడగు హరికి ప్రియజనులను ఆశయముతో ఆది ద్రావిడులకు హరిజనులని నామకరణము చేసెను. నాటినుండియు ఆ నామమే ప్రజలలో వాడుక ఆయెను. కాని దీన జనావనుడగు హరి, కరుణామయుడైన హరి, దయార్ద్ర హృదయుడైన హరి, వీరిని నేటికిని కరుణారస దృక్కుల జూడక కడగండ్ల పాలు చేయుట మిక్కిలి శోచనీయము.

ఇందు ముఖ్యముగ అస్పృశ్యత యన నేమి? మన మాల మాదిగ లెవ్వరు? వారిపై అస్పృశ్యత ఎటు ఆరోపిత మయ్యెను? అను అంశములను చారిత్రిక దృష్టితో సహేతుకముగ వివరింప ప్రయత్నించితిమి.

## అంటు దోషము

పరవ్యక్తిని గాని, వస్తువును గాని అవయవములతో తాకుటకు అంటుట యందురు. ఆ తాకుటలో మనకు పూర్వ

ములేని గుణద్రవ్యము లేవేని అంటుకొనవచ్చును. ఆ తాకుట మనకు అసహ్యముగాని అపకారముగాని ఐనచో మన కది అంటుదోషమగును.

హేతువాద పారిశుద్ధ్యముల ననుసరించి విచారించినచో మానవుడు పాటింప వలసిన అస్పృశ్యత విశేషవిధి, సామాన్య విధి అని ద్వివిధము.

## విశేష విధి

"సంపర్కాద్దోషః" దోష మేదేని భిన్న పదార్థముల కలయికతోనే ఉత్పన్నమగునని తాత్త్విక దృష్టిని వైజ్ఞానికు లెల్లరు అంగీకరించిరి. ఈ విధి జడములకు, చేతనములకు సామాన్యమే. దీనిని బట్టి ఆరోగ్యవంతుడు కూడ ఒండొరుల దేహములను ధరించు వస్త్రములు, తుడుపు గుడ్డలు, పడకలు, భోజన భాజనములు, పాన పాత్రలు, ఆసనములు, మున్నగు వానిని అంటనీయరాదు. స్పృశించు నవసరము కలిగినపుడు పనితీరిన తత్క్షణమే తగినరీతిని శుద్ధి చేసికొనవలసియున్నది.

ఈ విశేష విధినే నేటికిని మడిపేర కొన్ని సంఘము లలో పాటించుచున్నారు. కాని అందలి పారిశుద్ధ్య భాగము నశించి కేవలము లాంఛనప్రాయ మైనది.

ప్రపంచమున జనించు వ్యాధులలో జాలవరకు సాం క్రామికము లగుటచేతనే పైవిశేష విధి అనుల్లంఘనీయ మగుచున్నది.

నిశితముగ విచారింపగా ఈ విశేష విధిననుసరించి మానవులు అనివార్య పరిస్థితులయందు దక్క ఒండొరులంటు కొనరాదనియే చెప్పవలయును.

ఇందువలన ఒక కుటుంబముగాని, కొన్ని కుటుంబములుగాని ఇతర సంఘములకు నైతికముగ అంటరాని వారని భ్రమింపరాదు. ఇది వ్యక్తిగతమేగాని సాంఘికము కానేరదు. ఒక కుటుంబములోని తల్లి బిడ్డలుగాని, సోదరులుగాని ఒకరి స్పర్శ మరొకరికి పారిశుద్ధ్య సూత్రములనుబట్టి అసమంజసమనియే సిద్ధాంతము. బిడ్డలను ముద్దు పెట్టుకొనుట, తనువు లంటించి పరుండుట తల్లులును చేయరాదనియే దీని సారాంశము.

ఇది ఆరోగ్య కాంక్షులగు మానవులు అనివార్యముగ పాటించవలసిన విధానము. కాని ఈ విశేష విధిని వైద్యులు తప్ప సామాన్యులు పాటించుట లేదనియే చెప్పుట అవిచార మూలముకాదు.

## సామాన్య విధి

అస్పృశ్యతలోనే ఈ సామాన్య విధియు, వ్యక్తిగతము తాత్కాలికము, సకారణము నైనది. వ్యక్తి దుర్గంధ పంక లిప్తుడో, తైల లిప్తుడో మలిన వస్త్రుడో, అయినపుడు తాత్కాలికముగ పరులకు అంటరాని వాడగును. ఆ దోషము తొలగినంతనే ఆతడు అంటదగినవాడు కావచ్చును. ఆ యస్పృశ్యత గుణముతో సంక్రమించి తిరిగి గుణముతోడనే అంతరించును. ఈ దోషము గుణమునకేగాని గుణికి కాదు. ఎవ్వరిని తాకుటచేగాని సమీపించుటచేగాని వస్త్రాద్యుపకరణ స్పర్శచేగాని గాలి సోకుటచేగాని శారీరక మానసిక రుగ్మతలు సంక్రమించునో అట్టి వారెల్లరు ఆశ్రయాశనుడగు అగ్నివలె తాత్కాలికముగ ఇతరుల కంటరాని వారగుచున్నారు.

అనగ ప్లేగు, కలరా, మశూచి, గజ్జి, పొంగు, ఆటలమ్మ, యిన్ఫ్లూయింజా, కుష్ఠు, క్షయ, రక్తగ్రహణి, కోరింతదగ్గు, గవద బిళ్లలు, మొదలగు సాంక్రామిక వ్యాధులు గలవారును మలిన దేహులు, మలిన వస్త్రులు ఇతరుల కంటరానివారు, సమీపింపరాని వారు నగుచున్నారు. వీరి అస్పృశ్యతా దోషము, ఆ దుర్గుణము వారియందు కొంత కాలమే ఉండును. గుణరాహిత్యముతో వారు స్పృశ్యులగుచున్నారు.

ఇట్టి వారు ఒక కుటుంబమునందు గాని కొన్ని కుటుంబములందు కాని ఒక సంఘమునందు గాని, కొన్ని సంఘములందుగాని ఎల్లపుడుందురనుట నిర్వివాదాంశము. అన్ని కుటుంబములందును, అన్ని సంఘములందును, అన్ని జాతులయందును, ఒక్కొక్కపుడుండ వచ్చును. ఎందున్నను నిర్దోషులగు వరకు వారిని అస్పృశ్యులుగ పరిగణించుట సమంజసము.

ఈ అంటరాని తనము గుణగతమేగాని వ్యక్తిగతము కానందున ఒక వ్యక్తియే దోష రాహిత్యముతో అంటదగినవాడు, దోష సాహిత్యముచే నంటరాని వాడును కావచ్చు. అనగ అస్పృశ్యతా దోషులను కూడ మనము స్పృశ్యులుగ అంగీకరించు చుంటిమని స్పష్టమైనది.

మానవులు తప్పనిసరిగ పాటింపవలసిన గుణగతమైన సామాన్య విధి ఎల్ల దేశములందును ఎల్లకాలము లందును, ఎల్ల సంఘముల చేతను, ఎల్ల జాతులచేతను పాటింపబడు చున్నది.

అట్టి కనిష్ఠ సామాన్య ధర్మము నైనను, మనలో

విషూచి, మశూచి, క్షయ మొదలగు ఏ ఒకటి రెండు రుగ్మత లందో తప్ప ఇతర సాంక్రామిక వ్యాధులందుకూడ శ్రద్ధగ పాటించుటయే లేదు.

## అర్థములేని అస్పృశ్యత

మానవులు తప్పనిసరిగ అనుష్ఠింపవసిన అర్థవంతము లైన అస్పృశ్యతా విధుల నెంటిని మనము శ్రద్ధగా పాటించు టయే లేదు.

ఇట్లు అనివార్యమైన విధులను పాటింపకపోగా, అనవ సరమైన పనిని శ్రద్ధగ పాటించు చున్నాము. సవర్ణ హిందువు లను నమ్మి సదా సేవించు అమాయక సోదరులగు హరిజన సంఘముపై యథార్థముగాలేని అస్పృశ్యతా దోషము నారో పించి ఆచార మిషతో అత్యంత శ్రద్ధగ పాటించుచు, మతము నకు, జా తి కి, దేశమునకు తీరనికళంకము నాపాదించు చున్నాము.

యథార్థముగ మనకంటె కష్టజీవులు,ఆరోగ్యవంతులు, నిరపరాధులు, నిర్మల హృదయులునగు హరిజన సోదరులను వంశ పారంపర్యము అస్పృశ్యులని అవమానించునంతటి అమా నుషమగు ఆచార దాసుల మగుచున్నారము.

అపరిశుద్ధుడు పరిశుద్ధుడైన తర్వాత కూడ అస్పృశ్యు డుగ నుండుటయు కొందరు వంశ పారంపర్యముగ ఇతర సంఘములకు అంటరాని వారుగ పరిగణింపబడుట అక్రమము, అన్యాయము నైనది. స్వజాతిలోని కొన్ని తెగలందు నంటు దోషము పారంపర్యముగ, ఆచారముగ చెల్లు దౌర్భాగ్యము

భారత భూమిలోని ఒక్క హైందవులందు దక్క ప్రపంచ ములో ఏ జాతియందును, ఏ మతము నందును కానరాదు. అస్పృశ్యతయను ఈ దుష్ట మతాచారము ద్రావిడజాతియందు న్నట్లు కనబడదు. ఆర్యులు మన దేశమందు ప్రవేశించిన తర్వా తనే ఇది ఏర్పడినదని చెప్పవచ్చును. ఆర్యమతమునకు కళంక దాయకమగు నీ భయంకరాచారము ఆర్యులలో మొట్ట మొదట లేదనియు, మధ్యయుగమున ఏర్పడినదనియు ఆర్య వైదికవాఙ్మయము వలన స్పష్టపడుచున్నది.

"ఆర్యా స్త్రైవర్ణికాః" అని గౌతముని న్యాయ శాస్త్రము చెప్పుచున్నది. అనగ అప్పటికి ఆర్యులయందు మూడే వర్ణములున్నట్లు గోచరించుచున్నది.

"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః" అనగ భగవద్గీత కాలమునాటికి నాలుగు వర్ణములున్నట్లు కన బడుచున్నది.

"నాస్తితు పంచమః" మను ధర్మశాస్త్రము.

భారతీయార్యులలో పంచమ వర్ణము లేదనుటకు పై ప్రమాణము తార్కాణము. అప్పటికి అస్పృశ్యతయున్నట్లు గోచరింపదు.

వైదిక ధర్మ దేహానికి మధ్యనంటిన ఈ అస్పృశ్యతా దోషమును తత్‌క్షణమే తుడిచి వేయ దగినదని, దేశాభ్యు దయ కాంక్షులగు విజ్ఞులు యుగయుగాలనుండియు హెచ్చ రించుచున్నారు.

ఆంధ్ర జాతికి పరమాప్తుడును భావ విప్లవ విధాతయు హేతువాదియునగు కవిరాజు 1910వ సంవత్సరమున ఒక ఆది

యాంధ్ర బాలికను విద్యాలయమునకు పంపుచు పలికిన పలుకులు ఆలకింపుడు.

"అస్పృశ్యత నిలచిన హిందూమత మంతరించును. హిందూమతము జీవింప వలసిన అస్పృశ్యత అంతరింపవలెను"

కేవలము మాతృదేశ బంధవిముక్తికై సర్వస్వమర్పించు చున్న సంఘ సంస్కర్తయగు కవిరాజు ఆశ్రయముకంటె ప్రజల పరిమాణ మేమి కావలయును? కావున సంఘమున దశదిశల నలముకొన్న అంటరాని మంటనెంత త్వరలో నార్పిన దేశమునకంత శ్రేయస్కరమని సహృదయులగు సోదర భారతీయులు భావింతురుగాక

## (ఋగ్వేదము క్రీ॥ పూ॥ 4000)

వైదిక మతమున అత్యంత ప్రాచీన ప్రమాణ గ్రంథము ఋగ్వేదము. ఋగ్వేదము రచింపబడుచు ప్రచారములో నున్న కాలమునకు చారిత్రికులు ఋగ్వేద యుగమని నిరూపించిరి.

ఆ యుగమున భారతీయార్యులలో నేడున్న మత,వర్ణ, భేదములు లేవు.

సమాజ మంతయు నొక సమిష్టి కుటుంబముగ, స్త్రీ పురుషులు సమాన ప్రపత్తితోనే వర్తించుచుండిరి.

## మ త ము

ఆర్యులు, నాడు నీరు, నిప్పు, గాలి, సూర్యుడు, ఉరుము మెరుపు, మబ్బు, మున్నగు ప్రకృతి పదార్థములనే దేవత

లుగ ఋఙ్మంత్ర మూలమున నారాధించుచు, జన్నములాచరించుచుండిరి.

వర్షమును పర్జన్యుడనియు, ఉరుమును రుద్రుడనియు, నీటిని వరుణుడనియు, నిప్పును అగ్ని అనియు, సూర్యుని సవిత అనియు, గాలిని మరుద్దేవత అనియు (పురుషదైవములుగను) గంగ, సరస్వతి, యమున, కృష్ణ, గోదావరి నదులను! స్త్రీ దేవతలుగను ఆరోపించి రూపకాలంకారములతో వర్ణించి యారాధించుచుండిరి.

వేదములలోని రూపకాలంకారములనే తర్వాత పురాణ కథలుగ వర్ణితము లయ్యెనని వేదములలోని ఉషా వృత్రాది వర్ణనలు పరికించినవారికి స్పష్టము గాకపోవు.

ఆ దేవతలందఱు నాడు ప్రత్యక్ష స్వరూపముతోనే ఆరాధింపబడుచుండిరి. కాని ప్రతిమారూపము దాల్పలేదు.

## వర్ణము

“ఆర్యా అన్యేచ దస్యవః॥ అను ఋక్కువలన నాడు ఆర్యులతోపాటుగ దస్యులను నొక ప్రత్యేకమైన తెగ మానవులు మాత్రముండిరని తెలియుచున్నది. నాటి ఆర్య దస్యు నామములు ప్రత్యేకమైన తెగల సంజ్ఞలేకాని నేటి కులములవలె నొక మతమునకుఁ జెందిన యంతర్భాగము కావు. వారినే వేదాలలో నిషాదులనియు, చరిత్రలలో ద్రావిడులనియు వాకొనిరి.

శ్లో॥ యజ్ఞా నహ పంచనామ మహోత్రం జుషధ్వం
నమో నిషాదేభ్యః పుంజష్ఠేభ్యశ్చవోనమో

ఈ ఋక్కులనిబట్టి విచారింపగా నిషాదులు కూడ ఆర్యులవలె యజ్ఞముల నాచరించు చున్నట్లును ఆర్యులు వారిని పూజ్యభావమున చూచుచున్నట్లు స్పష్టపడుచున్నది.

కావున ఋగ్వేద యుగమున అస్పృశ్యులనబడువారు లేరనుట స్పష్టము.

క్షాత్రయుగము (క్రీ. పూ 1500-2000)

ఆర్యులలో సంఘ రక్షణార్థమై వర్ణవ్యవస్థవెంట రాజ్యాంగ విధాన మేర్పడిన ఈ కాలమునకు చారిత్రికులు క్షాత్రయుగమని పేరిడిరి.

శత్రుభయము మెండై సమాజమంతయు నిరంతరము యుద్ధములందే కాలము గడుపుటచేత కృషి, వాణిజ్యాది జీవన వ్యాపారములన్నియు మొండిపడి పోవలసి వచ్చెను. రక్షణ వ్యవస్థ నేర్పరచు కోవలసి వచ్చెను. సమాజములో భుజబల పరాక్రమములుగలవారిని క్షాత్రకర్మకై నియోగించి వారిని క్షత్రియులని, పేర్కొనిరి. దైవిక లౌకిక శత్రు నివారణకు సలహాలనిచ్చి సహకరించుటకు విద్యావంతులు నియమితులైరి. వీరు బ్రాహ్మణ నామాంకితులైరి.

సంఘ రక్షణోద్యోగులగు నీ బ్రాహ్మణ క్షత్రియులు గాక మిగిలిన ఆర్య సంఘమంతయు వైశ్యులనబడిరి. ఆర్యులకు లోబడిన ద్రావిడులను శూద్రులని పిలుచుచుండిరి. నాడు ఆర్యులలో అస్పృశ్యమగు సంఘ మేర్పడినట్లులేదు. నాటి బ్రాహ్మణ, క్షత్రియ వర్ణములు నేటి వర్ణములవలె పుట్టుకతో నేర్పడినవి కావు. పుట్టి పెరిగి గుణ సామర్థ్యములు వ్యక్తమైన పిదప నేర్పడుచు, గుణ పరివర్తనముతో మారదగినవిగనుండె

డివి. అనగ శ్రమ విభజనపద్ధతి ననుసరించి సమాజ సౌకార్యార్థమై నేటి ప్రభుత్వోద్యోగముల వలె సామర్థ్యము ననుసరించి ఏర్పడుచు మారుచుండునేగాని శాశ్వతములు గానేరవు. ఐతరేయ, ఐలూష, కవష, జాబాలి, వశిష్ఠ, నారద, విశ్వామిత్ర, పరాశర, వ్యాస, మతంగాది, చరిత్ర ఇందుకు తార్కాణములు.

"నాటి మతము కట్టుబొట్టు జుట్టుల వంటి వంట తప్పెళలమీదనుగాక శమ దమ విజ్ఞానమయ సాధనలపై నాధారపడి యుండెడిది.

నాటి వర్ణము ఇతరులు తాకినంతమాత్రమున, కలసి భుజించినంత మాత్రమున, కన్యను వివాహ మాడినంతి మాత్రమున ఊడి రాలిపోవునంతటి దుర్బలతరమైనది కాదు."

నాటి సమాజములో నెవ్వరేకృషి చేయుచున్నను, సమిష్టి కుటుంబ వ్యక్తులవలె స్త్రీలు, పురుషులు, సమాన గౌరవ ప్రతిపత్తితోనే వర్తించు, సమతా సౌభ్రాత్ర ధర్మమే అమలులో నున్నదనుట నిక్కము.

నాటి సంఘములో పంచమ వర్ణముగాని అస్పృశ్య సంఘముగాని లేవు.

హిందూర్య సమాజములో మతమునందు కూడ చెప్పదగిన మొదటి మార్పు ఈ త్రేతాయుగమందే జరిగెను.

సమాజములో విజ్ఞాన శక్తులు వికసించినకొలది మత విశ్వాసములు కూడ మారజొచ్చెను. అగ్ని, ఇంద్ర, సూర్య, పర్జన్యాది సృష్టి పదార్థములే దేవతలు గావనియు వానియం

దంతరూ్భతమైన అద్భుతశక్తి కలదనియు అది వైజ్ఞానికసాధ్యమనియు వారు నిశ్చయించిరి. నాటి సృష్టితత్త్వ పరిశోధనా ఫలితాలే ఉపనిషత్తులు. వేదములకు చివరి భాగములుగా వెలసిన వగుటచే వీనికి వేదాంతములని పేరు గలిగెను.

ఐతరేయ, కవషైలూషాదులు, జన్మ కారణమునుబట్టి నిరసింప బడకుండుటయేగాక ఆర్య వాఙ్మయములో మంత్ర ద్రష్టలుగ గౌరవింప బడినట్లు స్పష్టపడుచున్నది.

అట్టియెడ అస్పృశ్య అనుపేరిట నొక సంఘమును ప్రత్యేకించుట వారి ఆదర్శ ధర్మమునకే విఘాతము. ఆ యుగమున ఎవ్వరిని అస్పృశ్యులని నిషేధింపలేదు సరిగదా మానవులలో సర్వ వర్ణములవారు సమానులని ఈ క్రింది యజుర్వేద సూక్తి ఋజువు పరచుచున్నది.

శ్లో॥ యథేమాం, వాచం, కళ్యాణీ మావదాని జనేభ్యః
బ్రహ్మ రాజన్యాభ్యాః శూద్రాయచార్యాయ స్వాయచార గుణాయ.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు, వారికి సంబంధించిన వారికి, నంతకంటె తక్కువ వారి కొఱకు కళ్యాణ ప్రదమైన వేదవాణి పలుకుచున్నది.

చారిత్రికులు క్షాత్రయుగమన్న ఈకాలమునకే పౌరాణికులు త్రేతాయుగమని చెప్పిరి. శ్రీ మద్రామాయణము త్రేతాయుగ సంబంధమైనది.

రామాయణకవి రస పిపాసతో చరిత్రాంశము విపరీతముగ మార్చి దానిపై రసవత్తర కథా సౌధము నెంత నేర్పుగ నిర్మించినను, తాత్కాలిక సాంఘికాచారములు కొన్ని

యందు చిహ్నితములై నేటికి ద్యోతక మగుచున్నవి. రాజులగు దశరథాదులు, నీచ కులజులనుకూడ గౌరవించినట్లు స్పష్టమగుచున్నది. వేశ్య పుత్రుడును, మాతంగి యువతి, అరుంధతికి భర్తయునగు వశిష్ఠుడు బ్రహ్మఋషియై సూర్య వంశమునకు గురు పురోహితుడయ్యెను.

కాని ఉత్తర రామచరిత కాలమునాటికి పరిసితులు మారెను. నిరపరాధియు,తపోనిష్ఠాగరిష్ఠుండును, వేదవేదాంగ పారంగతుడు, నయిన శంబూక మహర్షిని సూర్య వంశోద్భవుండును, మాయామానుష విగ్రహుండును, అవతార పురుషుండును అయిన శ్రీరామచంద్రుండు, సంహరించుట ఆర్య జాతికే మిక్కిలి కళంకమైనది. నేటికి చాతుర్వర్ణ్య వ్యవస్థ జటిలమై, కుటిలమై, పాతక ధర్మ సూత్రములచే నిండి నిబిడీకృతమైనదని స్పష్టమగుచున్నది.

## సూత్రయుగము

సూత్రయుగమున, ప్రారంభమైన, పాతక ధర్మసూత్రములు, అర్థరహిత వర్ణ నిబంధనలు పెచ్చుపెరిగి సూత్రయుగమున, విశ్వరూపము దాల్చినవి, న్యాయ సమ్మతమైన పెక్కు సాంఘిక ధర్మములు ఈ యుగమున తలక్రిందు చేయబడినవి. అది ఎట్లు జరగినదో యిందు గమనింతము.

సూత్రయుగమున, గుణకర్మలతో నేర్పడి పరివర్తన గాంచు వర్ణవ్యవస్థ, జన్మ విశిష్టమనియు, గుణముతో వర్ణము మారరాదనియు, అర్థరహిత నిర్బంధ వ్యవస్థగా శాసించిరి. చాతుర్వర్ణమును, ద్విజాతి, ఏకజాతి యనియు, సవర్ణులు

అసవర్ణులు అనియు, సంకీర్ణ జాతులనియు, అమాయకులగు ద్రావిడులను అంత్యజులనియు నిర్ణయించిరి.

ఈ నూత్న సాంఘిక విధులే, కల్ప ధర్మ సూత్రములు గను, స్మృతి సూత్రములుగాను రచింపబడెను.

ఈ యుగమున వైదిక మతమునందును గొప్ప మార్పు గావించిరి. అంతకు పూర్వము ప్రత్యక్ష రూపములతో ఆరాధింపబడు దేవతలకు, రూపకల్పన జేసి, విగ్రహ రూపము గల్పించిరి.

మూఢ జనులకు, ధ్యానయోగమున, భక్తి శ్రద్ధలు కుదర వనియు, విన్న దానికంటె కండ్లార జూచినది, చేత స్పృశించి నది, మరవ లేరనియు, కావున విగ్రహారాధన, అల్పబుద్ధులకు అవసరమను సాకుతో, దేవతలకు పూర్వకథల ననుసరించి, శిలా లోహ ప్రతిమలు నిర్మించి పూజించ సాగిరి.

శ్లో॥ ప్రతిమా స్వల్పబుద్ధీనాం, సర్వత్ర విదితాత్మనామ్
కాష్ఠలోష్ఠషు మూఢానామ్, సర్వత్ర విదితాత్మనామ్

ఈ సూత్రములే పై విధిని నిరూపించుచున్నవి. ఈ సూత్రయుగమున రచింప బడినవి ముఖ్యముగా అధర్వణ వేదము, మను ధర్మశాస్త్రము, మహాభారతము, కల్ప ధర్మ సూత్రములు, ముఖ్యములు. ఆర్యసమాజమునకు, వైదిక మత మునకు, ఈ సూత్రయుగముననే, అభివృద్ధి నిరోధకములు, జాతికి, దేశమునకు కళంక దాయకములగు, విస్మరింపరాని దుష్ట పరిణామము జరిగినదనుటలో సందేహము లేదు.

## మనుధర్మశాస్త్రము

దీనినే మనుస్మృతి యని కూడా అందురు. మనువు నిమ్న జాతులకు కఠినమైన ఆంక్షలు విధించి, అవర్ణులకు నిర్బంధ దాస్య జీవనమును శాసించెను. మచ్చునకు ఒక ఉదహరణ:-

సీ:- "చోరత్వమును జేయ శూద్రుని కవయవ
విచ్ఛేదనము శాస్త్ర విహిత మంట
ఆ దోషమునె విప్రుడాచరించిన యంత
మందలింపులె ధర్మమార్గమంట
బ్రాహ్మణీ స్నేహ సంపర్కము గల శూద్రు
నగ్ని కర్పించుట న్యాయమంట
శూద్రవనిత మరుల్ సొక్కిన విప్రుండు
సంతాప పడుటయే చాలునంట

గీ॥ ఇదియె మన ధర్మశాస్త్రము లిందునందు
నివియె చుమ్ము నిష్పక్షపాతైక బుద్ధి
మనకు గా జెప్పి పెట్టిన మహితములగు
గ్రంథరాజముల్ వానర రాజపుత్ర"

"శంబుక వధ - కవిరాజు."

ఇంతతో వదలక, అంత్యజులనియు, చండాలురనియు, కొన్ని సంకర జాతులను కూడ వర్ణించియున్నాడు.

మనుధర్మ శాస్త్రమునందు, అవర్ణులను, అస్పృశ్యులుగా వర్ణించుచూ, పెక్కు అమానుష శాసనము లను, మనువు విధించినాడు. అస్పృశ్యులు అనగా అవర్ణులు, బడుల

లోనికి బోవుట పాపమనియు, గుడులలోనికి బోవుట కూడదనియు మడులు గట్టుకొనుట అధర్మమనియు, గ్రామవీధులలో నడవ కూడదనియు, వస్త్రాలంకరణలు చేసుకొన గూడదనియు, పాలు, నెయ్యి మొదలైన బలవర్ధక పదార్థములను సేవించ కూడదనియు, ప్రపంచములో కనీ, వినీ ఎరుగని, నిర్బంధము లను విధించినాడు.

ఈవిధముగా అస్పృశ్యత ఈ సూత్రయుగమున తారా పథము నందుకొన్నదని చెప్పవచ్చును.

## అంత్యజ విచారణ

శ్లో॥ రజకశ్చర్మకారశ్చ నటో బురుడ ఏవచ
కైవర్త మేదభిల్లాశ్చ సప్తైతే అంత్య జాస్స్మతాః॥

చాకలి, చమారి, దొమ్మరి, మేదరి, పల్లెతోటి, కోయ జాతులు అంత్యజు లనబడుదురు.

అభక్ష్య భక్షణ అపేయ పాన అగమ్యాగమనులగు వారినే అంత్యజులని సంఘమునుండి వేఱుచేసి అంటదగని వారు అని చెప్పిరేమో! అని తలంచుటకైనను హరిజనులు ఆ జాతులకు సంబంధించినట్లుగ కనబడదు.

అస్పృశ్యత గుణగతమని ఇంతకుముందు వివరించితిమి. అది వ్యక్తులనుండి గుణముతోడనే తొలగిపోవలసి యుండు టచే చాకలి చమారుల అస్పృశ్యత మురికి వస్త్రములుదికి నపుడును, చర్మము బాగు చేసినపుడును, ఆ పనులు మాని శుద్ధులైయున్నతఱి వారు స్పృశ్యులగుటయే సమంజసము.

నేడు చాకళ్లు దేవళములందుకూడ ప్రవేశించుటచేతను వారు స్పృశించినగాని సవర్ణుల వస్త్రాలు పరిశుభ్రము గాకుండుటచేతను వారు అస్పృశ్యులని చెప్పరాదు.

ఇక దొమ్మరి, నాగులు అస్పృశ్యులన్నచో సవర్ణ ప్రపంచమున మహా విప్లవము రాకమానదు. మేదరులు నేడు స్పృశ్యులేగాని అస్పృశ్యులుగారు. పరాశరుడు స్మృతికర్త తమ యింటికి జామాత యగుటచేత, బెస్తవారి (అగ్నికుల క్షత్రియులు) అస్పృశ్యత అదృశ్యమగుట తప్పదుగదా! మిగిలిన తోటి, కోయలవారు అటవికులైనను, అస్పృశ్యులుగ పరిగణింప బడుటలేదు. ఇక అంత్యజులలో ఒక్క చర్మకారుల గూర్చి విచారింపగ వృత్తినిబట్టి తక్షక, తంతు వాయాది పంచవిధ శిల్పులతో పాటును అంత్యజులలోని నట బురుటాదులతోపాటైనను, తప్పక స్పృశ్యులే కావలసి యున్నది.

ఉత్తర భారత దేశమున చమారులను నామ శూద్రులను శూద్రుల లెక్కలందే పరిగణించు చున్నారనుట గమనింపదగిన విషయము.

## చండాల పద విచారణము

హరిజనులకు లోక వ్యవహారమున వర్తింపక యున్నను సనాతన వాదులు కొందఱు ఆ పదము వారికే వర్తించునని చెప్పుచున్నారు.

ఈచండాల పదమునకు నిఘంటువులలో ప్లవ, మాతంగ, దివాకీర్తి, జనంగమ, నిషాద, శ్వపచ, అంతేవాసి, చండాల పుల్కస, అనునవి పర్యాయ పదములుగ చెప్పబడెను.

వివిధ దేశములందున్న పంచముల పేర్లలో మాదిగ పదము వినా స్మృతులలో వాడబడిన, చండాల పదమునకు నిఘంటువులలో వాడబడిన దాని పర్యాయ పదములలోనే యొక్కదానికి గాని వికృతియని చెప్పదగినది కానరాదు.

దేశ భాషలు భిన్నములైనను, హిందూ సంఘమున కంతటికిని మూల గ్రంథము లొక్కటియే గాని వేఱుకావు. అన్ని రాష్ట్రములలోని హిందువులకును, గీర్వాణ భాషలో నున్న వేదములే ప్రమాణములు. హరిజనులు చండాలురే అయినచో చండాలాది పదములలో నొక్కదాని వికృతి పదముకూడ ఒక్క రాష్ట్రములోని వారైనను వాడకుండుట అసంభవము కాకపోదు. కావున హరిజనులు చండాలురు కారనుటకు ఇదియొక ముఖ్యకారణము.

శ్లో॥ శూద్రా. దాయోగవః క్షత్తా చండాల. శ్చాధ మోనృణాం।
వైశ్య. రాజన్య. విప్రాసు. జాయింతే వర్ణ సంకరాః॥ (మను10అ॥)

శ్లో॥ స్వాచ్ఛండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృష లేన యః(గురుబా)

స్మృతులనుబట్టి చండాల పదము శూద్రుని వలన బ్రాహ్మణ స్త్రీకి జనించినవారు ప్రతిలోమ సంకీర్ణు లనబడు దురు. కోట్లకొలదిగ నున్న హరిజన సంఘమునకు మన్వాదులు చెప్పిన ఉచ్ఛజాతుల అత్యాచారమే కారణ మనుట కంటె హేత్వాభాసము, కళంకదాయకము వేఱొండు ఉండ బోదు.

మరియు పరిశ్రమలు, కళలు వృత్తులుగా కలవారందఱును సంకరజన్ములే యని చెప్పు శాస్త్రములు విశ్వాస నీయములని పెద్దలెవ్వరును భావింపరు. అట్టి సంకీర్ణులు పూర్వము ఏకొలది

మందియో ఉండవచ్చును. వారింతకు ముందే సవర్ణులలో కలిసి పోయిరి. దేశమున మత. రాజ్యాంగ పరివర్తనలు జరిగి నపుడెల్లను ఇట్టి సంకీర్ణ సంఘములు పై సంఘములం దైక్య మయినట్లు చరిత్రలు చెప్పుచున్నవి. పరశురాముడు పల్లె వాండ్రను, బ్రాహ్మణులను చేయుటయు, పరదేశవాసులు రసపుత్ర వీరులగుటయు, బంగాళ, ద్రవిడ దేశములందు బ్రాహ్మణాభివృద్ధియు నిందుకు ప్రబల తార్కాణములు.

కర్మలను బట్టియైనను హరిజనులలో చండాలత్వ మెంతవర కున్నదో విచారింతము. మనుస్మృతిలో చండాల శ్వపచులకు నిర్ణయింపబడిన విశేష కర్మలు గలవు. ఒక యూరిలో నివాసముండక ఊరూరు తిరుగుచుండుట, కుక్క లను, గాడిదలను పెంచుట, కుక్కమాంసము తినుట, అనాగ రిక మ్లేచ్ఛ భాషలు మాట్లాడుట, ఇనుప కడియములు, చింపి గుడ్డలు ధరించుట, మొదలగు శ్రుత్యుక్త కర్మలు ప్రస్తుతము అస్పృశ్యు లనబడు మాల మాదిగలయందుకంటె ఎఱుకుల, యానాది, చెంచు, పాముల, డబుడక్కల మొదలగు తెగల లోనే విశేషముగను కొన్ని సంకీర్ణ జాతులందు విరళముగను కానివించుచున్నవి.

కర్మలనుబట్టి అట్టి వారిని వేర్పరచి అస్పృశ్యులనుగ నేడు మనము పరిగణించుటయే లేదు. వృత్తులు స్వేచ్ఛగ మారు చుండు ఆధునిక కాలమున కర్మలనుబట్టి జాతిని నిర్ణ యించుట సంభవము కాదు. శాస్త్రములం దుదాహరింప బడిన అనులోమ, ప్రతిలోమ సంకీర్ణ వ్రాత్య జాతులలో

పేర్కొనబడిన యనేక వృత్తులవారిపుడు సభ్య గౌరవార్హులై యుండుట సుప్రసిద్ధము.

శ్లో॥ రజకశ్చ ర్మకారశ్చ నటో బురుడ ఏవచ
కైవర్తమేద భిల్లాశ్చ స్వర్ణకారశ్చ సౌచిక.
కారు కోలోహకారశ్చ శిరోభేదీచ నాపితః
తక్షక స్సిలయంత్రీచ సునీచ క్రీతథా ధ్వజీ
ఏతే షోడశధా ప్రోక్తా శ్చండాలా గ్రామవాసినః
(హేమాద్రి ప్రాయశ్చిత్తకాండము)

చాకలి, చమారి, దొమ్మరి మేదరి, పల్లెతోడి, ఎరుకుల స్వర్ణకారులును, కుట్టుపని, రాలు చెక్కుట, లోహపుపని, క్షౌరము చేయుట, నూనె గానుగపని మొదలగు పదునాలుగు వృత్తులవారు గ్రామములో నుండు చండాలురు.

ఇట్టి వారందరును నేడు అస్పృశ్యులనుటకంటె హాస్యాస్పద విషయ మింకేమి కలదు?

కోట్లకొలదిగ నున్న ఈ సంఘమునకు స్మృతులు వచించెడి దుర్బల తరములగు హేయకారణములు విశ్వసనీయములు కావనియు, ఇది వ్యక్తిత్వము, సంస్కృతిగల ఒక ప్రత్యేక జాతి అనియు సునిశితముగ పరిశోధనచేసిన చారిత్రికులు వ్రాయుచున్నారు.

కావున హరిజనులు వృత్తులనుబట్టియైనను చండాలపద వాచ్యులనుట కాధారములు గానవచ్చుట లేదని సిద్ధాంతీకరించడమయినది.

## ప్రతీతి విచారణ

శ్రుతి, స్మృతులలోని ప్రమాణములు సర్వదా బాధితములని, గ్రహించిరియే, హరిజనులు. చండాలురనుటకు ప్రతీతి యొక్కటియే, అబాధితమగు కారణమని, సనాతన వాదులు కొందరు వ్రాక్రుచ్చుచున్నారు. ఆ ప్రతీతి కూడ అబాధిత మనుట, భ్రాంతిమూలక మనియే మాయాశయము.

ఏలయన హరిజనులకు, చండాలురని ప్రతీతియే లేదు. ప్రతీతి యనునది లోక వ్యవహార సిద్ధమై యుండవలెను. అట్టి హరిజనులు, తమలో తాముగాని, సవర్ణులలోగాని, లోక వ్యవహారము లందుగాని, మాల, మాదిగలనియే, వాడుచుండిరి గాని, చండాలురని, యెచ్చటను వాడుక లేదు. ఈ ప్రతీతి సనాతన వాదులు, హరిజనులతో జేయు వ్యవహారము లందు కూడ లేదు. కాని వారి ఊహా ప్రపంచమునందు మాత్రము ఉన్నది. హరిజనులును, యితర లోకమును, అంగీకరింపక వ్యావహారికములో లేనిది, ప్రతీతి యనుట కెట్లును పొసగ నేరదు.

అంతియకాక, సందేహ విషయ నిర్ణయమున. ప్రతీతి నెప్పుడును, ముఖ్య ప్రమాణముగా, సంగీక రింపరాదు. ప్రమాణములలో శబ్దము నికృష్టము, శబ్ద ప్రమాణములలో ప్రతీతి నికృష్టమైనది. కారణ మేమన, ప్రతీతులన్నియు సత్యము లగుటలేదు. సత్యేతరమగు ప్రతీతి విశ్వసనీయము కాదు. శాస్త్రముగాని, ప్రతీతిగాని, హేతు దృష్టితో, పరిశీలించి, సమీక్ష చేసి, సత్యము గ్రహించ వలను. అదియే విజ్ఞులగు వివేకుల కర్తవ్యము.

వివేకమును, విజ్ఞానమును, స్వబుద్ధి నుపయోగించక హేతు విరుద్ధములగు శబ్ద ప్రమాణములను, భ్రాంతి జన్యములగు ప్రతీతులను, ప్రమాణ రహితమైన, నిదర్శనములను, కిమ్మనక నమ్మవలసి వచ్చినచో, మానవునకు అధోగతి తప్పదు. జనులు నమ్ముచుండు శాస్త్ర ప్రతీతు లన్నియు, హేతువాద దృక్పథమునకు, విమర్శనాబుద్ధికి, సత్యములగుచుండుట లేదు. ఆకసము, నీరు, నీలవర్ణములనియు, భూమి అచలమనియు, సూర్యుడు భూమిచుట్టూ తిరుగుననియు, కల్లు, నేయి, పాల సముద్రము లున్నవనియు, ఏళ్లు, రాళ్లు మానవ, శిశువులను గనుననియు సూర్య, చంద్రాదులతో, మానవ స్త్రీలకు సంతానములు కలిగెననియు, రాహువూ, కేతువులు, సూర్య చంద్రులను మ్రింగుచుండుననియు. పర్వతములకు రెక్కలు కలవనియు, సూర్యునకు ఏడు గుఱ్ఱములు కలవనియు, కంఠమెత్తి చెప్పుచుండు పురాణప్రతీతులు, పెక్కులు గలవు. విమర్శనా దృష్టితో పరిశీలించిన అట్టి వన్నియు శుద్ధా బద్ధములని తేలుటలేదా? ఇట్టి యసందర్భములను, అసంగతములను, అవివేకములగు దబ్బర, దబ్బలను శాస్త్రమనిగాని, ప్రతీతి యనిగాని, విశ్వసించుట కంటె వెఱ్ఱి తనమేముండును? శాస్త్ర ప్రతీతులలోని సత్యమును దేల్చు నికషోపలము, స్వబుద్ధ్యనుభవ జ్ఞానమే కావున శాస్త్ర ప్రతీతుల కంటె, బుద్ధిప్రమాణము నంగీకరించుటయే, సత్యాన్వేషకుల కర్తవ్యము. ప్రమాణములలో బుద్ధ్యనుభవమే హేతు దృక్పథమే సర్వోత్తమమైనది.

## ప్రమాణ విచారణము

హేతువాదములో ప్రత్యక్ష ప్రమాణమే అంగీకార మైనది. హేతువాదము నంగీకరింపనివారు మూఢ విశ్వాస పరులేకదా! దేశము నింత నీచస్థితికి దెచ్చినది. ప్రత్యక్ష ప్రమాణము నంగీకరింపక, బుద్ధ్యనుభవమును, విశ్వసింపక, అర్థ రహితమైన శబ్ద ప్రమాణములను, మూఢముగా విశ్వ సించుటచేతనే, సనాతన వైదిక ధర్మము, సభ్య ప్రపంచమున పరిహాసాస్పద మైనది. సత్యేతరమగు ప్రతీతి, విశ్వాసనీయము కాదనుట, సర్వజనాంగీకృతము. కాబటి సర్వ విధముల హరి జనులు చండాలురు కారని తేలినది. కేవల ఊహాకల్పితము లగు ప్రతీతి ప్రమాణములో, హరిజనులు చండాలురనుట కంటె అక్రమము, అనుచితము, అధర్మము వేరొండులేదు.

## హరిజను లెవ్వరు?

అతి ప్రాచీన కాలమున, మన భారతదేశము మహో న్నతమైన నాగరికత, మహోదాత్తమైన సంస్కృతి, మహో జ్వలమైన సభ్యత కల్గి ప్రపంచమునందున్న దేశములయందు అద్వితీయమగా వెల్గొందు చుండెను. అప్పటికి, నేటి సభ్య దేశములైన అమెరికా, రష్యా, యింగ్లాండు మొదలైన దేశ ములు, మృగదశా విలోలములై యున్నవి. ప్రాచీన నాగరి కత గల, గ్రీసు, ఈజిప్టు, మెసపొటేమియా, సుమేరియా యింకను ప్రాదుర్భావము పొందలేదు, ఆనాటి సామాజిక వ్యవస్థయందు, మతములుగాని, వర్ణములుగాని, కులములు గాని లేవు. అప్పటికి మన దేశమునందు నివసించుచున్న యాదిమవాసులు ఒకేజాతివారనుట అనుమానా తతంబు,

ఆర్యులు మన దేశముపైకి దండయాత్ర సల్పక మున్ను నివసించుచున్న ఆదిమ వాసులను ద్రవిడులనియు, దస్యులనియు, రాక్షసులనియు వానరులనియు, ఆర్యవాఙ్మయము ఘోషించుచున్నది. ఆర్యులు మధ్య ఆసియానుండి గాని, మధ్య ఐరోపానుండి గాని, [1] ఉత్తర ధ్రువమునుండి గాని, యూరల్ పర్వత ప్రదేశమునుగడిగాని, కాస్పియన్ సముద్ర ప్రాంతమునుండి గాని మన దేశమునకు పొట్ట చేతబట్టుకొని వచ్చిరని, [2] చారిత్రకుల అభిప్రాయము.

ఆర్యులు మనదేశమునందే పుట్టిరనియు, కొందరి చారిత్రకుల అభిప్రాయము, దీనికి తగిన ఆధారములు లేవు.

ద్రావిడులు ఆర్యులకంటె నాగరికత కలవారిని కొందరి అభిప్రాయము. అట్లు కాదని మరికొందరి అభిప్రాయము. కాని ద్రావిడులు విశేష విజ్ఞానసంపన్నులై పట్టణముల నిర్మించుకొని, సింధు, గంగా ప్రాంతములలో నివసించు చుండెడివారని *నేటి చారిత్రకుల అభిప్రాయము. నేటి మహంజుదారో, హారప్ప త్రవ్వకములే దీనికి ప్రబల సాక్ష్యములు (బెంగుళూరు మ్యూజియమ్‌నందు కలవు). వీరు నౌకా నిర్మాణమున నేర్పరులై, సముద్రయాన మొనర్చి, ఈజిప్టు, రోమ్, హిందూ చైనా, మలేషియా, సుమిత్రా, జావా, బోర్నియో మొదలైన దేశములతో వ్యాపారము చేయుచుండెడివారు.

1 బాలగంగాధర్ తిలక్ (2) *H. G. Wells.*

* దక్షిణ భారతదేశ చరిత్ర, కె.కె. పిళ్ళె ఎం.ఏ. యల్.టి. (డిలిట్, డిపిల్ ఆక్సెన్, మద్రాసు విశ్వవిద్యాలయం.)

వీరు శైవభక్తులు. భద్రకాళి వీరి, అధిష్ఠాన దేవత, సాంఘికాచారములు బహువిచిత్రముగ నుండును. సర్పము, హంస, నెమలి, నంది మొదలైనవాటిని పూజించు చుండెడి వారు. నాగుల చవితినాడు, పూబోడులు పుట్టలో పాలు బోసి, నాగేంద్రుని పూజింగెడివారు. చెట్టును, పుట్టను, రాయిని, అప్పను మొదలగువాటిని కూడా పూజించెడివారు. అంకమ్మ, పోలేరమ్మ, మద్దిరామమ్మ మొదలైన గ్రామ దేవతలను ఎక్కువగా పూజించెడివారు. నేటికిని, ద్రవిడ దేశమున యిట్టివి మనము చూచుచునే యున్నాము.

## ఆర్యులు

ఇట్టి పరిస్థితులలో ఆర్యులు మన దేశముపైకి దండ యాత్ర సల్పిరి. క్రమక్రమముగా ద్రావిడుల భూములాక్ర మింప సాగిరి. ఇందువలన ఉభయ సంఘములకు పొత్తు కుద రక జగడము లుద్భవిల్లి భయానక యుద్ధములు జరిగెను. ఆ యుద్ధములనే కవిరాజుగారు సూతపురాణములో (రెండవ అశ్వాసము) ఈ క్రింది విధముగా వర్ణించెను.

ఉ॥ గండర గండలై పిటికి కండ యొకించుక లేక. చండ దో
ర్దండ గదా ప్రహారముల, దండు పయింబడి పోరుచుండగా
నేండులు, పూండులున్, గడచె నింతియకాని జయంబు,మాత్రమున్
రెండు, కుదుళ్ళ వారిని వరింపక పోయె నిఁకేమి చెప్పెదన్.

ఆర్యసంఘ మంతయు నిట్లు నిరంతరమును ద్రావిడుల తోడి యుద్ధకార్యముల యందే నిమగ్నమై యుండుటచే

కృషి, వాణిజ్యాది వ్యాపారము లన్నియు స్తంభించుకొని పోయెను. ఆ యవసరమున సాంఘిక సత్వములను సంరక్షిం చు నిమిత్తమై బహుబల యుతులగు యోధులను కొందఱను సంఘరక్షకులగా ప్రత్యేకింపవలసి వచ్చెను. వారే క్షత్రియు లనబడిరి. వారి నియంతయే రాజు. ఆ రాజులకు సంఘ రక్షణ కార్యములందు సత్సలహా లిచ్చుటకును. వైదిక కర్మ లాచరించి ప్రజా పీడ మాన్పుటకును; సమర్థులగు విద్వాం సులు నియమితులైరి. వీరు బ్రాహ్మణు లనబడిరి. ఈ రెండు వర్గములను సామర్థ్యమును బట్టి యేర్పడు నేటి ప్రభుత్వశాఖ లవంటి వేగాని, నేటివర్గములవలే, జాతివిశిష్టములు, శాశ్వతములు మాత్రము కావు. ఉద్యోగశాఖలగు, నీరెండు శాఖలను గాక మిగిలిన యార్య సంఘమంతయు వైశ్యులని పిలువబడు చుండెను. ఆర్యులిట్లు రాజు రాణువ రథములు మొదలగు రణసాధన సంపదను సంతరించుకొని ద్రావిడులను ప్రతిఘ టించ సాగిరి. ఉభయులకు ఘోర యుద్ధములు సాగెను. కొన్ని వందల యేండ్లు జయాప జయములు ఎవ్వరిని, వరించ లేదు. ఆర్యుల కుటిల రాజనీతిచేతను, కుటిల యుద్ధ తంత్రాం గము చేతను ద్రావిడులు వీగిరి. ద్రావిడులలో కొందరు తమ సుక్షేత్రములు వీడి సమీప సాంద్రారణ్యములలోని కొండ కోనలకు, జేరుకొనిరి. మిగిలిన వారిలో పెక్కురు దక్షిణా పథమునకు వలస దీసిరి. శేషించినవారు తమ మాతృభూమి యగు సింధు మైదానపు సుక్షేత్రములను, వీడలేక యార్యుల శరణుజొచ్చి శూద్రులనబడిరి.

అప్పుడే జాతివైషమ్యము ప్రారంభించినది. ఆర్యులు ఉత్తర దేశమును, పుణ్యభూమి యనియు, దక్షిణ దేశము

పాపభూమి యనియు(సంస్కృత కవులు) తమ గ్రంథములందు యిష్టము వచ్చినట్లు వ్రాసిరి. ఆర్యుల మాతృభాష గీర్వాణ భాష, దీనినే దేవభాష యనియు సంస్కృతమనియు కూడ, అందురు. ఆర్యులు మన దేశము ప్రవేశించు నప్పటికి బ్రహ్మ, క్షత్రియ వైశ్యులను మూడే వర్ణము లుండినట్లు యింతకు ముందే తెలిసికొని యుంటిమి. నాల్గవ వర్గము, విజితులైన ద్రావిడులు. వీరినే శూద్రులందురు. శూద్రులు గీర్వాణ భాష అభ్యసించ గూడదనియు. వైదిక మత గ్రంథములైన, వేదములు చదవకూడదనియు, వీరు శాసించిరి. దీనితో జాతి వైషమ్యము పెచ్చు రేగినది. వీరికి సర్వస్వములును నిషేధించ బడినవి. వీరు గోవులను పెంచి, ఆవుపాలు త్రాగి, సేద్యము చేసి బ్రతుకుచుండెడి వారు.

నదీనదములతోను, తరులతా గుల్మములతోను, నానా విధ మృగ శకుంత సంతానములచేతను పరివేష్టితమైన భారత దేశము వారికి జన్మస్థలమయ్యెను. వీరు మాంస భక్షకులే గాక, గోమాంస భక్షకులు కూడాను. వీరి వివాహాది ఆచార వ్యవహారములు బహు వింతగ నుండును. ఒక స్త్రీని అయిదుగురు వివాహ మాడుట తప్పులేదు. దీనికి భారతము నందలి ద్రౌపదియే సాక్షి.

ఇక ద్రావిడులమాట విచారింతము. తొలుత ఆర్యులతో కలహించి కొండ కోనలకు జేరిన యాదిమ, ద్రావిడ సంతతివారు కొండలనువీడి, క్రమముగా ఆర్య గ్రామసీమలకు జేరదొడగిరి. ఆర్య సంతతివారు తమ విరోధి సంతానమగు ఆది ద్రావిడులను విశ్వసింపక. పూర్వ వైరమును బురస్కరించుకొని, పగ సాధింప బూని, స్వగ్రామములో నివసింప

నీక, వెలిబెట్టి పుర బాహ్య ప్రదేశములకు నెట్టివేసిరి. అనన్య గతికులగుటచే ద్రావిడులు తిరిగి అడవులకు పోనేరక, ఆర్యుల యాజ్ఞలను పాలించుచు, గ్రామముల వెలపలనే నివసించు చుండిరి. ఆ ఆది ద్రావిడ సంఘమువారే మన హరిజన సంఘము, హరిజనులు, ప్రసిద్ధులగు ఆది ద్రావిడ సంతతివారై నట్లు సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులచే నిర్ధారణ చేయబడి నది. కావున చారిత్రక దృష్టితో జూచిన హరిజనులు ఆది ద్రావిడులని తేలుచున్నది. మాల, మాదిగల గూర్చి, మన పూర్వగాధలు, చరిత్రములు గూడ ఈ అభిప్రాయమునే బల పరుచుచున్నవి.

తెలుగు దేశమున, హరిజనులలో నొక తెగకు మాల లను పేరు గలదు, "మల" యనగా కొండ యని యర్థము. మలలందు తొలుత నివసించెడి వారగుటచేత, వీరికి మాలర్ లను పేరు వాడబడుచుండెను, ఆ మాలర్ అను పదమే క్రమ ముగా లోక వ్యవహారమున రేభము లోపించి, 'మాల' లన బడు చుండెననియు, నాంధ్ర చరిత్రకారులు వచించు చున్నారు. దీనిని కాదనుటకు యెట్టి అభ్యంతరములు వెలు వడ లేదు. మఱియు తెలుగు దేశమున మాలనూలను వాడుక యున్నందున, వీరికి దొలుత నూలు వడకుట ముఖ్యవృత్తి యైనట్లు స్పష్టపడుచున్నది. నూలు వడికి, నేయువారెన్నడు అస్పృశ్యులు కారు. విదేశపునూలు పోటీ వచ్చినది; మొదలు వీరా వృత్తి మాని సేద్య వృత్తిలో కాలము పుచ్చుచుండిరని తోచుచున్నది.

మహారాష్ట్ర దేశపు పంచములగు మహారులకును, వంగదేశపు పంచములగు మాల్ లకును, తమిళ దేశపు పంచములగు పరియకులను ఐతిహాసికులు పై కారణముననే, సిద్ధాంతముచేసి చెప్పుచుండుటచే ఈ హేతువు నలుపేటలం జెనచిన త్రాటి వలే బలవత్తర మగుచున్నది.

## మాదిగలు

ఆంధ్రదేశమున హరిజనులలో మఱియొక తెగవారికి, మాదిగ లని పేరు. వీరి విషయమున రెండు అభిప్రాయములు కలవు. ఆర్యుడగు మాతంగర్షి సహజముగా కోపిష్ఠి యగుటచే ఆర్యులాతని చెండాలునిగా పరిగణించి, సంఘ దూరుని గావింప, నాతడు దక్షిణాపథము ప్రవేశించి, కిష్కింధసమీపమున ఒక కొండపై నాశ్రమము నిర్మించుకుని, యుండెను. అందువలన ఆ కొండకు మతంగ గిరియను పేరు వచ్చెను. అనంతర మాతని సంతతి వారిని, మతంగ గిరి, నివాసులును, మాతంగులని, పిలుచుచుండిరి. మాతంగ భవశబ్దమే మాదిగ; యనియు నొక అభిప్రాయము.

ద్రావిడులు తొలుత శాక్తేయ మతస్థులు గావునశక్తికి పర్యాయపదమగు మాతంగి శబ్దమువలన, తద్భక్తులకుకూడ మాతంగులను పేరు వాడబడు చుండెనని, మరియొక అభిప్రాయము. ఈ రెండు కారణముల వలనను మాదిగలు చండాలురనుటకు, హేతువులుగాక, విశేషించి వారి యార్య ద్రావిడ సభ్యతనే చాటుచున్నవి.

ఆది ద్రావిడ సంఘమువారు, పూర్వము వీర్యవంతులై యుద్ధము లొనరించినట్లును పరాక్రమ వంతులై రాజ్యము లేలినట్లును, కవులై జ్ఞానదాత లైనట్లును, ఈ క్రింది చరిత్రాంశము వలన తెలియుచున్నది.

పశ్చిమ దేశమందు, మళయాళమున కొంత భాగము నకు, తుళువదేశమని పేరు. బహు ప్రాచీనకాలము క్రిందట ఆ తుళువ దేశమును, పంచములే పాలించుచుండిరి. ఆ కాలమున నుత్తర కర్ణాట దేశముతోని వనవాసినుండి కదంబ రాజులు వచ్చి తుళువదేశపు రాజులగు అంత్యజులను బాధింపుచుండిరి. ఆ కదంబ రాజులలో మయూరవర్మ ముఖ్యుడు. కొరగారు లను నిమ్నజాతి, రాజు హనశిఖుడను వీరుడు, తుళువ దేశీయులకు, సహాయుడై, కానరగాడు రాజుయొక్క సైన్యములతో, మయూర వర్మను పారదోలెను. తరువాత మయూరవర్మ పుత్రుడగు లోకాదిత్యుడు గోకర్ణమునుండి గొప్ప సేనతో వచ్చి, హనశిఖునోర్చి, పంచములలో నొక తెగవారగు కొరగారు ప్రభువు కుటుంబమునందలి యొక కన్యను పరిణయమై యచటనే నివసించెను. వారికి బ్రాహ్మణులు మంత్రులుగ నుండిరి. హీనజాతి వారుగ నెన్నబడిన యా కొఱగారు రాజైన నందుడు మంగుళూరునకు సమీపమునందలి నందవరము నుండి, గొప్ప సేనలతో బైలుదేరి లోకాదిత్యుని జయించి, యాతని జనులను తుళువదేశము నుండి పారదోలి కొఱగారు ప్రభుత్వము నట స్థాపించెను. పిమ్మట రెండు వందలేండ్లు నందుని వంశమువారు తుళువ రాజ్యము నిరాటంకముగ నేలిరి. అనంతరము మయూర వంశజుడగు కామదేవుడు వనవాసినుండి మరల దండెత్తివచ్చి,

తుభున రాజ్యమును జయించి కొంగారులను హీనదశకు దెచ్చెను. ఆనందుని వంశము కనకుడను సుప్రసిద్ధ కవి జనించెను. ఈ చరిత్రాంశము కూడ హరిజనుల సభ్యతను, సంస్కృతినే వ్యక్తపరచు చున్నది. కావున, హరిజను లాదిమ ద్రావిడ సంతతి యని సిద్ధాంతమగుచున్నది.

## హరిజనుల స్థితి

భరత ఖండమునందు భిన్న రాష్ట్రములలోగల మాల మాదిగ, పరయ, పుళియ, పోలియ, మెహతర్. మహర్, ఢేళు, నామశూద్ర మొదలగు నామములతో వ్యవహరింపబడు హరిజను లందఱును కలిసి సుమారు 10 కోట్లకుఁ బైపడి యున్నారు, అనగ హైంద సంఘములో కొంచెము హెచ్చుతగ్గుగ 1/5 వంతు ఉన్నారు అని చెప్పనచ్చు. నేడు వారిస్థితి మిక్కిలి శోచనీయమై యున్నది, వీరందరకును ఒంటిపూటయైనను కడుపునిండా తిండి లేదు. కట్టుటకు సరియైన వస్త్రములు లేవు. పండించుకొనుటకు పొలములు, ఉండుటకు ఇండ్లుగాని లేవు. అవి సంపాదింపరాదు. ఇక విద్యాగంధము అంతకంటె సున్న. కోళ్లు. పందులే వారి ధనము. మురికి గుంటలే వారి వసతి గృహములు. అంటు వ్యాధులే వారి సహచరులు. అతిమాంద్యమే వారి యాచార్యుఁడు. సేవక వృత్తియే జన్మ హక్కు. అతి దారిద్ర్యమే అధిష్ఠాన దేవత. ఇతర హిందువులు వారినంటనీయరు. సమీపింప నీయరు. ఊరిలో కాపురము, బజారులో వ్యాపారము, చెరువులో జలపానమును చేయనీయరు. కొన్ని ప్రాంతములలో వీరు వీధులలో నడువను, ఉమియను రాదు. కొన్ని వేళలందు

వీరిని సవర్ణులనువారు చూడను, దలపెట్టనురాదు. సవర్ణులగు హిందువులు కత్తులబోనుఁలోని ఇన్ని నిర్బంధములు గల్పించుటతో వీరిని జీవజంతులుగ నైన పరిగణింప నిష్టపడ కుండిరని తలంచుట సత్యదూరము కాదు. మానవులై హిందూ మతమునందున్న వీరికంటె మానవేతర జంతువులగు కుక్కలు, పిల్లులు మొదలగు తిర్యగ్జంతువులే ఉచ్చతర జీవులని రాయిగుద్ది చెప్పవచ్చును. ఇంతవల సర్వ దౌర్భాగ్య స్థితికిని వీరు జీవగఱ్ఱలని చెప్పిసచాలును. భారతమాతయొక్క బలవత్తరమగు బాహువులే యిట్లు పడిపోయి యుండగా బహుధా కృశించియుండగా ప్రఫుల్ల చంద్రరాయలు వచించినట్లు భారతీయ సంఘవ్యక్తి యారోగ్యవంతమని గాని, బలవంతమనిగాని చెప్పుటకు నోరెట్లు ఆడునో తోచకున్నది. దేహములోని ఏ ఒకటి రెండవయవములో బలుపుగాంచిన యెడల అవి రోగ చిహ్నములుగాగాక ఆరోగ్య హేతువులు కానట్లే సర్వ సంఘములును అభివృద్ధి గాంచినగాక ఒకటి రెండు సంఘముల అభివృద్ధి, జాత్యభివృద్ధికి చిన్నెలు కావని బుద్ధిమంతు లెఱుఁగ నిది కాదు. "సర్వే జనాః సుఖినో భవన్తు" "ఆత్మవత్ సర్వ భూతాని" "అహింసా పరమో ధర్మః" అని శ్రుతు లుద్ఘోషించుచుండగా, అస్పృశ్యతా దుస్సహ ధ్వనులుప్పతిల్లుట అశుభోదర్కమని మనవి చేయుచున్నాము.

## సాంఘిక దౌర్జన్యము

ఇక నీ హరిజనుల దుస్థితికిఁ గారణము ఇంచుక చర్చించి చూతము. వీరభివృద్ధి గాంచుటకు వీరియందు ప్రకృతి విజ్ఞాన వికాస శక్తులు లోపింప చేసెనా లేక సాంఘిక దౌర్జన్యముచే

మూసి వేయబడినవా? అని విచారింపగ రెండవకారణమే బలవత్తరమైనదిగ సహృదయులగు విజ్ఞులకుఁ గోపకమానదు. ఆది ద్రావిడుల దుర్దశకు నిష్కారుణ్యము స్వార్థపరమునగు చాతుర్వర్ణ్యపుటనాదరమే కాని వేఱు కారణము కనబడదు. "పృష్ఠ తాడనాత్ దంత భంగః," యనునట్లు ఎన్ని తరములనాటి వారి పెద్దలో తమ పెద్దలతో విరోధించిరన్న కా॰ణమున అనపరాధులు అమాయకులు అగతికులు నగు సోదర సంఘములను మానవ సత్త్వములకు వెలిజేసి అంటరానివారని నిషేధించుటతో సవర్ణులు తమ అవివేక ధ్వజమునే స్థిరస్థాయిగ ప్రతిష్ఠించుకొనిరని చెప్పవలసి యున్నది.

## ప్రచండ శాసనములు

సంఘ నియంతలగు పురోహితులు అమాయకులగు నీ దీనులపై చలపట్టి గ్రామములో వసింపనీయక పోవుటచే ఊరు వెలుపల నుండవలసి వచ్చెను. విద్యాబుద్ధులు మత ధర్మములు ఆచార వ్యవహారములు పురోహితులచే విధింపబడి హరిజనులను నీచాచారులం జేసినవి. అంతేవాసులగు వీరినే తరువాతివారు, స్మృతి సూత్రములలోని సంకీర్ణులుగ చండాల జాతియని భ్రమించి వీరికి పాత్ర లుండరాదనియు, గాడిదలు కుక్కలే వీరి సొత్తనియు, చచ్చినవారిపై కప్పిన వస్త్రములే వారు ధరింపవలయుననియు, కుండ పెంకులలో భుజింపవలయుననియు, ఇనుప కడియములే ధరింపవలననియు, ఒక చోట స్థిరముగ నివసింపరాదనియు, కర్మానుష్ఠాన సమయమున వారిని చూడరాదనియు, మాట్లాడ రాదనియు, వారి కన్నము మన చేతులతోడ పెట్టరాదనియు, చెప్పులు, చర్మ

ములు మొదలగు వానిని వీరు మోసికొని పోవలయుననియు,
మరణ దండన విధింపబడినవారిని వారే శిక్షింపవలయుననియు,
వర్తకము, వ్యవసాయము మొదలగు స్వతంత్ర వృత్తులు చేసి
కొనరాదనియు, భూ పశు ధనములు సంపాదింపరాదనియు,
స్మార్త ధర్మముపేరిట అమానుష ప్రచండ శాసనములు వీరి
పై నమలు జరుప ప్రారంభింప బడినవి. హరిజనుల వరకు
పోనేల? సామ్యసత్త్వమును గోరి ప్రతిఘటించిన విశ్వబ్రాహ్మ
ణాది ఉచ్ఛ సంఘములనుగూడ శుభకార్యములందు నలు
కంబములతో ముంగిట పందిరి లేసికొనీకయు, పల్లకు లెక్క
నీకయు, అతి నీచులనుగ పేర్కొనియు, పీడించెడు దుశ్శాస
నములు నిన్న మొన్నటి వరకు మన ప్రాంతమున అమలు
నందే యుండెను గదా! నేటికిని కొన్ని సంఘములవారు
పైవర్గమువారి ఎదుట చెప్పులు, గొడుగులు వేసికోరాదు.
బండ్లు మొదలగు వాహనములు ఎక్కరాదను నిర్బంధము
విరళముగ లేకపోలేదు. కొన్ని సంస్థానము లందును, మళ
యాళ దేశములోను నిన్న మొన్నటివరకు హరిజను లంట
రానివారే కాక సమీపింపరాని వారుగ కూడ నున్నారని
పాఠకు లెఱుగనిది కాదు.

విలోమ సంకీర్ణులగు చండాలుర కొఱకు నుద్దేశింప
బడిన ప్రచండ శాసనములు పవిత్ర జన్ములగు ఆది ద్రావిడు
లపై నమలు జరుపుటలో హాస్యాస్పదమగు నీక్రింది కథ
జ్ఞప్తికి వచ్చుచున్నది,

ఒక మూర్ఖరాజు "ద్వారాలు చిన్నవి నేరగాడుస్థూల
కాయుడగుట కారాగారమున నెట్టలేకున్నామని భటులు
చెప్పగా విని సరేవానిని వదలివేసి వానికిబదులుగ ద్వారాలు

పట్టదగిన సూక్ష్మకాయునెవ్వనినైన బట్టి తెచ్చి ఖైదు చేయుడన్నాడట.

మానవులను, మానవ సామాన్యములగు జన్మహక్కులకు దూరమొనరించి శాశ్వతముగా బాధించునట్టి, క్రూర కర్మలే మానవ ధర్మములుగా జెల్లుచుండ నాటి ధర్మ స్వరూపము ఎంత భయంకరమైనదో యైతిహాస దృష్టిగల పాఠక మహాశయులకు విశదము చేయనక్కరలేదు. దేశ సౌభాగ్యమున కాయువు పట్టులగు వ్యవసాయము, పశు పాల్యము, గృహ వస్త్ర నిర్మాణము, చర్మ కర్మలు చేయుచు సంఘాభ్యుదయమునకు దోడు పడుచుండు నిరపరాధులగు సోదర సంఘముల నిట్లు శాసన రూపమున పారంపర్యముగా చిత్రవధ జేయుటకంటె వేరొండుపొరపాటుకలదా?నాడట్లు శస్త్రము చేయక శాస్త్రములో శాత్రవము సాధింప బూనుటచే కనుపుల్ల (గంటము = Pen) పోటు కంటెను కఱకై నేటికిని, తత్సంతతిలోని ప్రతి వ్యక్తిని, హింసించుట, భరత మాత హృత్పటలములో అగ్నిజ్వాలలు రేపుటయే కదా!

## హరిజనులు - గుణసంపద

మన హరిజన సోదరుల యెడల మన మొనరించుచున్న అపరాధములను తలంచుకొనిన దయావేశముగల మానవుని గుండె నీరు గాక మానదు. మనము వారి నంటనీక పోవుటయేగాక గ్రామములలో నుండనీక, బడులలోనికి బోనీయక, గుడులలోని రానీక, భూధనముల సంపాదింప నీక వాణిజ్య పరిశ్రమ లొనరపనీయ నిర్బంధించుంటిమిగదా? నీరు, భూమి, గాలి వెలుతురు,విజ్ఞానము, విద్య గౌరవసంపదలు

కొన్ని సంఘముల కొరకే ప్రత్యేకముగా సృజింపబడినవని, ఉద్ఘాటించుచు, పౌరహిత్యపు తలలో బుట్టిన, విషబీజములు, నేటి వైజ్ఞానిక వాతూలముచేత. మాడి పోవుచున్నవని విశ్వసింపక తప్పదు.

సీ॥ మోయకున్ననె మిమ్ము మోయునటుల మమ్ము
భూమత్కునకు దీవి, భూమి దేవి
మీకు వెన్నల గాచి, మాకు గాయుటలేదె
చలువల పరసీమ చందమామ
మీ మీదనేగాని మా మీద వీవకే
సరస సౌరభశాలి చల్లగాలి
వెలుగు వేడియు, మీకు గలిగించి మాకీడె
భవ్యసౌఖ్య కరుండు, భాస్కరుండు
గీ॥ కురిసి, మీపైని, మాపైని గురియదొక్క
సకల సస్యావన సుకీర్తి జలద మూర్తి
దైవ దృష్టికి పక్షపాతంబు లేదు
సృష్టి వీక్షించి, తెలియరే శిష్టులార!

(నిరుద్ధ భారతం)

అని, యిట్లు హరిజనులు మనలను ప్రశ్నించు చున్నారు; కుతర్కముల చెంతకు బోకు. సరస మార్గమున వారికి సమాధాన మొసగ వలసిన బాధ్య మనపైన ఉన్నది. అంతేగాదు నిష్పక్షపాత బుద్ధితో విచారించిన, శమ, క్షమాది, సాత్విక గుణములు హరిజనులయందు గాన్పింపక పోవు. "శమో దమ తప శ్శైవ క్షాంతిరార్జవ మేవచ" యని గుణముల పట్టీని చిలుకవలె వల్లెవేయు, సవర్ణులకంటె, అనుష్ఠానములో సత్వ

గుణములను ప్రదర్శించు హరిజనులు ఘనులు కారా? నిరప రాధియై, పేరున బిలువక, ఏకవచనముతోనే,సవర్ణుడు బిలుచు చున్నను, ప్రతిఘటించి, పల్లెత్తుమాటయైనను నాడకుండు టయు, ఏవగింపనునది యెరుంగక, సమ్మార్జన పని(పాకీపని) కార్యము లందత్యంత శ్రద్ధ వహించుటయు కలిగిన సౌకర్య ముల తోడనే తృప్తి జెంది యుండుటయు, హరిజనులకుఁగల నయ వినయ క్షమాత్యాగ గుణములను సాంఘిక సేవా సక్తియు వేనోళ్ల చాటుచున్న దిగదా ?

కోపము నుగ్గును గర్వము నాపోవని యునికియును దురభిమానము నిర్వ్యాపారత్వము, అనునవి కాపురుష గుణ ములు గదా! అగ్రవర్ణులలో నవ్వారిగ నగపడుచున్న ఈ లక్షణములు నిమ్న జాతి జనులలో ఎంత అపు రూపములో వేఱు చెప్ప పనిలేదు. అట్టి సుగుణ సంపన్నుల సాహచర్య మన్నింటను మన కవశ్య కర్తవ్యమై యుండ, అట్టివారు జన్మ సిద్ధములగు హక్కులకుఁగూడ అర్హులు గారనుట ఎంత అవి చార మూల దౌర్జన్యమో గమనింతురు గాక !

## హరిజనులకు మత పరివర్తనము

మనము వారి అభివృద్ధి మార్గముల నన్నింటి నరికట్టి యిట్లు కడలేని కడగండ్లపాలు గావించుచున్నను, కాలవశ మున వ్యక్తి సహజమగు ఆత్మవికాస స్వాతంత్ర్యాభిలాషలు వారిలో పొడసూపినవి. గాని అగ్రజాతుల మనస్సు లెప్పటి కైనను కరుగునేమోయని అనేక వత్సరములు వారు నిరీ క్షించిరి. ఆర్య ధర్మహృదయులు కరుగలేదు సరిగదా మీదు

మిక్కిలి ఘనీభవించి యంత్ర ప్రాయమైనట్లు ఎట్టకేలకు గ్రహించిరి. హిందూ మతమున తమ కిక తావులేదనియే నిశ్చయించుకొని ఆదర పూర్వకముగ తమకు స్వాగత మొసగుచున్న ఇస్లాము, సిక్కు, క్రైస్తవాది మతములనాశ్రయింపఁ జొచ్చిరి. కరుణా మయుడైన సర్వేశ్వర సామ్రాజ్యమున తోడి మానవులతోఁ బాటు జన్మసత్వములు, గలిగిన హరిజనులు స్వమతస్థులైన సవర్ణులను సమీపించుటకైనను, పనికిరాని పరమ నీచులుగ పరిగణింపబడు చున్నపుడు, వారు హిందూ మతమును వీడరాదనియు మతమును మార్పక స్వమతము నుండియే ఆత్మశక్తితో కష్టించియైనను తమ హక్కులు సాధించుకో వలయుననియు కొందరనుచున్నారు.

సాటివారితోపాటు సాంఘిక సత్వములలో జీవితానంద కరములగు ధర్మార్థ కామములు స్వేచ్ఛగ అనుభవించుటయే వారు కోరుచున్నారు. అట్టిస్వాతంత్ర్య వాంఛ జీవులకు సహజము.

మన నాయకులు అందుకొఱకే చిరకాలము నుండియు సర్వ శక్తులు ధారపోయుచున్నారు గదా! భారత జాతినే అంటరాని వారిగ పరిగణించుట చేతనే గదా దక్షిణాఫ్రికా ప్రభుత్వముపై గాంధీ కత్తి గట్టినది! అట్టి సంఘ గౌరవమునే హరిజనులు వాంఛించుటలో అ సహజత లేదు.

నేటికైనను వివేకులమై న్యాయముగ వారి హక్కులను వారికొసగినచో వారు మన సంఘమునకు మన దేశమునకు అండమై నిలుతురు. లేనిచో వారన్య మతము నవలం

బించి వాంఛితార్థమును బడయుట దోషము కాదనియే మా విశ్వాసము. అమ్మ తాను పెట్టదు, అడుగుకొని తిననీయదు అన్నట్లు మన మీాయకపోగా ఒరుల వలన గౌరజీవనమును పొందుట నొల్లకుండుట విచిత్రముగదా! తినక రుచియు దిగక లోతును తెలియవను సామెత యదార్థము. గొడ్డు రాలికి పురిటినొప్పులేమి తెలియును అని సామెత (నహి వంధ్యా విజానాతి గుర్వీం ప్రసవ వేదనాం). బాధపడువాని బాహ్య చిహ్నములను బట్టి పరుల కాబాధ కొలదిగనే గోచరించును గాని ఏ విషయమందైనను పరిపూర్ణ జ్ఞానమే కావలయును. అందువలన పెద్దలు అనుభవ జ్ఞాన జన్యమగు ప్రత్యక్ష ప్రమాణమునే అగ్రగణ్యముగ వాక్రుచ్చిరి, స్వానుభవము వలన యితరుల కష్టము లన్నుగ్రహించి వర్తించుటయే పరమ ధర్మ మను నార్యోక్తిని వ్యక్తీకరించు నీ క్రింది పద్యము పాఠకులకు శ్రుతపూర్వము.

పరు లేయవి యొనరించిన
నరవర ! యప్రియము తన మనంబున కగుఁదా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్.

(భారతము)

కావున హరిజను లస్పృశ్యులనియు, వారెన్ని కష్టము లనుభవించుచున్నను వారు మతము మార్చుకొనరాదను వారును ఆస్థియందే తామున్నట్లు భావించినచో వారియెడల తమ ధర్మము బాగుగ వ్యక్తమగునని మనవి చేయుచున్నాను.

హరిజనులు హిందూ మతమునే నమ్మియుండి శివ రామ కృష్ణాదులనే ఆరాధించుచు మన అడుగుజాడల నడచి మనలఁ గొలుచుచున్నంత కాలమును మనము వారిని దూర ముగ తోలి క్రిమి కీటకముల కంటె నీచులుగ పరిగణించు చున్నారము. వారే పరమతావలంబులై విద్వాంసులై వచ్చి హిందూమతమును, హిందూ దేవతలను పడదిట్టుచున్నపుడు గౌరవముతో మనము వారి కరచాలన మొనర్చుచు, సభలలో వారి పంక్తిభోజనము లాచరించుచు, సన్మానించు చున్నా రము. ఇంతకంటె సిగ్గుమాలిన తన మేముండును. సోదర మానవుల సమముగ గౌరవించు మహిమ నేడు అణగిపోయె ననియె గదా అర్థము. విద్యావశు తుల్యుడగు బాలకుని సోపాన క్రమమున పైకి నెక్కించుచు జీవితములో విజ్ఞాన సౌధమును జేర్పగలిగినట్లు అవిద్యావరణముచే నాచ్ఛాదిత మగు జ్ఞాన కళికను వికసింప జేయుచు, వ్యక్తిలోని పాశ విక తను తొలగించి మానవుని మార్చుటయే మత పరమార్థము

పుట్టుకతో నందఱు సమానులనియు అటుపై వారా ర్జించిన గుణసంపదనుబట్టి గౌరవ తారతమ్యములు గలుగు ననెడి స్వాభావిక సమతా నిబంధనయేఅభ్యుదయస్థితిలోనున్న సభ్యమతముల మూలసిద్ధాంతము.

జన్మనాజాయతే శూద్రః, కర్మణాజాయతే ద్విజ.

అనిగదా ఆర్యోక్తి

మత సౌధమునకు ఈ సమతాధర్మమ్ మూలస్థంభము. ఇది లేని మతము నిర్జీవ ప్రతిమ వంటిది, వర్తమాన హిందూ

మతమున ఇట్టి సమతా దృష్టి లోపించి యున్నదని చెప్పుటకు మేమెంతయు విచారపడుచున్నాము,

సూత్రయుగమున కూడ నీధర్మమునకు గ్లాని సంభవించుటచేతనే గౌతమ బుద్ధుడు వైదిక మతమును సంస్కరించి సర్వ సమత్వ ధర్మమును మరల స్థాపించవలసి వచ్చెను. ఈ గుణము లోపించుటచేతనే మహమ్మదు ప్రవక్త అరేబియా మతమును, జీసస్ క్రీస్తు యూదు మతమును సంస్కరింప వలసి వచ్చెను. ఒకప్పుడు సామ్రాజ్యము నేలిన యూదు మతము నేడు అధోగతి నందుటకు సమతా రాహిత్యమే కారణము. నేడు హిందూమతమునకు గూడ అట్టి దురవస్థయే తటస్థించెనను విషయము పాఠకులు విస్మరింపరాదు.

ధర్మవ్యక్తికి, జీవనాళికయగు సమతా సూత్రమేనాడు తెగినదో, యానాడే హిందూధర్మ దేహమున చైతన్యము నశించి శిలా రూపమున ఘనీభవించును. సర్వ సమత్వ ధర్మము నంగీకరించు మహోదారమగు, ధర్మవాహినిని, నిర్బంధ వర్ణ వ్యవస్థారూపమున, అరికట్టుట తోడనే హైందవ సంఘము, బహుదాభిన్నమై జాతీయతయను భావమే మృగ్యమయ్యెను. సంఘములందెచ్చు లోచ్చులు, కల్పితములై, యుచ్చజాతుల దయా యతీణ్యముల మీదనే పెక్కు సంఘములు జీవింపవలసిన దుస్సహ పరిస్థితులేర్పడెను, నిరర్థకమగు నీ నిర్బంధ వ్యవస్థయే, హిందూ సమాజమునకు ముప్పు దెచ్చుచున్నదని బాధ్యతగల హైందవ నాయకులెల్లరును చాలా కాలము నుండియు చెవి నిల్లుగట్టుకొని, ఘోషించుచుండుట పాఠకు లెరుంగనిది కాదు. ఈ కుత్సిత కుల యంత్రపు బందు కట్ల

బిగువే, అస్పృశ్యత జనించుటకును, పరిలుటకును, చివర కస్పృశ్యులనబడువారు, పరమతములందు జేరుటకును మూల కారణమైన దనుట సాహసము కాదని సవినయముగా మనవి చేయుచున్నాను.

## నిర్బంధ వర్ణ వ్యవస్థ

ఇచ్చట నేటి వర్ణవ్యవస్థను గూర్చి పాఠకులు కొంత తెలిసికొనుట సమంజసమని భావించుచున్నాము. హిందూ సంఘము యిన్ని విధముల క్షీణదశ నందుటకు ముఖ్య కారణము. ఒకటి నిర్బంధ వర్ణవ్యవస్థ, రెండు క్రియా శూన్యమగు శుష్క యాంత్రిక వాఙ్మయము, అని నిష్పాక్షిక దృష్టితో నిశితముగా విచారించిన వారికి తోచకపోదు. ఈ కుటిల శుష్క వాఙ్మయపు టండము నుండియే అనైకమత్యము, అహంకారము, జీవహింస, నిర్దయ, నిర్దాక్షిణ్యము. మాత్సర్యము, దారిద్ర్యము, సోమరితము మున్నగు దుష్టగుణ భుజంగములుప్పతిల్లెను. ఘనీభవించిన, కుటిలాహి దంష్ట్రా గళిత, కాలకూటమే అస్పృశ్యతగా రూపొందెననియు భావించుట తప్పుకాదు. బలవత్తరమగు భారతసమాజ లతికను, వర్ణభేద విషమునను, కణుపు, కణుపుకు విరిచి, యొండొంటికెక్కు తక్కువలు కల్పించి, దర్శన స్పర్శన, భోజన వివాహ గృహప్రవేశాది, సామాన్య వ్యవహారములలో. పరస్పరము శాశ్వతమగు, సంబంధ సామరస్యములు, జరుగరానివిధమున నియమ కుడ్యములు, నిర్మించుటలో సంఘమున సౌదర్య సహకారభావ మంతరించి పరస్పర విద్వేషములు, బలసిపోయి సర్వదా పరపీడనయే ధర్మముగా బరిణమించెను.

అవిభక్త కుటుంబములోని సోదరులందరును తమ యింటి నెవరికి వారు, తమదిగా భావించుకొని. సర్వ కార్యముల యందు నెంతో బాధ్యతతో వర్తించుచుందురు. విభక్త కుటుంబములోనివారు ప్రత్యేకముగా దన భాగ లబ్ధమగు, నింటి భాగనే తనదిగా దలచుచు దక్కిన భాగములయందు శ్రద్ధాభిమానములు చూపకుండుటయేగాక విశేషించి నిరసనభావముతో జూజుటయు, మనకు ప్రత్యక్ష విషయము. అట్లే యీ నిరర్థక వర్ణ భేదములవలన సంఘములో, కష్టసుఖములందు బరస్పరము, సహకారము జూపగల ప్రేమాభిమానములు, సన్నగిల్లుటయే గాక, అనైకమత్యా, మాత్సర్యాదులు, వృద్ధియయ్యెను.

అంతియకాక ఈ కులబేధములు, మానవుని ప్రధాన లక్షణములగు దయాగుణమునే దగ్ధమొనరించి, సమాజమును మృగసమాజముగా మార్చెను. సుఖదుఃఖములందు పరస్పరము, భాగస్వాములై మైత్రితో మెలగవలెనన్న సంఘములన్నియు, సమాన గౌరవ ప్రతిపత్తులు కలిగియుండవలయును. జన్మతోడనే ఒక సంఘ మెక్కువనియు, ఒక సంఘము తక్కువనియు, నొకటి బానిస యనియు, మరియొకటి అంటరానిదనియు, వేరొకటి చూడరానిదనియు, నియమ, నిర్బంధములుండుటచే, నొకరి నొకరు సమాన దృష్టితో నాదరించు మనుజ స్వభావమే మందగించి పోయెను. ఒకడు మన చేతితో నీళ్లు పోయరాసివాడు, ఒకడంటరానివాడు, ఒకడు సమీపింపరానివాడను భావపోషణము ముదిరిపోవుటచే మానవుని హృత్ఫలకమునగల కరుణారస మింకిపోయెను. ఒకడు నోరెండి చచ్చుచున్నను, లేక నెత్తిపై చెట్టు విరిగి పడుచున్నను,

లేక నీటబడి కొట్టుకొని పోవుచున్నను, వానికించుక మంచి నీళ్ళుగాని, చేయూత గాని యిచ్చి రక్షించుటకుఁ గూడ, ఉచ్చ వర్గమునకొను వానికి మనసు రాకుండునంతటి కాఠిన్య మేర్పడినది.

ఈ వర్ణభేదముల వలన పరశ్రేయ స్సహానము కూడ పూర్ణముగా నశించెనని చెప్పవచ్చును. ఒక వర్గమువారి యుచ్ఛ్రదశను మరియొక వర్గమువారు సహింపక వారి పతనమునకై విశ్వప్రయత్నముచేయుట మనము నిత్యమును చూచుచున్నారము. దీనినే కులతత్త్వమందుము. అందరొక్క వర్గమైన ఈ అసూయకంత బలముండదు. ఆ గుణ మొక్క వర్ణములో మాత్రముండుట లేదా? అనిపృచ్ఛింపవచ్చును. కాని ఈ సహజ పశుగుణమునకు ఆభేదము విశేషము, దోహద మొసగుచున్నదనుటలో నతిశయోక్తి లేదు. లోకములో వృత్తులు వ్యక్తిగతములే గాని సాంఘికములు జన్మసిద్ధములు గావు. వ్యక్తుల అభిరుచి సామర్థ్యములనుబట్టి మారుచుండుటమన సంఘములో సృష్టి విరుద్ధము. గుణముచే నేర్పడవలసిన కులములు, జన్మచే నిర్బంధము లైనట్లు అభిరుచి సామర్థ్యములచే నేర్పడవలసి వృత్తులు జన్మ విశిష్టములుగ నిర్బంధింపబడెను. కులమున కొక వృత్తి శాశ్వతముగ బంధింపబడినందున వ్యక్తుల అభిరుచిసామర్థ్యములబట్టిభిన్న భిన్న వృత్తులందు ప్రవేశించి కృషి, వాణిజ్య. కళా పరిశ్రమలందు అత్యంతాభివృద్ధి చూపుటవలనను గాకున్నది. దానంజేసి సమర్థులగువారు అభిరుచిగల వృత్తులందు ప్రవేశించి పూర్తి వికాసముగాంచి ఆర్థిక పారిశ్రామిక సంపదను పెంపొందించి జాతినుద్ధరించుటకుఁగాని దేశ కళ్యాణమునకు తోడ్పడుటకుగాని విదేశీయుల

పోటీకి నిలబడుటకుగాని నైపుణ్యమును పెంచుకొని లాభములు గడించుటకు గాని అవకాశము లరికట్టబడి యుండుటచే మన కళాపరిశ్రమాదులుకూడ గుంటపూవులుపూయవలసివచ్చెను.

ఈ వర్ణ నిబంధనలవలన మన జాతికి నన్నింటికంటె అనర్థదాయకమగు నొకచిక్కు సంభవించినది. ఒక వర్ణము లోనివారు మఱియొక వర్ణములోని వారివి వివాహ మాడరా దను నియమముండుటచేత వధూ వరులు మిక్కిలి కొలది యావరణము కలిగిన స్వసంఘములందే సంబంధములు కుదు ర్చుకొన వలసిన యిబ్బంది కలుగుచున్నది. అందువలన, అనుగుణ వయోరూప వధూవరులు దొరకటనే కష్టముగు చున్నది. వధూవరులు సమీప బంధువు లగుటయే తట స్థించుచున్నది, వధూవరులు ఎంత దూరపు రక్తసంబంధు లైనచో అంత పరస్పర ప్రేమాకర్షణ లేర్పడుటయు అంత తేజోబల సంపన్నులైన సంతానము కలుగుటయు శాస్త్ర ప్రసిద్ధము. కావున ఈ వర్ణాంతర వివాహ నిషేధముతో హిందూజాతి అంతయు ఒకటియే అను జాతీయ భావము నశించుటయేగాక సంఘమున బలవత్తర ప్రజాభివృద్ధికిని విశేషించి పవిత్రమగు స్వయంవర విధానమునకును తీరని ముప్పు వాటిల్లుచున్నదని ఘంటాపథముగ చెప్పవచ్చును. నిరవధికమగు ప్రేమశక్తిని కృత్రిమములగు కులకుడ్యావరణ ములతో నడ్డుపెట్ట జూచుట ప్రకృతి విరుద్ధము,

జాత్యభ్యుదయము నకును, సంఘ కళ్యాణము నకును ప్రబల విరోధములైన బాల్య,వృద్ధ,నిర్బంధ వివాహములవలన,

పరస్పరాకర్షణలేని అసమ దాంపత్యము లతిశయించుటచేత, సుఖప్రదములు, కావలసిన ఇండ్లు నిరంతరమును యుద్ధరంగములుగ మారుచుండుట మన మెరుంగనిది కాదు.

కాలక్రమమున స్వమతమున దురాచారములను సంస్కర్తలు సంఘ శ్రేయము కొరకు సంస్కరింప దలచినప్పుడెల్ల ప్రజల పూజాధ్యము నండజేసికొని, మత నియంతలు అడ్డుపడు చుందురు. . పరమతస్థు డెవ్వడైన హిందూమతావలంబి కాదలచినచో అతనికి ప్రవేశ మీయురు. మత ద్వారములు శాశ్వతముగ మూసివేసిరి, వ్యక్తులకు గుణ చిహ్నములనుబట్టి గౌరవము లొసంగక బహుధా బాధించు నీ మతమవలంబించుటకంటె సర్వదా పరమతమున జేరుటే శ్రేయమని భావించియే పలువురు పరమతావలంబులై పోయిరి. అందువలననే హిందూమతము దినదినమును క్షీణించుట తటస్థించుచున్నది.

కాబట్టి అర్థరహిత వర్ణవ్యవస్థ, స్వమత క్షీణతకెక్కువ యుపకరించుచుండె ననుట సత్యదూరము కాదనుట మా అభిప్రాయము, ఆర్య ధర్మదేహికి హృదయ కోశమున తగు సమతాధర్మము కూడ లోపించినది. నిశితముగ విచారించినచో ఈ నిర్బంధ వర్ణవ్యవస్థవలన అచిర కాలములోనే హిందూధర్మము నశించు ననుటకు సందియము లేదు.

ఏల యందురా? ప్రపంచమున గల సభ్యమత మేదియైనను, స్వధర్మ విశ్వవ్యాప్తమై, అభివృద్ధి గాంచుటకే ప్రయత్నించును. మతావలంబు లెల్లరను, విద్యావంతులై, మూలమత గ్రంథములను స్వయముగా చదువుకొని, తద్ధర్మ సిద్ధాంతములపై విశ్వాసము కలిగి, యనుష్ఠించ వలయుననియే, ఆయా

మత నియంతల ప్రధానాశయము. జ్ఞానార్జన విషయములో స్త్రీ పురుష భేదములు, ధన నిర్ధన భేదములు లేవు. బీదల కుచిత పాఠశాల లేర్పరచియు, మత గ్రంథము లుచితముగా నొసంగియు, విజ్ఞులను జేయుటకే నిరంతరము, క్రైస్తవాది మత ప్రచారకులు, ప్రయత్నించుచుందురు. కాని మూల మత గ్రంథములు, స్వమతావంబులలో కొందరు చదువరా దని గాని, వినరాదనిగాని సభ్యమత నియంత లెవ్వరును, శాసించినట్లు వినలేదు. ఖురాను చదువకూడదని, మసీదు లలో ప్రవేశించరాని ఇస్లాము మతస్థులుండరు. బైబులు చదువ రాని వాడును, చర్చిలో ప్రవేశించరానివాడును, క్రైస్తవు లలో నుండడు. అట్లే బౌద్ధపిటకము. చదువరాని బౌద్ధుడు గాని, జండవస్తా చదువరాని పారశీకుడుగాని, గ్రంథ సాహేబ్ చదువరాని శిక్కు మతస్థుడుగాని, యుండడు. మీదుమిక్కిలి వారు స్వమతమును విశ్వవ్యాప్త మొనరింపగోరి, స్వమత గ్రంథములను, వివిధ భాషలలోనికి అనువదించి, ప్రచారము గావించుచున్నారు,

ఈ వర్ణవ్యవస్థయను, మశూచి రోగముచేత, ఆర్యధర్మ దేహికి, హృదయ కోశమున, తగు సనుతాధర్మముకూడ సం పూర్ణముగ చచ్చుపడిపోయెను. ప్రాచీన యుగమున గుణ కర్మలతోడనే, వర్ణ నిర్ణయమును, పరివర్తనమును, జరుగు చుండినట్లు పైన జదివి యున్నారు, నాడు ప్రాచీన మతావ, (Primitive Secularism)లంబియగు ప్రతివ్యక్తియు విద్యా, విజ్ఞాన విశేషములతో సంఘమున, నత్యున్నత పదవినార్జింప నవకాశముండెడిది. గుణకర్మాను సారము, పరివర్తన గాంచు నాటి వర్ణవ్యవస్థ, అంగాంగీ భావమున, సంఘ శరీరమునకు

పుష్టినిచ్చి, పరస్పర ద్వేషముల కవకాశ మొసగక సాంఘికుల యందైకమత్య మభివృద్ధి పరచుటయేగాక మీదు మిక్కిలి నలుపేటల బెసవైచిన త్రాటివలె, నొండొంటికి బలకరములె, సంఘమును శత్రుదుర్భేద్య మొనరింపగల్గెను. నాడు సాంఘికులు, నిరహంకారులై తమ వృత్తులలోని, హెచ్చు, లొచ్చు భావములను పరిగణింపక, సంఘ శరీరక, శిరమెంత ఆవశ్యకమో, పాదములు నంత యావశ్యకమని, గుర్తించిన వారగుట సర్వవిధములందు, నొండరులు, సమాన గౌరవ ప్రతిపత్తితో ప్రవర్తించుచుండెడివారు. వర్ణ భేదము లేర్పడిన నాడు కూడ వర్ణములు నాల్గేకాని, యిన్ని వేలు లేవు. అవి యైనను గుణ కర్మలను బట్టి, పరివర్తన జెందుట నేటి ప్రభుత్వోద్యోగుల వంటివేగాని, శాశ్వతములు శిలారూపములు కావు, ఆ నిర్ణయమైనను, సంఘ సౌకర్యము కొరకేర్పఱుపఁబడిన లక్షణ విధానమేగాని. భిన్న భావమేర్పరచుటకై కల్పించిన తాంత్రిక క్రియకాదు, మనవలె పూర్వులు వృత్తులను బట్టి సంఘమును భిన్నపరుప యత్నించి యున్నచో, నాడా నాలుగే యననేల, పెక్కు వర్గములేర్పడి యుండెడివి. వారిలో నాడు కుంభకార, చర్మకార, వస్త్రకార, రథకార, చిత్రకార, గోపిక, నాపిత, రజక, ముఖ్య వివిధ వృత్తులవారుండిరి. వారి నందరిని వేఱుపరచి సంఘమును తుత్తునియ లొనర్చినచో సంఘము నిర్వీర్యమై పోవుననియు, దానంజేసి తమ సర్వస్వాతంత్ర్య సంపదలను కోల్పోవలసి వచ్చుననియు, అటుపై తమకు శాత్రవుల పాదసేవయే శరణ్య మగుననియు, స్వాతంత్ర్య సుఖానుభవజ్ఞులగు మన పూర్వు లెఱుంగకపోలేదు. ఇంత విచారించియే స్వజాతి నొక్క సంఘముగనే

భావించుచుండిరి. సంఘసౌకర్యము కొరకు ఎవ్వరేపని జేసి సను వారందఱును సాంఘిక సాంస్కృతిక సంబంధములగు మర్యాదలతో సమాన గౌరవము లందుచుండిరి. లోక సంగ్రహార్థమై అనాసక్తితో జేసిన కర్మలేవైనను పరమ ధర్మములే యని మన ప్రాచీనుల ఆశయము. అందువలన గుణ విశిష్టమగు ప్రాచీన వర్ణ వ్యవస్థ (Primitive Communism) జాతీయాభ్యుదయమునకు ప్రబలోత్తేజ మొసంగెను.

నేడు హిందూమతమున మన వర్ణములుకూడ పరిణామములేని స్థాణువులై నిలచిపోయెను. నేటి వర్ణ ధర్మమునందు కుల గౌరవమేగాని గుణ గౌరవము మృగ్యము. క్రింద కులమునఁ బుట్టిన దోషమున నెంత జ్ఞానియైనను పైమతములవా రాదరింపరు.

పై వర్గమున బుట్టినంతనే, యెంతటి నీచకర్ముడైనను నగ్రమర్యాద కర్హుడగుచున్నాడు. ఇందువలన గౌరవింపదగిన, గుణవంతుడు అగౌరవింపబడుటయు, నిరసింపదగిన నింద్యుడు వంద్యుడగుటయు దటస్థించుచున్నది. ఇంతకంటె విపరీత ధర్మమేమి కలదు. ఇదియే భావ విప్లవమునకు మూల కారణము. ఇంతియగాక, నీచ జాతులన బడువారు. అగ్రజాతుల వారికెల్లపుడును దాస్య మొనరించి బ్రతుక వలసినదే కాని, యొకప్పుడైనను వారు చదువుకొని, విజ్ఞాన వికాసములఁ కల్గి. య్యుచ్చ సంఘములతో సమాన గౌరవము నందవచ్చునను నాశాంకురముకూడ శాస్త్ర ఖడముచేతనే భేదింపబడెను "స్త్రీ శూద్రా నాధీయతామ్" స్త్రీ, శూద్రులు వేదముచదవ రాదు. "దాస్యా యైవ పురా సృష్టా బ్రహ్మణోహి స్వయంభువా" శూద్రుని బ్రహ్మదాస్య మొనర్చుటకే పుట్టించెను.

మొదలగు స్మృతి వాక్యము లీవిషయమునే స్థిరపఱచు చున్నవి, దీనివలన పైవర్గముల వారికి శాశ్వత సుఖ గౌరవ జీవనమును క్రింది వర్గములవారికి, పరం పరగా కష్టావమాన నికృష్ట జీవమును లభించుచున్నది. పైవర్ణముల వారిలో, తాము బ్రహ్మముఖమునుండి యూడిపడితిమను, భ్రాంతి మదహంకారము గడ్డకట్టి యుండుటచే, క్రింది వారికి దమతో సామ్య గౌరవ మొసగ నంగీకరింప కున్నారు. కావున నీమతములో నున్నంత వరకును, అర్హులగు వారి కున్నంత గౌరవము లభ్యమగు మార్గము, మూయ బడినదని స్థిరపడుట చేతనే అందఱికంటె గత్యంతరము, నట్టి యడుగున, నడఁగ ద్రొక్కబడుచున్న హరిజన సంఘము, తోలు, దోలుత పరమతముల నాశ్రయింప వలసి వచ్చెను. స్వార్థ పరత్వముచే ప్రజా సంఘమును, శాశ్వతముగా నడచి పెట్టియుంచు నీపురోహిత విధానము (*Pope Seystem*) ఏ దేశమందును జయముగాంచ లేదని చరిత్రజ్ఞు లెఱుంగునది కాదా. మానవులలో హెచ్చు లొచ్చులు ప్రస్తుతము నాగరికత జాతులందు లేవా? యని ప్రశ్నించవచ్చును. ఉన్నవనుటకు సందియ లేదు. కాని, ఆభేదములు సామాన్యముగ జన్మసిద్ధములుగాక వ్యక్తులయొక్క గుణ విద్యా విజ్ఞాన విశేషములచే గలుగుచున్నవనియే గుర్తింపవలయును. నేడు బానిసయైన వాడు రేపు రాజ్య నియంతయైన కావచ్చును. ప్రాచీన ధర్మమువలె ఆ విధానము గుణగౌరవ మేగాని తదన్యముగాదనియు ఎఱుంగునది.

మన దేశమునందువలె విదేశసభ్య జాతులందెచ్చటను అర్థరహితములగు వర్ణ భేదములు మాత్రము లేవు.

కాని అచ్చట కూడ మరియొక విధముగ ప్రజాపీడ జరుగుచున్నది. మన దేశమున మతము పేరిట సాంఘిక అన్యాయముజరుగు చున్నట్లే అచ్చట ఆర్థికముగ ప్రజా సంక్షోభము జరుగుచున్నది. మన మత నియంతల స్థానము నచ్చట ధనవంతులగు పెట్టుబడిదారు లాక్రమించిరి. జమీందారులు ధనాధిపులును రాజ్యాంగములను వశపర్చుకొనిరనియు. దేశములోని సహజ సంపదల నాకట్టుకొని వ్యవసాయమునందును సర్వదా కష్టించి పనిచేసి తమ ఐశ్వర్య వైభవముల కాధారభూతములైన కర్షకులయు, కార్మికులయు కళ్యాణ మావంతయు విచారింపక విశేషించి వారి అభ్యుదయము నణచివేయుటకే తమ చేతనున్న అధికారము నంతయు నుపయోగించుచుండిరి. సోమరియగు ధనికుడసు మథించిన ధనముతో నెల్లపుడు సుఖించుచుంటయు, కష్టించి పని చేయువాడెల్లపుడు అధోగది నందుచుండుటయు, ఆర్థికమగు నిట్టి సాంఘిక దౌర్జన్యమును దారిద్ర్య పీడితమగు జనసామాన్యము సహింపనేరక దేశములోని ప్రజలందఱును, రాజ్యమునగల సర్వసంపత్ సుఖగౌరవములందు సమాన భాగస్వాములనియు, లాభ నష్టములు సమానముగ పంచుకొని అనుభవించినచో అందఱును సంతృప్తులై యుందురనియు, ఆర్థికముగ హెచ్చుతగ్గులు నశించిన సర్వసమత్వ మేర్పడుటచే ప్రజలలో శాశ్వత శాంతి జీవిత మేర్పడుననియు, కార్మికుడెంత కష్టించినను, పొట్ట,బట్టకును కఱవై వికృష్ట జీవనము చేయుచు, జీవితానందము నెరుంగక, యసంతృప్తి నందుచుంటయే లోకమున అశాంతికి, కలతలకు మూలమనియు గుర్తించి సర్వ సమతా ధర్మైక సూత్రమగు సామ్యవాద విధానము (Socialism) నంగీకరించి

ప్రచార మొనర్చుచున్నారు, దాని శాఖలే రష్యా, సోవియట్, చీనాసామ్రాజ్యము స్పెయిను, ఫ్రాన్సు మొదలగు చోట్ల వ్యాపించెను. సామ్యవాదము పేరిట మన దేశమున నీ సిద్ధాంత భాగమే యువజనులలో విద్యుద్వేగమున వ్యాపించుచుండుట శుభోదర్కము. ఈ హరిజనోద్యమము మత మూలకమగు సాంఘిక దౌర్జన్యమునే ఖండించునుగాని సోషలిజమన్ననో మతరాజకీయ, ఆర్థిక సాంఘిక సాంస్కృతికాదికములగు సమస్త దౌర్జన్యములను ఖండించును. అస్పృశ్యతా నివారణము సామ్యవాద విధానమందొక భాగమని నిపుణముగ యోచించిన ద్యోతకము కాకపోదు.

## నవయుగము - సామ్యవాదము

శిక్షాస్మృతియందు సర్వ సమత్వము ప్రతిష్ఠింపబడ్డ రాజ్యాంగ యంత్రము, మతాంతరాధీనమైన నాటినుండియు, నీ దేశమునఁగూడ వర్ణధర్మమున పూర్వపు బిగువిపుడు కానరాదు. బిగువు మాత్రము సడలుట యననేల! ఈ కృతక ధర్మబంధములు అన్ని కులములవారిచేతను త్రుంచివేయబడుచున్నవని మన సనాతనవాదులే నెత్తి నోరిడికొని ఆక్రోశించుచున్నారు. ప్రకృతియే పరిణామ శీలమైనపుడు తద్విరుద్ధములగు కృత్రిమ నియమములు చిరకాలము నిలువవలయుననుట అవిచార మూలము కాకపోదు. సంఘము యౌవన ప్రాదుర్భావముగల కన్య వంటిది. గర్భధారణ కర్హ్వరాలు కాగనే కన్యను తల్లి దండ్రులు తగిన వరుని గూర్పవలసియున్నది. బాలికయెడ వారు తమ ధర్మమును మరచినపుడును, పరులుదోఁబ్రధించినను, ఉపేక్షించి నపుడును స్వయ

ముగ కన్యయే వరాన్వేషణ చేయవలెనని మన ప్రాచీనులే అంగీకరించిరి గదా! అట్లే సంఘము సంస్కారము పొందవల సిన అవసరలో సంఘ నియంత లుపేక్షించినపుడు వారు మేలు కొను వరకును ప్రజలు వేచియుండరు. అది నిరర్థక నిర్బంధ ములను ద్రోసిరాజని స్వేచ్ఛగ సంస్కార పథమునబట్టి పోక మానదు. నదీ ప్రవాహమునుబట్టి కట్టలేర్పరుపవలెగాని ప్రాత కట్టలమధ్యనే ప్రవహింపవలసిన బాధ్యత నదికి కాదు. తెగు వరకును సాగలాగ కూడదను నానుడి యిట సార్థకము. టపా కాయ ఎంత బిగింతుమో అంత పెద్ద ధ్వనితో బ్రద్దలుకాక మానదు. గాయములు మొదలగు బాధలు గలిగి ఆరోగ్య భంగము గలిగినపుడు తన్ను దాను సంస్కరించుకొను శక్తి సహజముగ ప్రాణుల దేహమందే యుండును. అట్లే స్వలోప ములు సంస్కరించుకొను సామర్థ్యము సంఘమునకు కలదు. పరులు దానికి అడ్డురాకున్న చాలును.

పగిలిన పాదరస బిందువులవలె సహస్రధాభిన్నములైన నేటి వర్ణములు దగపటల న్యాయముగ నున్నట్లు పైకగపడు చున్నవేగాని స్వధర్మములకవి ఎన్నడో దూరమైనవి, అను పేయములు కాని అస్వాభావి కాచారముల బిగువు మితి మీరగనే తెగిపోయి విధి నిషేధములు దూది పింజలవలె నెగిరి పోయినవి. బ్రాహ్మణ కులజుడు పంచమ వృత్తియు, పంచముడు బ్రాహ్మణ వృత్తియు అభిరుచి సామర్థ్యములబట్టి స్వేచ్ఛగ నాచరించుచున్నారు. ప్రేమ వివాహములకు వర్ణ కుడ్యము లడ్డుపడుట లేదు, అంతటితో మత రాజ్య నియం తలు పెన్నను గైకొన్న ప్రభుత్వోద్యోగులువలె తమ శాసన ఖడ్గాల నొఱలలో నిడుకొని వానప్రస్థాశ్రమము స్వీకరించిరి.

నాటినుండియు స్మృతిసూత్రములు పరివ్రాజకులవలె లోక వ్యవహార మారకులై సాలగ్రామ సంపుటాటవులలో సంపూర్ణ శాంతి గైకొనుచున్నవి.

ఇంత అనుభూతి కలిగిన పిదపనైనను సంఘ నియంతలు సంఘ సంస్కరణావసరమును గుర్తింపరు సరిగదా రోగమును పెంచుటయే గాక క్రొత్త తెగులు పుట్టించి రోగికి ప్రాణాపాయము కలిగించు అనర్థదాయకమగు ప్రాతమందునే తిరిగి ప్రయోగింపనెంచు సనాతన మూర్ఖవైద్యునివలె కృతక వర్ణవ్యవస్థను పునరుద్ధరింప జూచుట దురదృష్టము కాదా!

## సనాతన హిందూధర్మము - పరివర్తనము

భారతదేశ చరిత్రమున, కీ. పూ. 1000_500 మధ్య కాలము, విస్మరింపరాని పరివర్తన కాలము. భారతమాతకు అజరామర కీర్తి నార్జించిన, ఉత్తమజ్ఞాన నిధానములగు షడ్దర్శన సూత్రములు, షడంగ సూత్రములు వెలసిన ఈకాలమందే, ధమని (Artery) ప్రక్కనే సిరలు (Veins) నట్లు తత్కీర్తి చంద్రికను మాటుపరచి, దేశమాతను దాస్యకూపమునగూల్చిన దుశ్శాసన రజ్జువులుకూడ ఉద్భవిల్లెను. ఈ కారణముననే దానికి చారిత్రికులు సూత్రయుగమని పేరడిరి. ఒక దేశ టున్నతిని గణింపవలెనన్న అందలి ప్రజా సామాన్యమున గల నైతికాభ్యుదయమే ప్రమాణముగా గ్రహింపవలెను, గాని యొకటి రెండు వర్గములయు, కొన్ని కుటుంబములయు స్వాతంత్ర్య సంపదలను బట్టి, నిర్ణయింపరాదు. ఆ కాలమున వెలసిన షడ్దర్శనాది, తత్వగ్రంథములలోని,

యాత్మజ్ఞానము ప్రజలలో వేయింటికి నొక్కనికైన, సంటలే దనుట సాహసము కాదు, కాని నాటి స్మృతినిబంధన పాశ ములచే, జన సామాన్య మంతయు, బంధింపబడి, యుక్కిరి బిక్కిరి యైనట్లు మాత్రము ద్యోతక మగుచున్నది.

ఆ యుగమున అంతకు ముందున్న సార్వజనీనములగు, మహోదార ధర్మములు, పెక్కులు తలక్రిందు చేయబడనవి. పురోహిత మంత్రపాశ బద్ధులగు నాటి రాజుల శ్రుతి, స్మృతి, నాగస్వరము ననుసరించియే, తలలూప సాగిరి. ఈకాలమున సర్వసమత్వము, జాతీయమైక్యమును, వ్యక్తిస్వాతంత్ర్య వివే చనా శక్తులను భంజించు వర్ణవ్యవస్థ విగ్రహారాధనలను, పెంపొందించి ద్విజేతరులకు, నారీలోకమునకు స్వాతంత్ర్య మును భజించు శాసనములు సృజింపబడెను. పురోహితు లును, రాజులు నొకటియై జనసామాన్యమును, పనిముట్లవలె వాడు దౌర్జన్యము నాటినుండియే వాడుకయై ధర్మరూపము నందినది, నాటి ప్రజలెంత అవిద్యావంతులైనను సాంఘిక ధర్మము పాశీకములగుటచేత, పాలక పాలితులలో అనైక మత్యము, ఈర్ష్యాద్వేషములు జనించి క్రమముగా జాతీయత నశించెను,

## బౌద్ధయుగము క్రీ. పూ. 500 సం॥

హిందవ సంఘమట్లు అశాంతి భూయిష్ఠమై సంస్కార మును గోరుచున్న సమయమున క్రీ. పూ. 550 సం॥ శాక్య వీరుడగు శుద్ధోధనునకు సిద్ధార్థ కుమారుడు కలైను. ఆతడు స్వదేశ స్థితిని బరికించెను. దుఃఖమయమగు నాటి, సాంఘిక జీవనము ఆనందమయ మొనర్ప గృతనిశ్చయు డయ్యెను,

వైరాగ్య ఖడ్గముచే లోభలతను ఖండించెను. ఇతర ప్రాణి కలభ్యములైన సిరి సంపదలను, జీవిత సుఖములను, రాజ్య వైభవమును విడిచి. లోకము కొరకు సాధనరంగమున కురికెను. ఘోరార్యారణ్యముల జిరకాలము తపించి, సర్వోత్తమ మగు అహింసా ధర్మమును కనిపెట్టెను. సంఘమునబట్టి పీల్చి పిప్పిజేయు దురాచారములను ఖండించెను. నాటి అశాంతి యంతయు, వైదిక మత కల్పితములగు అర్థరహిత, నిర్బంధ వర్ణవ్యవస్థ, పాశవిక ధర్మ సూత్రములు జడారాధనము మూలకారణము లని గ్రహించెను. శుష్క ప్రతిమార్చనము, వ్యర్థమనియు, దేవతా ప్రీతికై జరుగు జీవహింస అమానుష మనియు, సత్శీలసంపదయే మానవునకు అవుసరమనియు వర్ణము, నిర్ధరించునది గుణమేకాని, జన్మ కాదనియు, జలద గంభీర స్వరముతో ప్రవచించెను. గౌతమ బుద్ధుని సిద్ధాంతములను Buddha and his Dhamma అను మహాగ్రంథమున డాక్టర్ అంబేత్కర్ యిట్లు చెప్పెను:_

"In his (Budha) view the Vedas were as worthless as a desert. The Budha therefore discarded the Mantras as a source from which to learn or to borrow. Similarly Budha did not find any thing in the philosophy of theVedic Rishis. They were groping to reach the Truth; but they had not reached it. Their theories were mere speculations not based on logic nor on facts. Their contributions to philosophy created no social values. He therefore rejected the philosophy of the Vedic rishis as useless."

83 page.

## Book III part iv

"What is not Dhamma

(1) Belief in the Supernatural is not Dhamma.
(2) Belief in Iswara (God) is not essentially part of Dhamma.
(3) Dhamma based on union with Brahma is a false Dhamma.
(4) Belief in soul is not Dhamma.
(5) Belief in sacrifices is not Dhamma.
(6) Belief based on speculations is not Dhamma.
(7) Reading Books of Dhamma is not Dhamma.
(8) Belief in the infallivility of books of Dhamma is not Dhamma."

ఈ విధముగా బుద్ధుడు ఈశ్వరుని ఆత్మను, యజ్ఞయాగములను, హేతువాద విరుద్ధములని పూర్తిగా విమర్శించుటయేగాక, నిరీశ్వర వాదమును, అనాత్మవాదమును, అకర్మ వాదమును, హేతువాద దృక్పథముతో ఉద్ఘాటించి ప్రపంచమున ఎనలేని కీర్తిని సంపాదించుకొనెను.

అంతటితో సంఘమున, బురోహిత దౌర్జన్యము తొలగసాగెను. యజ్ఞ యాగము లందలి జంతు బలులు మటుమాయ మయ్యెను. మధు సేవలు సున్న యయ్యెను. కుల నిర్బంధములు కూలిపోయె. మూఢ నమ్మకములు తొగిరిపోయెను. సర్వమానవ సౌభ్రాత్రము, సర్వసమత, జీవకారుణ్యము, సాంఘీక సేవా పరాయణ, ఆత్మ స్వాతంత్ర్యము మొదలగు పవిత్ర ధర్మములు నెలకొనెను.

గుణవిశిష్టములు శీలవర్ధనములు నిష్పాక్షికములు నగు నీ ఉదార ధర్మములే నేటికిని ప్రపంచమునగల మహామతము లకు మూలస్రోతములై యున్నవి. సర్వ జీవన స్వాతంత్ర సిద్ధాంతముపై నెలకొనిన మహోదారమగు అహింసా సిద్ధాంతము విశ్వ వ్యాప్తమైనపుడు ప్రపంచమున సుస్థిర శాంతి యేర్పడి విరాజిల్ల గలుగును. ఈ మత సిద్ధాంతములే విజ్ఞాన ప్రపంచమున సభ్యజాతుల రాజ్యమందు పరివ్యాప్తములై తత్వ వేత్తలచే ప్రశంసింప బడుచున్నవి. ఈ ధర్మ పరిణామముతో సాంఘిక సాంస్కృతిక పారిశ్రామిక వైజ్ఞానిక రంగముల లాభము లెన్నియో సమకూరెను. పాక్షిక విద్యావృత్తి నిబంధనలు తొలగిపోయి సమాజములో పరిశ్రమలు, కళలు విరివిగా పెంపొందెను. ప్రజాసత్తాక రాజ్యాంగ విధులును విస్తరిల్లెను. భరత ఖండము సర్వతోముఖముగ నభ్యుదయమంది సాటి దేశముల కాదర్శమైన యాకాలముననే చరిత్రకారులు స్వర్ణయుగమని పేరు పెట్టిరి. ఇట్లు బౌద్ధమత భాస్కరుడు భారత గగనమండలమున దుర్నిరీక్ష ప్రతాపముతో వేయి వత్సరములు వెలుగొంది, అహింసా సత్య ధర్మ దీధితులు విశ్వమంతయును వెదజల్లెను. సనాతన ఆర్యవాఙ్మయ ప్రభుత్వ పతాకము కదలిపోయెను,

## క్రీ. శ. 500-1000 పురాణ యుగము

క్రీస్తు శకము 5వ శతాబ్ది నుండియు నాల్గు పడగల నాగ రాజు బుస గొట్టెను. హైందవ సంఘము పౌరాణికుల హస్తగతమై వెనుకకు నడువజొచ్చెను. గౌతమబుద్ధునికి పూర్వమున్న పరిస్థితులే క్రమముగ బలపడసాగెను. బౌద్ధుల సర్వ

సమత్వ ఉదార ధర్మములు సన్నగిలి వానిస్థానమున సూత్ర యుగమునందలి సంకుచిత ధర్మములు ప్రవేశింపఁ జొచ్చెను. వానితో నవీన దురాచారము లెన్నియో సంఘమున ప్రవేశింప జొచ్చెను. వర్ణ నిర్బంధములతోఁబాటు సూత్రయుగమున లేని అపూర్వ పురాణాగమ మతములు సృజింపబడెను. ఏకేశ్వరోపాసనము, పురోహిత మాధ్యస్థ్యము, మహిమలు శుష్క వాఙ్మయ మాంత్రికము, వెలి విరిసెను. సాంఘిక జీవనమున వ్యక్తి స్వాతంత్ర్య తేజఃకణములు సమసిచల్లారెను. భారతీయుడు వివేక శూన్యుడయ్యెను. సంఘమున ఏకజాతి, ద్విజాతి, అవర్ణులు, సవర్ణులు, సంకీర్ణులు ప్రాచ్యులు అను భేదములేకాక వృత్తినిబట్టి పెక్కు వర్ణములుగాను, వర్ణమొక్కొక్కటి అత్యల్ప భేదములతో అసంఖ్యాక అంతశ్శాఖలుగను చీల్చబడెను. శాశ్వత నియమ కుడ్యములు తిరిగి బలపడెను. మాయావతారాది, నవీన సిద్ధాంతములు వెలసెను. బహుదేవతా రాధనముతో జన్నములు, బలులు, జాతరలు మరల చెలరేగెను. శ్రీపాదతీర్థ ప్రసాద. స్వీకారములు, రుద్రాక్షలు, తులసీపేరులు, మొదలగు బాహ్యాడంబరములే మతమునకు ముఖ్య లక్షణములుగ పరిణమించె. మతాచార్యులు బ్రహ్మ సూత్రములు వదలి, జిహ్వాతర్పణ సూత్రములు వల్లింప సాగిరి. పండితులు స్వానుష్ఠానమువీడి శుష్క తర్క వాదములతో తృప్తిపడసాగిరి. గురువులు, శిష్యులకు, జ్ఞానదానమునకు బదులు పాదధూళి నిచ్చి సంతృప్తి పడసాగిరి. స్త్రీలలో అతి బాల్యవివాహములు, బలవద్ సహగమనములు, నిర్బంధ వైధవ్యములు విద్యా నిషేధములు, మొదలగునవి తిరిగి ఆచారము లాయెను. నాడు స్త్రీలు పురు

షులలో సామ్యసత్వములు గల అర్ధాంగ లక్ష్ములను మాట విస్మరింపబడి పనిచేయు దాసులుగను, పిల్లలుగను, యంత్ర ములుగను, పాటింపఁ బడజొచ్చిరి. అంటరాని, సమీపింప రాని, సంఘములని కొన్ని తెగల సోదరులను వెలిబెట్ట సాగిరి.

## విదేశ మత ప్రచారము
## హరిజనుల మత పరివర్తనము

ఇట్లు హైందవ సంఘము సంఘక్షేమమును విస్మరించి రాజ్యాంగములతోఁగూడ బహుధాభిన్నమై, తలకొక మత మును, దేవత నేర్పరచుకొని, వ్యష్టి మోక్షమును కల్పించు కొని, అహంకరించి, యొండొరుల వర్ణ మత, దేవతావిధాన ములను ధిక్కరించుచు స్వదేవతా భక్తి మహిమాదులను, పురాణ రూపమున ప్రచారము సేయుచు, నొండొరులు పోరాడసాగిరి.

భారతీయార్య సమాజమంతయు నిట్లు సహస్రధా భిన్నమై యొండొరులను ద్వేషించుచున్న కాలము నండజేసి కొని సమయజ్ఞులగు విదేశీయులు పరంపరగా ఈ దేశమును జొచ్చి స్వమత ప్రచారము సేచేయదొడగిరి.

మతాంతర ప్రచారకులు హరిజనాది నిమ్నజాతులకు మనలో నున్న వృత్తి విద్యావిషేధ, అస్పృశ్యతాద్యాచా రము. మనలోనున్న లోపములను వ్రేలెత్తి చూపుచు "హిం దువులై మీరు క్రిమి కీటకముల కంటె నీచులుగ బ్రతుకుట కంటె పరమతమున జేరి మానవులుగ సర్వహక్కులు గలిగి

స్వేచ్ఛా సుఖ గౌరవము లనుభవించుట శ్రేయస్కరము కాదా” అని ప్రబోధింప దొడగిరి.

సాంఘిక దౌర్జన్య ప్రచండా తపముచే నత్యంతము శుష్కించి ప్రాణావశిష్టమై యున్న హరిజన సస్యము పర మత ప్రచారకుల బోధామృత వృష్టికి ఎక్కుడుగ నాకర్షింప బడుటలో నాశ్చర్యము లేదు. నాటినుండియు హరిజన కుటుం బములు పరంపరగా పరమతములందు కలియుచుదొడగెను.

హిందూ సంఘము క్రమముగ క్షీణింప జొచ్చెను. పాంచాలము, బంగాళము, మళయాళము, మొదలగు ప్రాంత ములందు మతాంతరుల సంఖ్య హిందువులకంటె నధికతర మగుట కీమత పరివర్తనయే ముఖ్య కారణము. స్వయంకృత దుశ్శాసన, రజ్జువు ఆర్యధర్మానేక, మతాంతర, ప్రచారక, ప్రబోధ ప్రభంజన బలోదలిచే, తెగి పడబిని జీవ నౌకలు తేలియాడు చుండెను. దేశహితైషులు, త్యాగ మూర్తులు, నగు భరత పుత్రులు, కొందఱు దానినుద్ధరింప బూనుకొనిరి.

ఇస్లాము మత ధాటిని దయానంద సరస్వతీ ప్రభృతులు క్రైస్తవ మత ధాటిని రాజా రామమోహనరాయ ప్రభృ తులు, ఎదుర్కొని విజ్ఞులగు భారతీయుల మత సంస్కృతిని బలపరచిరి. సంఘమునందు కాలవశమున, బొడమిన అత్యా చారములను తొలగించి, తగినట్లు సంస్కరించినగాని, హైం దవ ధర్మము అన్యమత సంఘర్షమునకు తాళజాలదని నిశ్చ యించి, యుచిత సంస్కారము గావించిరి. వారిచే సంస్క రింపబడిన హిందూమతమే క్రమముగ ఆర్య బ్రహ్మసమాజ

నామములతో, హిందూమత శాఖలుగ నేటికిని వెలయు చున్నవి. భరతఖండములో నేటికిని కొందరు ఆ మతము లను ఆదరించుచనే యున్నారు. నాడు పౌరాణిక మతమున ప్రచారమునగల విగ్రహారాధనము అర్ధరహి వర్ణభేదములను తొలగించి, సర్వమానవ సౌభ్రాత్రము, పునః ప్రతిష్ఠించు టయే బ్రహ్మమతమువారు చేసిన మార్పులు.

ఈ సంస్కార బలముచేతనే, హిందూమతము ప్రాభవ శక్తిగల, మతాంతరుల దాడికి నిలువ గల్గెను, ఇందుకు వారిని ప్రశంసించుటకు మారుగా స్మార్తులు వారిని నిరసించుచుం డుట సిగ్గుచేటు. ఆర్య మతా చార్యులు, మతాభివృద్ధి, శుద్ధి సిద్ధాంతము నెలకొల్పి మతాంతరులైన వారిని, తిరిగి హిం దూమతమున జేర్చు టవకాశమును - గల్పించి, ఆర్యమత పునరుద్ధరణకు పునాదులను వేసిరి. అందు శ్రద్ధానందులు, చైతన్య భక్తులు, మొదలగువారు ముఖ్యులు. అంతకు పూర్వము హిందూ మతమునుండి, పరమతములోనికి బోవు టకే కాని పరమతావలంబులు హిందూమతమున జేరుటకు, స్మార్తులవకాశ మిచ్చినవారు కారు. అందువలన హైందవ సంఘము క్రమముగా తరుగుటయే కాని, పెరుగుట లేదు. ఆ యవసరములందాయా సంస్కారపు వడపోతలు జరుప కుండినచో, సంకుచిత మతాచార మలీనమైన హిందూమత వాహిని నేటికి పూర్తిగా మతాంతర సాగరమున, సంగమి యుండుననుటకు సందియము లేదు.

## నేటి యవసరము

మతాంతర ప్రచారకుల వలన, నాడు కల్గిన విపత్తున కంటె, ఉగ్రరూపమై ప్రభుత్వమువలన నేడు తటస్థించినది. నేటివరకును, హిందూ సంఘమునకు, సాంఘికముగ మాత్రమే వెలియై యుండిన కోట్లకొలది హరిజనులను బ్రిటిష్ ప్రభుత్వమువారు రాజకీయముగా, వెలిజేయగల యొక పరిష్కార మార్గము గావించి యుండిరి. సాంఘికముగా తమ్మవమానించుచున్న హిందువులతో గలసి రాజకీయముగా వర్తించుట కంటె, ప్రభుత్వ పరిష్కారము ననుసరించి, వేఱు పడిపోవుటయే మేలని, హరిజనులుకూడ సంబంధమును, శాశ్వతముగా విడగొట్టుకొనిరనగా, హరిజన సంఘము హిందూమత రంగమునుండి, నిష్క్రమించిన దనియే తలంప వలయును. ఇంచు మించుగా మహమ్మదీయ సంఘములో సమాన జన సంఖ్య గల హరిజన సంఘమును కోలుపోయినచో హిందూ సంఘవ్యక్తికి, దక్షిణ బాహువే దగ్ధమైనట్లు తలంపవలయును.

## పూనా ఒడంబడిక [Poona pact]

అట్టియెడ సమయజ్ఞుడగు గాంధీజీ ఆంగ్ల ప్రభుత్వము వారి సాంఘిక పరిష్కార (Comunal award) ప్రకటనను వినెను. హిందూమత మహిమా చంద్రికను, మాటుపరచు చున్న దుష్కీర్తి దోషమును దుడిచివేయుటకును, చిరకాల మునుండి, యధోగతి నందియున్న సోదరులగు నిమ్నజాతుల నుద్ధరించుటకును, కృష్ణపక్ష చంద్రునివలె, దినక్రమమున క్షీణించుచున్న, హిందూసంఘమును బలపరచుటకును, వర్ణ భేదములు తొలగించుటకును, హైందవ జాతీయతను పునరుద్ధ

రింప జేయుటకును, యింతకంటె తగిన యదును రాదని, "కమ్యూనల్ ఎవార్డుకు" (Comunal award) నిరసనగా యరవాడ సెంట్రల్ జైలులో, నిరాహారదీక్ష ప్రారంభించెను. దీనితో హిందూసంఘము చలించెను. సవర్ణ హిందూ నాయకులును, హరిజన నాయకులును ఉద్బుద్ధులై, కర్తవ్యమును గ్రహించిరి. సవర్ణులలో హిందూసంఘమున అస్పృశ్యత అనునది లేకుండా జేయుటకును, హరిజనులు మత సాంఘిక రాజకీయ, వ్యవహారములలో సవర్ణ హిందువులతో గలసి మెలసి యుండుటకును పూనాలో ఒడంబడిక చేసికొనిరి, దీనినే పూనా ఒడింబడిక (Poona Pact) అందురు. నిమ్న జాతి మహా నాయకుడైన అంబేద్కర్ కూడా, ఈ అంగీకార పత్రముపై సంతకము చేసెను. భారత స్వాతంత్ర్య సంగ్రామానికి సారథ్యము వహించే గాంధీజీ చనిపోవటం యిష్టములేని పరిస్థితులలో ఈఒడంబడికపై అంబేద్కర్ సంతకముచేసెను అని అభిజ్ఞుల అభిప్రాయము. ఇది ఆయన మహోదారతకు నిదర్శనమని మా అభిప్రాయము. నైష్ఠికులగు, పండిత మదన మోహన మాలవ్యా, మేధావంతులగు యం. ఆర్, జయకర్ తేజ బహుదూర్ సప్రూ, డి.డి. బిర్లా, రాజగోపాలాచారి యిత్యాది ప్రముఖులుకూడా పూనా ఒడంబడిక మీద సంతకములు జేసిరి. గాంధీజీ ఉపవాస దీక్ష విరమించిరి.

నేటికైనను ప్రబుద్ధులై సంఘ సంస్కారము, నాచరించుట సాంఘికుల ప్రధాన ధర్మమై యున్నది. ఈ ధర్మము యిప్పటికైనను అనుష్ఠింపకున్నచో కోట్ల కొలదిగ నున్న మన హరిజన సోదరులు పరమతావలంబకు లగుట నిక్కము,

ఎఱిగి, ఎఱిగి స్వసమాజాభివృద్ధి నిరోధకమైన మూఢ విశ్వాసమును వీడకున్నచో, స్వజాతి మత బలమును చేజేతల క్షీణింప జేసికొనుటయే గాక, ప్రపంచ సభ్య జాతులందు భారత జాతి కర్హస్థానము లభింపదనియు విశ్వసింపవలయును.

## అస్పృశ్యతా పీఠాధిపతులు

సంఘ సంస్కారము మత పీఠాధిపతుల ముఖ్య కర్తవ్యము, కాలగతినిబట్టి ధర్మ వాహినులు పెడదారులఁబడి ప్రసరించుచున్నపుడు అందలి గుణరత్నములు కాలఘర్షణచే వక్రించి వికృత రూపముఁ దాల్చుట సహజము

అప్పట్టున సంఘనియంతలగు పీఠాధిపతులు, సాంఘికాచారము లందనవసరములగు, సంస్కారములఁ గావించుచు సంఘము నుచితమార్గమునకు త్రిప్పవలసి యుండును. కాని అట్టిది వీరు చేసినట్లు పొడకట్టను. వీరు స్వధర్మమును మరచి భిక్షుల పేరిట కుటుంభరణ దీక్ష అత్యంత దక్షతతో నిర్వర్తించుచుండుట శోచనీయము. అభ్యుదయవాదులు చెవిచెంత జేరి యుచ్చకంఠమున హరిజనోద్ధరణ గీతిక లాలపించుచున్నను, హేతువాదులు దిగ్భిత్తులు బీటలువాఱ ప్రబోధ తూర్యముల పూరించుచున్నను, మన మత నియంత లింతవరకును కన్నెత్తి చూచినపాపమున బోకయుండిరి. వారికి నేటికైనను భగవత్పాదోద్భవులగు హరిజన సంతతిపై కరుణ జనింపకుండుట, దేశదౌర్భాగ్యము కాక మరేమని తలంపవలవలయును? తామే ముందు మేల్కొని ప్రభుత్వమువారియు ప్రజా నాయకులయు, సహకారము కోరవలసిన వీరు తాము

ప్రారంభింపలేరు సరిగదా పరులు ప్రారంభించిన సత్ కార్యముకు కూడ, తోడుపడకుండుట మిక్కిలి విచార కరము. ఇప్పట్టున ఆచారదాసులగు ప్రజలు సంఘ సంస్కారులయు, సనాతన వాదులయు, మధ్యమునచిక్కి పథ్యమో, అపథ్యమో నిర్ధరించుకొనలేని సంకటావస్థలో నున్నారు.

కావున వారి సంశయాంశములను కొన్నిటినైన నివారింప ప్రయత్నించుటయే మా ఆశయము.

ప్రశ్న:- హరిజనోద్ధరణము ప్రాచీన ధర్మ విరుద్ధముకాదా ?

సమాధానము:- ఈ ప్రశ్నమునకు సమాధాన మొసగుటకు ముందు ప్రాచీన ధర్మస్వరూప పరిణామములెట్టివో దిక్సూచికముగ తెలిసికొన వలసి యున్నది. అప్పుడు గాని ఈ సంస్కరణము ప్రాచీన ధర్మవిరుద్ధ మెట్లు కాదో బోధపడ నేరదు. కావున నాయంశములను సూచింతుము. అతి ప్రాచీన కాలమున మతములుగాని, వర్ణములుగాని, కులములుగాని లేవు.

కాన మత ప్రసక్తి లేని ఆదిమ పద్ధతి (Primitixe Secularism) ఆనాడున్నట్లు పొడగట్టుచున్నది. కర్మకాండములకు సంబంధించిన వర్ణ ధర్మ కర్మాదులు ప్రతి యుగమున మారుచుండు నట్లును, అట్లు జ్ఞాన కాండములోని అంతః సత్యము (నిత్య సత్యము) మార్పు నొందక కాలక్రమమున స్పష్టతరమై ఏకవిధముగ విరాజిల్లు చున్నట్లును సాంఘికధర్మ చరిత్రము విస్పష్ట మొనర్చుచున్నది. దేశకాల పాత్రముంబట్టి సంఘ పరిస్థితులంబట్టయు, నాచారకాండము తరచుగ మారుట సహజము.

ఉదయమున తూర్పున కేగుచు సూర్యరశ్మి కడుంచు కొన్న గొడుగు, మధ్యాహ్నము దాటినచో పడమర దిక్కు త్రిప్పుకొన వలసి యుండును. అయిదేండ్ల బాలుని అంగి పదేండ్లు పైబడుసరికి పనికిరానిదగును. నేడు అమృతమైన వస్తువు, రేపటికి విషమగుచున్నది. నేడు వగరైన ఫలము రేపటికి మధుర మగుచున్నది. భిన్న దేశకాలముల వరకు పోనేల 1. ఒక్క కాలముననే, ఒక్క దేశముననే బ్రాహ్మణు లలో నెన్నియో భావ భేదములు కలవు. ఔత్తరీయులగు బ్రాహ్మణులు కొందఱు మత్స్య భుక్కులు. దాక్షిణాత్యుల కది గిట్టదు. ఒకరియందు మతాభిమానము మెండు. మరి యొవరికందు తక్కువ. దాక్షిణాత్యులు బాల్య వివాహము లాచరింతురు. ఔత్తరీయులందది తక్కువ.

ప్రాచీన యుగము నుండియు అవిచ్ఛిన్నముగ ననుస రింపడుచున్న జ్ఞానకాండయే ప్రాచీన ధర్మ మనంబడు. కాని ఋగ్వేద యుగమునుండి పెక్కు వికారములు పొందుచున్న మన కర్మకాండ మాత్రము ప్రాచీన ధర్మ మనిపించుకొన జాలదు. భారతీయుల జ్ఞానకాండ మహోదారమైనది. మత ప్రసక్తి లేని ఆదిమ పద్ధతిచే ప్రతిపాదితమగు జ్ఞాన మహిమ చేతనే భారతీయ ధర్మము సభ్య మతములందు అద్వితీయ తేజోరాశియై వెలయ గలిగెను. పూర్వార్జితమగు నీ ప్రాచీన విజ్ఞాన విధానమును జూచుకొనియే నేటికిని భారతీయుడు గర్వించుచున్నాడు,

కాని ప్రాచీన నైతిక ప్రభావముచే మన కార్జించిపెట్టిన యశశ్చంద్రికకు గడ్డ కట్టిన మన కర్మకాండము మసి పూయు

చున్నదనుట యదార్థము. మన ఉపనిషద్దర్శన జ్ఞాన సాగరమును వేనోళ్ళ ప్రశంసించు ప్రపంచమున గల సుప్రసిద్ధ తత్త్వవేత్తలగు వారిలో ఒక్కరైనను మన కర్మకాండమును, అనగ యజ్ఞ పశుహింసను, శ్రాద్ధప్రాయశ్చిత్త జడారాధనలను నిరర్థక వర్ణవ్యవస్థా, నిర్బంధ వైధవ్య బలవద్బాల్య వివాహములను, నౌకాయాన, స్త్రీ శూద్ర విద్యానిషేధములను. అమానుష మగు నీ యంటరాని తనమును, తీవ్రముగ నిరసించు చుండుట కాంచు చున్నారము. ఈ దురాచారములన్నియు అసభ్యములేగాక మన రాజకీయ నైతిక సాంఘికాభివృద్ధికి భంగకరములని ఎల్లరెరుగుదురు. సజీవమగు జాతియందు నైతిక శక్తి జీవవాహినివలె, నవిచ్ఛిన్నముగ, ప్రవహించు చుండును. తాత్త్వికముగా దానికి పరిణామమనునది లేదు.

దానికి పరిణామమనగ ధర్మగ్లానియే అని పరిగ్రహింపవలయును. చైతన్యముగల సంఘమున ఆచారములు కాలానుసారముగ మారుచుండును. సంఘచరిత్ర నెఱిగిన వారికిది, ప్రకృతిధర్మమని తోచకపోదు. నైతిక సూత్రముమాత్రము తెగనీకసంఘశ్రేయమునుగోరి సాంఘిక నిబంధనల నెన్ని విధముల మార్పులు గావించినను సేగిలేదు. శరీరమున రక్తప్రసరణ మాగినచో, చైతన్యము నశించునట్లు కాలానుసారము మానవలసిన కర్మకాండము బిగిసిపోవుటయు, మార్పురాని నైతిక తత్త్వము తఱచు తారుమారగుచుండుటయు, సంఘపతనావస్థకు బహిర్లక్షణములు, హైందవ సమాజమున అట్టిగతి వర్తమాన యుగమున (పౌరాణిక యుగమున) సంప్రాప్తమైనదని చెప్పవలసి వచ్చినందుకు విచారింపని భారతీయుడుండడు.

ప్రాచీన ధర్మ సౌధమునకు ప్రధాన కుడ్యములగు, సత్య శమ సమత్వాది సాత్త్విక ధర్మముల పునాదులు కదలిపోవుటయు కాలానుసారము పరిణమింప వలసిన వర్ణధర్మాదులు మార్పు గాంచక బిగిసి గడకట్టి పాషాణ ప్రాయము లగుటయు హైంద వ సమాజమునకు పురాణ యుగములో క్రీ॥ శ॥ 5వ శతాబ్ద ప్రారబ్ధముల్లైన ఘోరతరములగు ధర్మపరిణామములు.

ఆ దుష్పరిణామపు సంఘుముయొక్క బుద్ధిపానము నాచ్ఛాదించి, సర్వ సమత్వ సత్య శౌచాది ఉదారాశయము లను మరపించెను. అప్రధానములగు, బాహ్య వేషములను అర్థ రహితములగు, మూఢాచారములను, మతమునకు ముఖ్య ప్రాణము లనెడు భ్రాంతిలో ప్రజలను ముంచివేసెను. ఆ కారణము చేతనే కట్టు బొట్టు జుట్టులు దిద్ది తీర్చుటలోను, "సహజముగ నీవు పవిత్రుడవు కావు. నన్ను ముట్టుకొనకు." మని నిర్మలులగు అమాయక సోదరులను అపమానించుట లోను, మనవారు చూపుచున్న శ్రద్ధా భక్తులు దయా సత్య శౌచ సమత్వేంద్రియా నిగ్రహములందు గానవచ్చుటలేదు.

స్వామి వివేకానందులు వచించినట్లు ప్రస్తుతము మన మత ధర్మము మనోవృత్తినుండి, మహానస గృహములకు దిగ జారెనన్న మాటలో నచ్చెరువు లేదు. అవర్ణుని మేనిగాలి సవర్ణుని వంట యింటిపై సోకినను అవర్ణుడు ఇంటి వెలుపలి వాసము ముట్టినను, అందు పాత్రమును దూరమునుండి చూచినను మైలపడి పోవుచున్నది. మన శ్రద్ధాభక్తులన్నియు నేడు విస్తరిలో పప్పు దబ్బళము లేమేదిక్కు వడ్డించవలయును. దేనితర్వాత నేది అనవలయును; అను కుక్షింభరణ

కార్యములందే గాని. ధర్మ నిర్వహణమున కాదనుట విస్పష్టము. కులములలో తన కులము, శాఖలలో తన శాఖ, గోత్రములలో తన గోత్రము, వంశములలో తన వంశము శ్రేష్ఠతమ మైనవనియు, ఇతరుల దర్శన స్పర్శములు తన పవిత్రతకు భంగకరములనియు విశేషించి తన భార్యచేసిన వంటకముకూడ ముట్టరాదనునంత పవిత్రుడనియు సహకరించు మౌఢ్యమే మతనియత్వ స్థాన మాక్రమించెనని చెప్పవలసినందుకు లజ్జించుచున్నారము. ఇంతియకాక నిన్న మొన్న పుట్టి నేడు వాడుకలోనున్న వికృతాచారము లన్నియు, సృష్టితో పుట్టినవే అనియు, వానిని మార్చ చూచుట మహాపరాధమనియు తలబోయు సంతటి అధోగతికిఁ గూడ దిగజారిపోవుచున్నామని చెప్పుటకు మిక్కిలి సిగ్గుపడుచున్నాము. దీని వలన నిజమగు మతతత్త్వము నీరసించి అవిచార మూలకమై అంధపరంపరగా వచ్చిన అత్యాచారములే ఆచరణీయ ధర్మములుగ పరిణమించెను. అర్థరహితములగునట్టి దురాచారములలో అస్పృశ్యత అగ్రగణ్యమనిరి. సంఘమున పుట్టుకతోడ అస్పృశ్యులున్నారనగ అందు సర్వసమత్వ దయాధర్మములు, దగ్ధపటల మైనవనియే భావించవలయును. మూల ధర్మములగు దయాసత్యములే దగ్ధమైనపుడు, హిందూమతము సనాతన వైదిక మగుటకు చరిత్రనెఱిగిన బాలుడైనను విశ్వసింపడు. ప్రాచీన ధర్మమిట్లు చట్టుబండలై పోయి స్వార్థ నిర్మితములగు దూష్యకర్మములే భారతీయ ధర్మములుగ భ్రమించెడు మన సనాతన వాదులకు, కామిలార్తునకు జగము పచ్చగ తోచునట్లు హరిజనోద్ధరణము అధర్మోద్యమముగఁ దోచుటలో నచ్చెరువు లేదుగదా !

ప్రాచీన యుగమున మన పూర్వుల వర్ణము పసుని దాకినంతమాత్రమునను, ఒకునితో భుజించినంత మాత్రము నను, యితరుని సమీపించనంత మాత్రమునను, నూడి రాలి పోవునంత దుర్బలతరమైనది కాదు. వారి వర్ణధర్మము గుణ కర్మపై నాధారపడి యుండెడివి. కాని బాహ్య చిహ్నములపై నిలిచి యుండునవి కావు. ప్రస్తుతము హిందూమత రంగము నుండి నా యంతరంగ పాత్రలు తొలచి వేయబడినందున బహిరంగ కర్మమాల పటాటోపనే ప్రాధాన్యము వహించు టలో నచ్చెరువు లేదు. బిడ్డ నెత్తుకొన్న సంతోషములో గుడ్డ తొలగిపోవు టెరుగని కులుకులాడి వలే మన యాచార దాసులు ప్రస్తుత హిందూ సాంప్రదాయమున, సత్వరమే చచ్చినదని, తెలియ నేరక లోని గుంజు పోయి. డొల్లల వలె నున్న బాహ్యకర్మములే ప్రధాన మత ధర్మములనుట దేశ హితైషులు విచారింప తగినది,

కాబట్టి అసభ్యమై, యనర్థ దాయకమై యనుష్ఠాన యోగ్యముకాని, నేటి సాంప్రదాయమునకును, సత్య శౌచ సమత్వాది, నైతిక విశిష్టమగు ప్రాచీన ధర్మమునకును, పోలి కయే లేదని గ్రహింతురుగాక. ప్రస్తుతము నామ మాత్రాన శిష్టమైన ఆధ్యాత్మిక తత్వ శీర్షికతో నేటి యాచార కాండ మంతయు, యనుష్ఠేయమగు సనాతన ధర్మమనుట,ఆధ్యాత్మిక వాదుల లోక వంచన ప్రయత్నమని, యైతిహాసికత లెఱుంగ నిది కాదు. సర్వ సమానత్వ ప్రతిపాదితమగు ప్రాచీనధర్మము (Primitive Secularism) అస్పృశ్యత యను దురాచార మును పోషించుననుట కంటె, శుద్ధాబద్ధము వేరుండబోదు. దయా, సత్య, శౌచ, విద్యలే పరమ ధర్మములుగాఁ దలంచి,

క్షత్రియులగు మహావరాంబరీష గార్గ్య వంశములను బ్రాహ్మణులను గావించిన ప్రాచీనధర్మము, క్షత్రియులగు విశ్వామిత్ర, జనకులను బ్రాహ్మణ శ్రేష్ఠులనుగా మార్చిన ప్రాచీనధర్మము, క్షత్రియులగు నశ్వపతి, జైవల్యాదులను, వేదాంత గురువులను గావించిన ప్రాచీనధర్మము నీచస్త్రీసంజాతులగు వసిష్ఠాగస్త్యులను, వాల్మీకి, నారదులను పరాశరవ్యాసుల, సాంఖ్య కౌండిన్యులను,కపిల జాబాలులను, ఆచార్య స్థానమునకును బ్రాకించిన ప్రాచీనధర్మము.కులటా పుత్రులగు ఐతరేయ, కవషాదుల వేదసూక్తులకుఁ గర్తలంజేసిన ప్రాచీన ధర్మము, "సర్వం ఖల్విదం బ్రహ్మ," అహం బ్రహ్మాస్మి" "యస్య సర్వ మాత్మైవాభూద్"

* భద్రం - నోపి. వాతయ మనః "ఉత్తిష్ఠత - జాగ్రత ప్రాప్యవరాన్ నిబోధత" "సత్యం వద. ధర్మంచర"

మొదలగు మహిమాన్వితములగు ధర్మములను బోధించిన ప్రాచీన ధర్మము,

శ్లో. విద్యా వినయ. సంపన్నే.
బ్రాహ్మణే - గవి హస్తిని.
శునిచైవ - శ్వపాకేచ
పండితాః - సమదర్శినః

శ్లో॥ అవ్యక్తా దీని - భూతాని
వ్యక్త మధ్యాని - భారత
అవ్యక్త నిధనాని - ఏవ
తత్రకా - పరిదేవనా"

మొదలగు గీతా వాక్యములతో ప్రభావితమైన ప్రాచీన ధర్మము.

"నయోనిర్నపి సంస్కారో, నశ్రుతి, ర్నపి సంతతి
కారణాని, ద్విజ త్వస్య వృత్త మేవతు కారణమ్

నకర్మణా - నప్రజయా - ధనేన - త్యాగేన
ఏకే - అమృతత్వం ఆనశుః.

తా. అమృతత్వము కర్మముచేతగాని, సంతానముచేతగాని సిరి సంపదలచేతగాని లభించదు. యతీశ్వరులు త్యాగముచేతనే అమృతత్వమును పొందిరి.

మాతృదేవోభవ - పితృదేవోభవ,
ఆచార్యదేవోభవ - అతిథిదేవోభవ.

పటవల్ - చ.

మొదలగు ఉదాత్త ధర్మములతో చిగిర్చిన ప్రాచీన ధర్మము

" అహింసా పరమోధర్మః" ఆత్మనత్సర్వభూతాని"
" పాపాయ పరపీడనమ్," "సర్వేజనాః సుఖినోభవంతు

అను శాంతి సూక్తులతో పూవునైనా ద్రుంపక, చీమనైనఁ ద్రొక్కక పక్షినైనఁ జోపక, పాములకుకూడా పాలువోయు బౌద్ధధర్మ సంస్కార దోహదముచే ఫలించిన ప్రాచీనధర్మము, ఎట్టకేలకు జడములగు దారు శిలాది ప్రతిమలకు కూడ జీవ ధనంబు లొసంగు ప్రాచీనధర్మము, నిజముగా అస్పృశ్యులైన

వారి నెందరనో, తన కడుపున బెట్టుకొని భరించుచు పతిత
పావనబిరుదము వహించిన ప్రాచీనధర్మము, నిర్దోషులు,నిష్క-
ల్మష అమాయకులు నగు హరిజన సోదరులను, నీచులుగా
చూచుట సహించునె!

## సాంఘిక పరిణామము

సాంఘిక ధర్మముల, సంస్కరించుట శ్రేయోదాయక
మగునా యని కొందఱు పృచ్ఛ సేయుచున్నారు. శ్రేయో
దాయకమనియే మా సమాధానము. సాంఘిక దేహమైన
ప్రకృతి పదార్థము ఎప్పుడును, పరిణామము చెందుచుండును.
పరిణామము సహజ ధర్మము. బీజమునకు వృక్షము, గ్రుడ్డునకు
పక్షి పరిణామ స్వరూపములు. పుట్టిన బిడ్డ పుట్టినట్టుండక దిన
క్రమమున పెరుగుచున్నది. అభ్యుదయమును గోరు వ్యక్తులకు,
సంఘములకు, సంఘవ్యవస్థలకు పరిణామ మనివార్యము. వ్యక్తి
గతాభివృద్ధియే సంఘాభి వృద్ధి. అభివృద్ధి పరిణామము చెందని
వ్యక్తిగాని, సంఘముకాని, వ్యవస్థగాని, మృతకల్పమనియే
చెప్పవలయును. ఇందుకు ప్రపంచ చరిత్రయే ప్రబలతార్కా-
ణము. సంఘము స్థాణువు కాదని ప్రపంచ చరిత్రయే చెప్పు
చున్నది. సంఘ మెప్పుడును పరిస్థితుల బట్టి మారుచుండును.
ఆయా కాలము ననుసరించియు, ఆయా పరిస్థితులబట్టియు,
సంఘములో నున్న ఆచారములు, కట్టుబాట్లుకూడ మారు
చుండును. ఎప్పుడో, ఎవ్వరో, ఆయా పరిస్థితులనుబట్టి
ఏర్పరచిన కట్టుబాట్లు ఎల్లప్పుడును ఉండవు. ఒక్కొ-

కృప్పుడు ఆ కట్టుబాటులే ఆ యాచారములే, తరువాత కొంత కాలమునకు సంఘమునకు అపకారము చేయవచ్చును. ఉదా॥ సహగమనము మొదలైనవి. కాలక్రమమున, వికాస పరిణతి గాంచుచున్న పాశ్చాత్య సంఘములును, సంఘ వ్యవస్థలును అభ్యుదయ స్థితిలో నుండుటయు, మార్పు అంగీకరింపక భారతీయ సంఘములు, వ్యవస్థలు గుంటపూవులు పూయు చుండుటయు మనము చూచుచున్నారము.

సాంఘిక పరిణామావసరమును గుర్తించి కాలానుసారముగ సంఘ ధర్మముల మార్పును సహించి, సంఘమును సంస్కరించుటయే శ్రేయోదాయకము. కాన సంఘ ధర్మ పరిణామము, సంఘసంస్కారము అభ్యుదయకరమగు, తారక మార్గమనుట నిర్వివాదాంశము.

## హరిజనోద్ధరణ ప్రయత్నము

హరిజనోద్ధరణ సంస్కారము శ్రేయస్కరమైనపుడు, తదుద్ధరణకై భారతీయ ప్రయత్నము లింతవరకేల జరుగలేదని కొందఱభిప్రాయ పడుచున్నారు.

భారతీయ సమాజ చరిత్రను నిపుణముగ బరికించినవారికి, హరిజనోద్ధరణ ప్రయత్నముల కనేక తార్కాణములు గాన్పింపక పోవు.

ఆదిద్రావిడు లంతేవాసులై అష్టకష్టములు పడుచున్నపుడు బౌద్ధమత ప్రవక్తయగు గౌతమ బుద్ధుడు (క్రీ॥పూ॥ జే 400 సం॥) నిమ్నజాతులను జేరదీసి, అభ్యుదయ మార్గముప

దేశించి అత్యంతము నాదరించెను. బుద్ధుడు తన సంఘములో శూద్రులకంటె హీన కులస్థులను జేర్చుకొన్నాడు. వర్ణవ్యవస్థను పూర్తిగా నిరసించినాడు. పుట్టుకతో వర్ణనిర్ణయమును విమర్శించినాడు. బ్రాహ్మణాధిక్యతను తిరస్కరించినాడు. సంఘ బిక్షువులలో వర్ణవ్యత్యాసాలు లేకుండాచేసి మాతంగ కన్యలను కూడా బిక్షుసంఘములో జేర్చుకున్నాడు. ఒక వృత్తినుండి, మరియొక వృత్తిలోనికి మార్చవచ్చునని చెప్పినాడు. ఒక వృత్తిలోనివారు, యింకొక వృత్తిలోని వారిని వివాహము చేసికొనవచ్చునని అగ్రవర్ణ అహంకారముపై దాడివెడలుటయే గాక, దానిని పూర్తిగా నశింపజేసినాడు. మూఢ నమ్మకాలతో పోరాడినాడు. హేతువాద దృక్పథమునకు సహకారి అయినాడు. బౌద్ధమత ప్రచారకులగు బిక్షువులలో నిమ్నజాతులు కూడ గలరు. నాటి అర్థరహిత నిర్బంధ వర్ణవ్యవస్థను ఇట్లు ఖండించినాడు:-

గీ॥ వర్ణ విభజన వైఖరి పట్టి మిథ్య
పంచముడు జ్ఞానియైనచో బ్రాహ్మణుండు
బ్రాహ్మణుడు జ్ఞాన దూరుండు పంచముండు
జన్మచేగాదు, నడతచే జాతి గలుగు.

(బుద్ధ బోధ సుధ)

## శంకరాచార్యులు

ఒకనాడు శంకరుడు గంగానదికి శిష్యకోటితో కాశీ వీథిలో స్నానానికి వెళ్లుచుండగా, తన పెంపుడు కుక్కలతో ఒక అస్పృశ్యుడు ఎదురైనాడట. అస్పృశ్యునిచూసి శిష్యులు, తాను తొలగిపోగా, హరిజనుడిట్లు ప్రబోధము చేసెను.

" అన్నదాన్నమయ, మధనా చైతన్య మేవ. చైతన్యాత్
ద్విజవర దూరీకర్తుం వాంఛసి కిం. బ్రూహి గచ్ఛ గచ్ఛేతి.
( చండాల ఉవాచ )

చండాలోస్తు. సతు-ద్విజోస్తు గురురిత్యేషా మనీషామమ

( శంకర ఉవాచ)

ఇవే 'మనీషా పంచకముగా' ప్రసిద్ధికెక్కిన శ్లోకములు ఈ ప్రపంచమును ఎవరయితే అభేద భావముతో జూడగలుగుదురో వారు చండాలుడైనా సరే, బ్రాహ్మణుడైనా సరే నాకు గురువులు.

## రామానుజా చార్యులు

విశిష్టాద్వైతమత ప్రవక్తయగు రామానుజా చార్యులు సిద్ధాంత రీత్యా గాక, అనుష్ఠాన మార్గంలో కూడా సర్వ సమానత్వమునే ప్రబోధించినాడు. వారు వర్ణములను, కులజులను, వర్గములను పాటించలేదు. ఆళ్వారులలో కొంతమంది శూద్రులు, నిమ్నజాతులు, హరిజనులు శిష్యులుండెడివారు. మానవులలో ఎటువంటి భేద భావము ఉండకూడదని రామానుజుల మతము. మేల్‌కోడ్ దేవళములోనికి అస్పృశ్యులను ప్రవేశపెట్టిన ఘనత ఒక్క రామానుజాచార్యులకే దక్కినది. రామానంద అనే వైష్ణవమతగురువు "ఏవ్యక్తి మరోవ్యక్తిని నీ కులమేమిటనిగాని నీజాతి ఏమిటనిగాని, నీ గోత్రం ఏమిటని గాని........." అడగరాదు అని శాసించినాడు.

రామానుజాచార్యులు హరిజనులకు తిరుమంత్రముపదేశించి, ఆదరించి, సంఘసంస్కర్తగా ఘనతతర కీర్తి బొందెను. అతని తాతయగు యామునాచార్యులుగారు కూడ

హరిజనులను ప్రియశిష్యులనుగ స్వీకరించెను. అతడు తిరుక్కచ్చి నంబియను బ్రాహ్మణునిచేత నంత్యజసత్కారమును బొందెను.

V.R NARLA MEMORIAL LIBRARY D.P.R.I. Acc. No.

ఆళ్వారులలో ప్రసిద్ధులగు తిరుప్పాణి ఆళ్వారు పంచముడు. వీరశైవమత ప్రవక్తయగు బసవేశ్వరుడు భక్తిపుటముతో పంచమబ్రాహ్మణ వర్ణదోషము నశించెనని వారి నిరువుర నిరుకేల గీలించి సమముగ నాదరించెను. ఆదిశైవ వీరశైవ భక్తులలో కందప్పనందనార్ శ్లోకమేళుడు, శివనాగుమయ్య, కక్కయ్య మున్నగు హరిజను లెందరో గలరు.

సిక్కుమతాచార్యుడగు గురునానక్, గౌరాంగ మత ప్రవక్త శ్రీకృష్ణ చైతన్యులు, బ్రహ్మమత ప్రవర్తయగు రాజా రామమోహ నరాయలు, వివేకానందస్వాములు, ఆర్య మతాచార్యులగు దయానంద సరస్వతులు, హరిజనులకు మోక్షపథము బోధించి సవరులతో సమముగ ఆదరించి యున్నారు. విద్వత్ప్రభువగు శ్రీ హర్షచక్రవర్తి తన ఆస్థానములో బాణమయూరాదులతో సమముగ, దివాకరుడను మాతంగ కవీంద్రు నాదరించినాడు. ఇంతియకాక అత్యంత కులజులగు నందుని, కపిలుని, ఋషికులమునఁజేర్చి ఆదరించుటయు ఏకనాథుడుముందు చండాలునకు భోజనమిడి తగుపరి పైతృకము గావించుటయు, ఘూర్జరుడగు నృసింహ మేధావి లాలాలజపతిరాయలు, గోవిందరేనడే, ఆంధ్రదేశ పునరుద్ధరణ ప్రభావులగు కందుకూరి వీరేశలింగము పంతులు, మహర్షి రఘుపతి వేంకటరత్నము నాయుఁడు, కవిరాజు త్రిపురనేని రామస్వామి, ఉన్నవ లక్ష్మీనారాయణ, గోరా, ఆవుల గోపాలకృష్ణమూర్తి ప్రభృతులు హరిజనోద్ధరణకై చిరకాలము

నుండి పడిన పాట్లు తదుద్ధరణ ప్రయత్నములకు ప్రబల నిదర్శనములు.

ఇంతియకాక హరిజన సభ్యతను చాటు ప్రమాణములు మరికొన్ని గలవు. పండరీపుర దేవాలయమున, మహారులు, ధేడులను, హరిజన విగ్రహ పూజయు మేల్కోట దేశములో నేటికిని సంక్రాంతి దినములందు హరిజనులు పూజారులుగ నుండుటయు, పెరంబుదూరు, రామానుజస్వామి తేరు నేటికిని హరిజనులే లాగుచుండుటయు, తిరువాయూరు దేవునికి హరిజనులు సురటి వీచుటయు, దత్తమండలములోని వసనోలు గ్రామమున పాండురంగ దేవాలయమున హరిజనులే పూజారులుగ నుండుటయు, విశాఖ మండలమురో బ్రాహ్మణులు కొందరు వివాహ సమయములలో, హరిజనులను సత్కరించుటయు, దక్షిణ మండలములో కొన్నిచోట్ల పరయలను పంచములు సరిహద్దుతగవులను దిద్దుచుండుటయు, వారి సభ్యతకును, సంస్కృతికిని, తార్కాణములు కాకపోవు. వేయేల!

వాల్మీకి, వ్యాస, కపిలోల పిచండ దేవాది మహర్షులకును, నందహవ శిఖాది మహారాజులకును, కన్నమనీడు, మొదలగు మహా వీరులకును, శివనాగుమయ్య, నందనారు, తిరుప్పాణ్యాళ్వారు మొదలగు భక్తులకును, సక్కుబాయికి భక్తి జ్ఞాన వైరాగ్యము లుపదేశించిన జ్ఞానయోగి మొదలగు జ్ఞానులకును, కనక దివాకరాది కవి పుంగవులకును, అరుంధత్యాది పతివ్రతలకును పుట్టినిల్లైన హరిజన సంఘము స్పృశ్యమైనదనుట వివేకి లోకమున కెంతయు హేయముగ దోచుచున్నదో వివరింప నవసరము లేదు. కావున మన హరిజనుల

సభ్యత పూర్వమేబహుధా స్థిరపడి యున్నట్లును చిరకాల
ము నుండియు, తదుద్ధరణ యత్నములను జరుగుచున్నట్లును
గ్రహింతురుగాక !

## సంఘసంస్కారావసర మింకను రాలేదా?

సంస్కారము ధర్మబద్ధమైనను, హరిజను లుద్ధరింప
దగినవారైనను, అది కాలక్రమమున జరుగనలెనేగాని, ఒక్క
సారిగ గొప్ప మార్పు గావించుట కిప్పుడంత అవసరమేమి
వచ్చినదని కొందరు వాదించుచున్నారు.

కాని నేడు సంఘ సంస్కారమునకు అత్యవసరము కలి
గినదను విషయము ఆచారదాసులకు తోచకుండుట అచ్చె
రువు కాదు. ఏలయన :-

సనాతన ధర్మావలంబు లనుకొను వారొకప్పుడైనను,
సంఘము వంకకు దృష్టి మరల్చినపాపము పోలేదు. ప్రస్తుతము
ప్రపంచమున, మానవ సంఘములందెట్టి నవీన భావసంచల
నము గలుగుచున్నదో సంఘములు సంఘ వ్యవస్థలు,
నెన్ని విధముల నెట్లు పరిణామములు గాంచుచున్నవో, సభ్య
మత సంఘములు దినదినాభివృద్ధి గాంచుటకును, హిందూ
సంఘము దిన క్రమమున క్షీణించుటకును, మూల కారణము
లేవియో, ప్రకృతి పరిస్థితులనుబట్టి క్షయరోగ పీడితయగు
స్వసంఘమునకు సకాలమున తగిన చికిత్స చేయనిచో ఎప్పు
డెట్టి యిక్కట్టు వాటిల్లునో, ఒకనాడును తలపోసినవారుకారు.

ఇంతయేల! సంఘమంతయు ఒక్కపెట్టున భగ్గునమండి
పోవుచున్నను క్రీగంటనైనను వీరు చూడనొల్లరు. అది దాని

కర్మఫలమని మిన్నకుందురుగాని తప్పింప యత్నింపరు. కాని వారికిష్టమై శ్రుతులలో నిష్టమైన వాక్యములోని, అక్షర విన్యాసము చెక్కు చెదరకయున్న చాలును. బాబు పెండ్లిలో పెత్తనమంతయు తనదేనని చంకలు కొట్టుకొనునేగాని మరు నాడు తన్ను సంతవీధికీడ్చు సవతమ్మ వచ్చుననుమాటస్మరింప జాలని బాలునిరీతి, మన మత నియంతలు, తమ తాత్కాలికాధి పత్యాచారములు, నిలుపుకొన, జూతురేగాని సంఘ ధర్మ ములు సంపూర్ణముగ నశించి, సత్వసారములుడిగి సాంఘిక న్యాయము పోయి, దుర్భర నీచ దాస్య జీవన మేర్పడునని కించిత్తైనను తలపోయకున్నారు. ఇట్టి కూపనటద్భేకములకు, సంఘ సకస్కారావసరమెట్లు గోచరించును? వీరు క్రొత్త ధర్మమెంత మంచిదైనను సమ్మతింపరు. ప్రాతదెంత చెడ్డదై నను వీరికి ప్రాణాధికము.

పురాణ మిత్యేవ నసాధు సర్వం
నచాపి కావ్యం నవ మిత్య వద్యం
(ఇది కాళిదాస ఉవాచ.)

(ప్రాతది గదాఅని అంతయు మంచిది కాదు. క్రొత్తది గదా అని అంతయు చెడ్డదికాదు.) వీరికి శుష్కశబ్దముకంటె ప్రమాణమును, ఆచారముకంటె దేవుడును లేడు. విజ్ఞులెవ రైనను సంఘాభ్యుదయమును గోరి సంస్కార మొనరింప నుద్యమించినపుడెల్ల, యీ అభ్యుదయ నిరోధకులు, స్వార్థ బుద్ధితో సమయము రాలేదనియు,సంస్కారము శాస్త్రీయము కాదనియు, అడ్డువడుచునే యున్నారు. ఇట్టి వారెల్ల దేశము లందును సర్వ కాలములందున్నట్లు చరిత్రకారు లెరుదురు.

గౌతమబుద్ధుని అహింసా ధర్మప్రబోధమునకు స్మార్తులే ప్రబలముగ ప్రతిఘటించిరి. ఏసుక్రీస్తు సంస్కరణమునకు, యూదులడ్డుపడిరి. మహమ్మదు మతప్రబోధమును. అరేబియనులు నిరోధించిరి. రస్కిన్, సోక్రటీసు, టాలస్టాయి ప్రభృతి తత్వవేత్తల సంస్కార ప్రయత్నములకు నాటి ప్రాభవ శక్తులడ్డుపడినవి. రామానుజా చార్యులు వైష్ణవ మతమును ప్రవచించునపుడు శైవులు నిరోధించిరి. నిర్బంధ సతీ సహగమన మురాచారమును మాన్పఁబూనిన రాజారామమోహనులును వితంతు వివాహము లాచరింప బూనిన ఈశ్వరచంద్రవిద్యాసాగరులు వీరేశలింగం పంతులుగారులను హరిహనోద్ధరణకె బద్ధకంకణులైన కవిరాజు, అంబేద్కరు, గోరా గారను ఈ మూఢాచార దాసులవలన ఎన్ని బన్నముల నందలేదు? శారదా శాసన నిర్మాణావసరమున, పాలు విడువని కసికందుల నెందరినో పసుపు బంధములతో బంధించిన వీరి ఆచార దాస్యం విషోద్ధతికి అవధి ఎక్కడిది? పూర్వమే నౌకాయానము, విదేశ గమనము, నిషేధించి, ఖండాంతర సమాచారమావంతయు భారతీయులకు తెలిసికొను నవకాశ మరికట్టి వారిని తమవలె కూపస్థ మండూకముల నొనరించుట చేతనే గదా! నాడు లాతివిలాతి వాహినులు దేశమును జొచ్చి దీన్‌దీన్ అని తలుపు తట్టువరకు తెలియనేరక, మన పెద్దలు పరరాష్ట్ర భీతి విస్మరించి నిశ్చింతగ నిద్రించుట తటస్థించినది. అట్లు స్వరాజ్య స్వాతంత్ర్య భానుని చేజేతుల పరహస్తగత మొనర్చిన మందీభూత మనోదృక్కులకు, ప్రస్తుత సంఘ సంస్కరణావసరములు గోచరింపకుండుటలో విస్మయమం నందలేదు.

ఓరీ! నీ కొంపకు నిప్పంటు కొన్నది. నిద్రనుండి లే లెమ్మని ప్రబోధింపగా

"మంటలు నామేని కంటుకొన్నగాని నీ మాట నేను నమ్మను, అను సోమరి రాముని కథను మన మతనియంతల నిశ్చింతస్మరణ తలపింప జేయుచున్నది.

## నవభారత నిర్మాత

సంఘ సంస్కార మవసరమైనను, స్మృతిధర్మములను మార్చి పునర్నిర్మాణము చేయుటకు క్రాంతదర్శియగు మహనీయుడు కావలెనుగదా అని కొందరు వ్రాయుచున్నారు. అదిమాత్రము నిజమే.

"పరోప దేశ వేళాయాం జనాః సర్వేపి పండితాః
తదనుష్ఠాన వేళాయాం మునయో ప్యపండితాః॥

సమాజ చరిత్రలో పరుల కుపదేశింప లేనివారునుతా మనుష్ఠించి చెప్పువారును మిక్కిలి స్వల్ప సంఖ్యలో నుందు రనుటకు సందియము లేదు. పైసూక్తి భారతీయస్మృ సూత్రి కర్తలకుఁ గూడ అన్వయించునని యించుక పురాణ గ్రంథ పరిచయము గలవారికి తెలియనిది కాదు.

శాసనము లేవైనను, సమాజములో బలిసిపోయిన, పాతకములు పరపీడాకరములు, శాంతి భంగకరము లగు, క్రూర మతాచారములను, నాటి కఠినపద్ధతిలో సంస్కరించి సార్వజనీనాభివృద్ధికి మార్గములుగ నుండపలయును. మత సాంఘికార్థిక రాజకీయాదులలో దేనియందైనను, అభ్యు

దయకరమగు మార్పుగోనిరావలయు నన్నచో విజ్ఞుడు నిస్వార్థుడగు త్యాగిఅయిప సదాచార్యుని ప్రబోధమే కావలయును.

యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవే తరోజనః॥

(శ్రేష్ఠుడు ఎద్దాని నాచరించునో ఇతరుడు కూడ దానినే ఆచరించును.)

ఆవు చేనిలో మేయుచున్నచో, దూడ గట్టునమేయదు గదా! ఆశయ సిద్ధికై సర్వస్వము బలిచేయగల అఖంఢ త్యాగమూర్తియే నిద్రాణమైయున్న సమాజమును మేల్కొలిపి సమాజములో నభ్యుదయ శక్తిని పుట్టింపగలడు. సంఘ ధర్మములను సంస్కరింపగలడు. బెల్లమని చెప్పినంతనే నోరు తియ్యబడదు. మందుపేరు స్మరించినంతనే రోగము కుదురదు. త్రికరణాలలో మనోవాక్కులు క్రియతోఁగాని సార్థక మగుటలేదు కేవల క్రియాసూన్యమగు శుష్క తాంత్రిక వాఙ్మయము నాశ్రయించి నప్పటినుండియే పటిష్ఠమగు భారతజాతి ఆర్జవ దృష్టిని, క్రియాశక్తిని, కోల్పోయి సర్వదా నీరసించి, తుదకు పారతంత్ర్యము పాలయ్యెనని నిజ్ఞులెఱుంగనిది కాదు. అనుభూతి చాలని వైద్యునికి ఔషధ ప్రయోగార్హత లేనట్లే అనుష్ఠాన దూరుడైనవాడు సంఘ సంస్కర్త కానేరడు.

" కం॥ తన దేహము తన గేహము
తన మానము తన ధనంబు తన విద్య జగ
జ్జనములకై వినియోగిం
చిన నరుడే నరుడు.... ... ... .... ...."

తన సర్వస్వము లోకకల్యాణార్థమై, కర్పూరమువలె కరిగించి, విశ్వసంతర్పణ చేయువాడే కారణ జన్ముడు, అట్టి లోకోద్ధారకులగు, ఆదర్శమానవులు, చరిత్రవాహినిలో ధర్మ సేతువలగు కేతువులుగ వెలయుచున్నారు. గౌతమబుద్ధుడు, జీసస్, క్రిస్తు మహమ్మదు, సోక్రటీసు, గెలాలియో, అబ్రహాం లింకన్, రాజారామమోహనరాయ్, లెనిన్ ప్రభృతులు వారిలో ముఖ్యులు. గాంధీజీ ఇట్టి మహాపురుషులకోవకు జెందినవాడే,

గాంధీజీ అహింసా పరమ యోధుడగు యుగ పురుషుడు. భారతజాతికి నూత్న చైతన్యమిచ్చిన మహా పురుషుడు. సమాజమును సర్వథా సంస్కరింపఁగల మహర్షి సత్తముడు. అసాధ్యములగు ధర్మకంటకము లెన్నియో బాపూజీ వలన, అవలీలగ పరిష్కృతములగుట చూడగా అతడు నవభారత నిర్మాణమునకై పుట్టినట్లు ద్యోతకము కాకపోదు.

యదాయదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత?
అభ్యుత్థాన మధర్మ చర్మస్య తదాత్మా నం సృజామ్యహః
(భగవద్గీత)

(ధర్మమునకు గ్లాని కలిగినపుడు, అధర్మము పైకి వచ్చిన పుడును, నన్ను నేను సృజించు కొందును.)

ఈ గీతావాక్యమును విశ్వసించువారు సర్వదా అవతార పురుషులగు, వామన, పరశురామ, రామ, బలరాను ఇత్యాది మాయామానుష విగ్రహులకంటె, ననేక ఉదాత్త గుణములు గలిగిన గాంధీజీ కారణజన్ముడని విశ్వసింకపోరని మా ఆశయము,

సంఘసంస్కరణ శాస్త్రీయము కాదా ? సంఘ ధర్మములను సరిచేయుటకు సంస్కారము పూర్వ శాస్త్రానుసారము చేయుట లేదని మరికొందరి అభిప్రాయము. ఇది అవిచార మూలకమగు ప్రశ్న. ఏలయందురా కేవల న్యాయ సూత్రములనుబట్టి హేతువాదమునుబట్టి శాస్త్రీయ దృక్పథముబట్టి సంఘమును సంస్కరింపవలసి వచ్చినపుడు, వెనుకటి సంకుచిత శాస్త్ర విధులు తలక్రిందుగ మారక తప్పదు.

గౌతమ బుద్ధుడు స్మార్తమతమును, క్రీస్తు ప్రభువు యూదుమతమును, మహమ్మదు ప్రవక్త అరబిక్ మతమును సంస్కరించినపుడు, అంతకు ముందున్న శాస్త్రములలోని వర్ణనిర్బంధములు కులాగ్రగణ్యత జడారాధన, ప్రాయశ్చిత్త తాంత్రిక క్రియలు, సంపూర్ణముగ తుడిచిపెట్టిరి. అట్లొనర్ప కున్నవారి కృషి వ్యర్థము. అట్లే నేడును సంఘము సంస్కరింపబడు నపుడు. పూర్వ దురాచారములుకొన్ని తలక్రిందు కాక తప్పదు, సంస్కరణమున కంగీకరించి శాస్త్రమునకు భంగము రాకూడదనుటలోనర్థములేదు.సంస్కర్తయగువాడు మతతత్త్వములోని ప్రధాన సిద్ధాంతములకు భంగము కలుగకుండ చూచుటయందే బుద్ధిని నిలుపునుగాని పరస్పర విరుద్ధములు, అసంగతములు, అనర్థకములునగు శాస్త్రవిధులన్నియు సమన్వయ పరుపవలసిన బాధ్యత అతనికి లేదు. సంస్కర్త స్వర్ణకారునివంటివాడు. సొన్నారి పనికిరాని నగలను చిదుకగొట్టి మూసలో పెట్టి కరగించి అందలి దోషమును తొలగించి, నాటి కనుకూలమగు విధమున క్రొత్త రకపు టలంకారములను చేయుచుండును. అట్టియెడ మూల

పదార్థమగు బంగారము, స్వర్ణకారునిచే చెడకుండ చూడబడునేగాని తన ప్రాత నగల రూపములన్నియు నశించినవని ఎంత తెలివిలేని బాలికయైనను, వాపోదుగదా! పర ధర్మములు వక్రించినపుడు సంస్కర్తయు, మతమునకు జీవగఱ్ఱయగు నైతిక తత్వమును మనంబున నిడుకొని సంఘాభ్యుదయ కాంక్షతో ధర్మ స్వరూపమును నూత్న ఫక్కిని మార్చుచుండును. ఆ మార్పులు పూర్వ నిబంధనలకు విరుద్ధములని విలపించుట, దురహంకారుల కవసరమగునుగాని ఆత్మవత్ సర్వ భూతాని అని తలంచు యథార్థ సంఘ సంస్కర్తలకు అవసరము కాదు. వానికి ధర్మ ప్రతిష్ఠయే కావలయును గాని తమకుగల అధికార, సుఖ గౌరవములితరుల కెన్నడును కలుగగూడదని కలనైన తలంపబోడు. అట్టి నిరీహులు అఖండ త్యాగులగు బ్రాహ్మణులెందరో నేడు హరిజనోద్ధరణకు బద్ధకంకణులై సర్వశక్తులు ధారవోయుచుండుటచేతనే యీ ఉద్యమ మత్యంతము ఝరీవేగమున జయము గాంచుచున్న దనుట యథార్థము. ఈతత్త్వమెరిగినవారెవ్వరును శాస్త్రములలోని నూత్నాక్షరములకు వంపులు గలుగునని ఎన్నడు నాక్రోశింపరు. అనుష్ఠాన రంగమునుండి ఎన్నడో నిష్క్రమించిన ఆ స్మృతి సూత్రములు నేడు హరిజనుల నాదరించుటకు నడ్డుపడుచున్న వనుటకంటె హాస్యాస్పదమేమి కావలయును? సోదర జన్మహక్కుల నంగీకరింపవలసినపుడే మనకు ధర్మశాస్త్రములు కావలయుకాని మన యనుష్ఠానమున కవి ఎంత మాత్రము నడ్డురావుకదా!

నాయనలారా! ఇకనైన ఆత్మావలోకన మాచరించుకొని, మన భారతదేశమునకు కలిగిన కళంకమును బాపి,

సంఘము నుద్ధరించుటకై, బద్ధకంకణుడైన మహర్షి సత్యముని సత్య సిద్ధాంతములు శాస్త్రవిరుద్ధములని తలంచుట మహాప రాధమని హెచ్చరించుచున్నారము.

## నవసమాజ నిర్మాత

హేతువాది, మానవతావాది, మహారచయిత, రాజ్యాంగ రచనా శిల్పి, అపార విద్యా పారంగతుడు, అన్నిటికి మించి గొప్ప సంఘసంస్కర్తయు నగు డాక్టరు అంబేత్కరు జాతిని సంస్కరించి, నవ సమాజ నిర్మాణమునకు తోడ్పడి దేశమునకు అపారసేవ చేసినాడు. "నాలుగు పడగల హైంద నాగజాతి కసరి బుసగొట్టు నికృష్టదినములలో కడజాతివారిలో అంబేత్కరు ప్రభవించినాడు. అస్పృశ్యులుగ అత్యంత దుర్భర దురితోగ్ర దుస్తర పరిస్థితుల మధ్య పుట్టి పెరిగిన అంబేత్కరు తన చుట్టునున్న దౌర్భాగ్య పరిస్థితులను సింహావలోకనము చేసికొని యాందోళన చెంది, ఆవేదనపడి, ఆక్రోసించి సంఘసంస్కరణకుఁ బూనికొనినాడు.

నిద్రాణమై, నిస్తేజమై, చివికి, జీర్ణమైపోయిన, తన సమాజమును పరికించి దానిని సమూలముగ మార్చి, సరియైన చికిత్స జరుగవలెనని, భావించి, అంబేత్కరు బుధిజాడ్య జనితోన్మాద, కులతత్వ దురహంకార విధానములకు, స్వస్తి చెప్పవలయునని, నిర్ణయించుకొన్నాడు. చటుల దుస్తంత వైదధ్య సారమైన చాతుర్వర్ణ్యవ్యవస్థపై అస్పృశ్యతపై యుద్ధ ప్రకటన చేసి విజయదుందుభి మ్రోగించినాడు.

నాసిక్ జిల్లాలో నున్న కలారాం దేవాలయములో హరిజన ప్రవేశోద్యమమును దిగ్విజయముగ నిర్వహించి పేరు ప్రఖ్యాతులు గాంచినాడు.

మ్రొక్కబడులు పూజా పునస్కారములకంటె హరిజనులు హక్కును ధ్రువపరచుకొనడమే యీ ఉద్యమము యొక్క ముఖ్యోద్దేశ్యమని ఆయన ఈ సందర్భములో చెప్పిన గంభీరవాక్కులు గమనార్హములు.

పీల్చుకొనబడు గాలి, త్రాగబడిన నీరు, తినబడు తిండి, అందఱకు సమానము. ఈ న్యాయ సమ్మతమైన యీ సూక్తులను నిమ్న జాతులకు బోధించి, మహడ్ చెరువు వద్ద బ్రహ్మాండమైన పోరాటము జరిపి మానవ హక్కుల పరిరక్షకుడని అంబేత్కరు పేరు గాంచెను, ఈ విధముగ అంబేత్కరు సంఘ సంస్కర్తగ నిమ్నజాత్యుద్ధారకుడుగ విశ్వవిఖ్యాతిఁ గాంచెను.

## భావ విప్లవ విధాత

సంఘసంస్కరణకు ముఖ్యముగ కావలసినవి హేతువాదము, శాస్త్రీయ దృక్పథము, నైతికశక్తి ముఖ్యమైనవి, హేతువాద విరుద్ధమ్మురైన పురాణములు, ప్రాచీన గ్రంథములు, సనాతన ధర్మములను భేదించిననేగాని సంఘసంస్కరణ జరుగదు. అందుకు కవిరాజు పూనుకొనినాడు. తన చుట్టు ఉన్న చాతుర్వర్ణ్యవస్థతో నిండి నిబిడీకృతమైన, సమాజమునుపరిశీగలించి భావవిప్లమును లేకెత్తించినాడు. అభ్యునిరోధక భావముల, మూఢవిశ్వాసములను, దుష్టమతాచార

ములను ఖండించి, భావ వికాసము చేకూర్చి నవసమాజ నిర్మాణమునకు తోడ్పడినాడు. నిద్రాణమై నిస్తేజమై నిర్వీర్యమైయున్న భారత ప్రజల హృదయ తంత్రులను మీటి, మేల్కొలిపి, భావ విప్లవమును, చేకూర్చినాడు. తన మృదుమధుర కవితా నైపుణ్యముచే ప్రజల నోలలాడజేసి అంధవిశ్వాసములపై, కరుడుగట్టిన మూర్ఖతపై, పోరాటము సాగించిన మహనీయుడు. వరకట్నములు, కన్యాశుల్కములు, అస్పృశ్యత, పాశవిక ధర్మసూత్రములతో నిండి నిబిడీకృతమైన నేటి సంఘమును ఎదుర్కొని పోరాడినాడు.

ప్రాచీన గ్రంథములలో హేతువిరుద్ధమైన విషయములు నిషిద్ధములేయని జగమునకు చాటి చెప్పినాడు.

అట్టి ప్రాచీన గ్రంథములను ఎంత గొప్పవి యైనను దుయ్యబట్టినాడు. పురాణేతిహాస గోపుర ద్వార కవాటపంక్తులను బ్రద్దలుగొట్టి భావ విప్లవ పతాకను హేతువాద కుంభాగ్రముపై నెగురవేసినాడు. దీనితో వైదిక వాఙ్మయ ప్రభుత్వ పతాక కూలిపోయినది. కుల వ్యవస్థకు మూలకారణమైన పద్మవ్యూహము భేదింపబడినది. అఖిలలోక కల్యాణము సాధింప కులభేదములను మంటగలుపవలెనని జలద గంభీర స్వరముతోఁ జెప్పినాడు.

దీనితో సంఘసంస్కర్తలకు మార్గము సుగమమైనది ఇదీ కవిరాజు చేసిన ఘనమైన సంఘ సంస్కరణ.

## చేయూత

హరిజనులు మూఢులు, నీచాచారులు నగుట, స్పృశ్యులు కారని, కొందఱు శంకించుచున్నారు. వారట్లగుటకును మూల

కారణము సవర్ణులే. పశుప్రాయులగు బిడ్డలకు తలిదండ్రులు చిత్ర భంగిని విద్యాబుద్ధులు చెప్పి సుజ్ఞానులఁ జేయుటలేదా? బిడ్డడు తెలివిమాలినవాడని, పోషకులు దూరముగ పారద్రోలిన నాతడెన్నటికిని విజ్ఞాని కాగలడా? బిడ్డల దేహ మనోమాలిన్యములను, శుద్ధి చేయుట తలిదండ్రుల విధి కాదా! పుట్టుక తోడనే బుద్ధిమంతులైనవారు ప్రపంచ చరిత్రమున కలరా? అనుభవజ్ఞాన మలవడుట. కనుకూల పరిస్థితులేర్పరచుటచేతనే మానవునందలి విజ్ఞాన జ్యోతి, వికాసము కాంచునని, జీవ శాస్త్రము వ్యక్తము చేయుచున్నది. శీత వాతసన్నివేశము లేనిదే, బీజములోని జీవాణువంకురింప నేరదు. అగ్నిస్పర్శచే బీజములోని, చైతన్యము నశించి పోవును. వేచిఁన గింజ మొలకెత్తక పోవుటకిదియే కారణము. పండిత పుత్రునొకని పుట్టగానే ఒక కిరాతునింట విడచిన, నతడు విద్వాంసుడు కాగలడా? వెట్టివాడైన విద్వాంసుడు కాగలడని తలంచునా? టపాకాయలోని గంధక క్షారమునందలి ప్రాణవాయువు వికాస విజృంభణమునకు, అగ్నిస్పర్శ అవసరమైనట్లు వ్యక్తి యందలి విజ్ఞాన బీజవికాసమునకు, ననుకూలపరిస్థితుల తోడ్పాటవసరమై యున్నది. హరిజనుల గృహ వస్త్రీ దేహ మనోమాలిన్యములకు, వారికి మనము కల్పించిన, నిర్బంధములే ముఖ్య హేతువని పైన వివరించితిమి. వారిని మనము పైకి తీయుటకు చేయూత నిచ్చి తోడుపడకపోవుటయే కాక వారు మనలను చూచి నేర్చుకొనుటకైన నవకాశమీయక దూరముగ తోలి చైనానారి పాదములవలె నియమ పేటికలందు నిర్బంధించితిమి. ప్రచండ శాసన ప్రాబల్యముచే భారతీయు లందఱు బంధితులైనట్లు భావించుచుంటిమి గదా! విచా

రింపగా నంతకంటె శతగుణాధికముగ హరిజనులు మనచే సాంఘిక వాతావరణములో నిర్బంధింపబడి యున్నారని చెప్పుట అతిశయోక్తి కాదు.

కావున నేటికైన అత్యంత నిమ్నస్థానమున నున్న మన హరిజన సోదరుల నుద్ధరించుటకై సవర్ణహిందువులు చేయూత నొసగుట ధర్మమై యున్నది. మనతోపాటు, గుడులు, బడులు సత్రములు, సభలు, సమావేశములు మొదలగు సాంఘిక సాంస్కృతిక ఆర్థిక సంస్థలలో గౌరవస్థాన మొసగినవారినిసంఘా యవముగ పరిగణించి ఆదరించినచో, సర్వవిధముల, అభ్యు దయము గాంచి, సవర్ణులకెందును తీసిపోని సభ్యత గడించు టయేగాక మనకు చేదోడు వాదోడుగ మెలంగుదురనుటకు సంశయము లేదు. అట్లొనర్చుట పూర్వము మనము చేసిన ద్రోహమునకై చేయు ప్రాయశ్చిత్తమే యగునుకాని, ఔదా ర్యమని తలంపరాదు. తత్కార్య నిర్వహణముతో మనము స్వధర్మము నిష్కళంక మొనర్చుకొను వారము భిన్నమైన జాతీయతా రజ్జువునుపెనవెట్టి గతించిన సాంస్కృతికసంపదను, సంతరింప ప్రయత్నించిన వారము నగుచున్నారము. కావున మనము, మనసిచ్చి మన హరిజన సోదరులను, హృదయ పూర్వకముగ నాహ్వానించి కైదండ గొనివచ్చి, చిరకాలము నకు దూరాగతుడగు సోదర పరిష్వంగము వలన వెడలు నానందబాష్ప వారిచే, వారి యనాదృత దుఃఖాగ్నిని చల్లా ర్చుట మన విధియై యున్నది.

## సామ్య స్వాతంత్ర్యము

సంఘ సంస్కరణాభిలాషులగు రాజకీయ నాకుల తల నుండియే యీ ఆందోళన జనించినదిగాని, హరిజనుల నింత కాలము వరకును తృప్తిపరచుచున్న యాచారము లికముందు కూడ నేల యనుష్ఠేయములు కాజాలవని కొందఱడుగుచున్నారు.

జీవులన్నిటికిని సుఖవాంఛ స్వభావము. నిజమగు సుఖము స్వాతంత్ర్యమందే కలదు.

"సర్వం పరవశం దుఃఖం, సర్వమాత్మవశం సుఖం"

అను సూక్తి దీనిని బలపరచుచున్నది. ప్రకృతిసిద్ధమగు స్వాతంత్ర్యేచ్ఛ ప్రతిజీవియందును గోచరించును. చీకటిలోని చెట్టు, పంజరములోని చిలుక, బంధింపబడిన పశువు, బానిసయగు మానిసి, భోగ్యవస్తువు లెన్ని యున్నను, స్వేచ్ఛా సుఖములనే కోరుచుండును. జీవియందలి స్వాతంత్ర తేజము బీజమునందలి వృక్షమువలె ప్రచ్ఛన్నమై మూఢావస్థలో నున్నపుడు గతిలేక దాస్యము నంగీకరించును. అజ్ఞాన యవనిక తొలగినచో దాస్య శృంఖలము త్రెంచుకొనుచు విడివడ ప్రయత్నించును. దానినడప జూచుట నగారాను జోకొట్టుట వలె నభివృద్ధి కారకమేయగును. సెలయేటి ప్రవాహము నిరోధించిన కొలది కరలుబ్బపొంగి భయంకర రూపముదాల్చి గమ్యస్థానము జేరకమానదు. వ్యక్తులందలి పశుగుణమగు స్వార్థ బుద్ధిచే, సర్వమానవసామాన్య ధర్మము నణికట్టుటలో స్వాతంత్ర్యభావము నిరోధింపబడును. అట్టి నిరోధమే ప్రపం

చమున సర్వ విప్లవములకు మూలకారణ మగుచున్నది. విజ్ఞులగు సంస్కర్త లీధర్మసూక్ష్మము నెఱింగియే సర్వ సమత్వ సౌభాత్రములను ధర్మరాజములనుగ, నుద్ఘాటించుచున్నారు. సోదరుని స్వామ్య స్వాతంత్ర్యమున కంగీకరించుట మానవుని కనిష సామాన్యధర్మమని వారు సాటిరి.

కాని నేటి మన మతమునందది యజాగళస్తనమువలె నాచరణలేక నిష్ప్రయోజక మైనదని వ్రాయవలసి వచ్చినందుకీ భారతీయవ్యక్తి మనస్సెంత సంకటపడి యుండెనో యూహింప గోరుచున్నాము.

సీ॥ సర్వసమత్వంబు చాటుటచే గదా
బౌద్ధ ధర్మము జగద్వ్యాప్తమయ్యె
సర్వసమత్వంబు చాటుటచే గదా
క్రైస్తవమత మెల్ల కడలనిండె
సర్వసమత్వంబు చాటుటచే గదా
యిస్లాము మత మెల్లయెడల వెలసె
సర్వసమత్వంబు చాటమిచే గదా
హిందూమతంబు నశించుచుండె

గీ॥ ధర్మమణియైన హిందూమతంబునందు
సర్వమంగళమయ్యె నే సర్వసమత
లేదు లేదిక లేకపోలేదు గాని
యాచరణలేక యుండిలేనట్టిదయ్యె.

పరులయధోగతియే తమఔన్నత్యమునకు మూలమగునను సంకుచిత భావముతో సోదరుల సామ్య గౌరవముల నం

గీకరింపక యహంకరించువాడు, వృద్ధుడైనను, పసితనమును వీడలేదనియే చెప్పవలయును. హరిజనుల నింతవరకును తృప్తి పరచుచున్న నియమములు, నేడు మార్పుజూచు చేలయును కెంతయు నవిచారంమూలకము.

మూఢుడగు సోదరుడు స్వధర్మమును మరచి నిద్రించు చున్నపుడు జ్ఞానియగు నగ్రజుడాతని నుద్బోధించి జన్మ స్వత్వములను తెలియఁజేయుట విధియై యున్నది. ఇంటి పెత్త నము చేజిక్కినదని యహంకరించి, సోదరుల జన్మస్వత్వముల హరించెడు నగ్రజుడు నిద్రించువాని సొత్తును హరించిన నేరమునకు గురి యగుచున్నాడు. కప్పలు వేసవితాపమును సహించక, యురుము వినినంతనే యులసిల్లునట్లు స్వమత నియంతల పాదాఘాతముల క్రింద నలిగిపోవుచున్న హరిజ నులు మతాంతరల నియంతల స్వాగత గీతికలు వినబడనంత కాలము కష్టము సహించి యుండిరి.

మతాంతరుల యాహ్వానమందినంతనే మతము మార్చుకొన సాగిరి. దానంజేసి హిందూ మతము క్షీణింప సాగెను. అందువలన దేశమునకుఁ గలుగు భయంకర పరి ణామము బాధ్యతతో ప్రపంచ పరిస్థితులు పరికించుచుండు దేశభక్తులగు రాజకీయ నాయకులకే గాని తమ పుస్తక శుష్కాటవులందు మాత్రము సంచరించు పండితంమనుష్యుల కెట్లు గోచరించును?

కొంద అంగీకరింపనంతమాత్రమున మానవుని జన్మ స్వత్వము లికముందు నిరుద్ధములు కావు. దాస్యాంధకారము విద్యా ప్రకాశముచే వీడిపోవక తప్పదు. విద్యాధికారములో

కొన్ని సంఘముల కొఱకే జన్నెగట్టు కాలము కడఁబట్టినది. సర్వ జనులకును సమానముగ విద్యావకాశ మేర్పడెను. అవిద్య నశించుటచే ప్రపంచమున గల ప్రతి సంఘము మేల్కొని స్వాతంత్ర్య సిద్ధికై సర్వ విధముల పాటుబడు చుండెను. చిరకాలమునుండియు నుచ్చసంఘములచే నడఁ ద్రొక్కబడిన సంఘములిపుడు, స్వాతంత్ర్య సుఖమనుభవించుట కన్నులార గాంచుచున్నారము. అబిసీనియనుల బానిసత్వ మడుగంటెను. నీగ్రోల దాస్యము పటాపంచ లయ్యెను. రష్యనులు జారుచక్రవర్తుల ప్రాభవ నైరంకుశముల నుండి విముక్తులై సర్వసమత్వ స్వాతంత్ర్య మనుభవించుచున్నారు. జపానీయులు భిన్న భావదోషము తుడిచివైచి యభ్యుదయము గాంచిరి. తురుష్కులు తమ దురాచారములను దూరీకరించి నూత్న తేజమునందుచున్నారు. కాని చిరకాలమునుండియు నధోగతింబడి నేటికి నుద్ధరింపబడని దొక్క యాదిమహిందూ సంఘమే యని వ్రాయవలసివచ్చినందుకు విచారించుచున్నారము. మన మిట్లెన్ని విధముల వారి నణచి వేయుచున్నను కొలది కాలమునుండియు వారుద్బుద్ధులై మతాంతరుల సాయమున సర్వవిషయములందు నభ్యుదయము గాంచుచుండిరి.

ప్రపంచమును పరమాద్భుతగతిఁ బరిణమింప జేయు ప్రబోధ గీతిక లోకవంకను, మన మొనరించు నిర్బంధ హింస లోకవంకను ఒత్తిడి చేయుచుండగా హరిజనులు మాత్రమేల మేల్కొనక యుందురు? వారును మనవలె మానవులేగాని జడులు కారుగదా! హరిజచులను కోసిన రక్తమురాదా?

శ్లో॥ జ్వలతి చలితేంధనోఽగ్నిః
పాదాహతః పన్నగః ఫణాం కురుతే
ప్రాయస్స్వం మహిమానం
క్షోభాత్ ప్రతిపద్యతే హి సర్వః

(కట్టెలు కదలించిన నిప్పు మండును. తోక త్రొక్కబడిన భుజంగము పడగ విప్పును. అట్టే సామాన్యముగ మానవుడు క్షోభ పడినపుడు నిజప్రభావమును వెలువరించును.) అను మహాకవి కాళిదాసు సూక్తి యథార్థమగు తత్త్వమునే ప్రస్ఫుట మొనర్చుచున్నది. పటాసు కాయనెంత బలముగ విసరుగొట్టుదుమో, యంతధ్వనితో బ్రద్దలుకాక మానదు. కడలు నిండిన తటాకమువలె నిర్బంధమగు సంఘముకూడ, నియమనిబంధముల ద్రెంచుకొని ఒక్కుమ్మడి విడివడక మానదు. రష్యా, అమెరికా, స్పెయిన్, ఫ్రాన్సు విప్లవములే యిందుకు తార్కాణము. అంతవరకు రాకుండగనే మనము భ్రాతృద్రోహము చేసినందులకు పశ్చాత్తప్తులము కావలయును. హరిజనుల మనోగోళము నావరించిన మసితుడిచి హృదయాంతరాళముల నిద్రించుచున్న స్వాతంత్ర్యాగ్నిని రగిల్చి దివ్యజ్యోతిగ వెలయింప జేయుటయే మన ప్రస్తుత కర్తవ్యము. ఈ అస్పృశ్యత మన భారతదేశమునకు రాచపుండు వంటిది గాన, దీనికి సరియైన శస్త్రచికిత్స చేసి దానిని సమూలముగ, నున్మూలించినగాని జాతీయాంగము పుష్టిం గాంచనేరదు. మానవంతులగు భారతీయులలో నస్పృశ్యమగు సంఘమొకటి తమలో లేదనిపించుకొనుటకంటె హర్షమేముండును?

## సనాతన ప్రతిఘటన

మన సోదరులగు సనాతన ధర్మావలంబులు కొందఱు హరిజనుల స్పృశ్యతా స్పృశ్యతలు పూర్వ గ్రంథములను బట్టి చర్చించి నిర్ణయింపఁజూచుచున్నారు. కాని వారిస్వత్వము శాస్త్రార్థముల తోడను, నాచార విచారము తోడను, నిర్ణయింప దగినది కాదని మాదృఢవిశ్వాసము. జన్మహక్కు పైనుండి యూడిపడినది కాదు. ఒకరిచ్చినదియు కాదు. వారు సహజముగను శాశ్వతముగ నస్పృశ్యులనగ వారి మానవతనే సంశయించినట్లు స్పష్టమగుచున్నది. మనము వారిని మానవతావాద పద్ధతిలో మానవులనుగ నంగీకరించుటతోడనే సహజమగు వారి స్పృశ్యతాధికారము సిద్ధాంతమగుచున్నది. మానవు లందఱకును సహజ సిద్ధమగు నాహక్కు కొఱకై బూజుపట్టిన తాళపత్ర గ్రంథ గోళములు వెదుక బూనుటకంటె మూర్ఖ్యము వేఱుండబోదు. ప్రత్యక్ష విషయ నిర్ణయములకు శబ్ద ప్రమాణములను తడవపని లేదు. సర్వ జనానుభవ సిద్ధమగు బెల్లము పుల్లనిదని, యొక పండితుడు తన తార్కిక ప్రజ్ఞచే నిర్ధరించినంతమాత్రమున అది పుల్లనిది యగునా?

అట్లే హరిజనుల యర్హత ప్రత్యక్ష సిద్ధమేగాని వాద శక్తిపైనను శబ్ద ప్రమాణముల పైనను, ఆధారపడియుండు ననుట భ్రాంతిమూలకమని మా ఆశయము. ఇచ్చట హరిజనులను స్పృశించుట ధర్మశాస్త్ర విరుద్ధమని వాదించు సనాతనులనుగూర్చి విస్తరభీతి కొర్చియైనను, కొన్నిమాటలు చెప్పవలసి యున్నది. ఈ సనాతన ధర్మావలంబు లనుకొను వారు యథార్థముగ సనాతన ధర్ములు కారు.

ఏలయన అతిప్రాచీన కాలమునుండియు సాంఘికులచే నవిచ్ఛిన్నముగ ననుష్ఠింపఁబడుచున్న ధర్మమునకు సనాతన ధర్మమనియు చరిత్రకందినంతవరకు ద్రావిడుల కాలమే సంఘ నిర్మాణమునకు ప్రారంభ మనియు ప్రాచీన ధర్మము నందు మీరు చదివి యుంటిరి. ద్రవిడ ధర్మమునకు పరమ ప్రమాణమగు నహింసా ధర్మమే సర్వసమానత్వ ధర్మమే నాటి సాంఘిక ధర్మములకు మూల ధర్మములై యున్నవి. అందలి ధర్మములను నేటి యాచారములతోఁ బోల్చిచూచిన వారికి, ప్రాచీన మహోదార ధర్మములెంత విపరీతముగ మార్పునొందినవో ద్యోతకముకాక పోదు. సూత్ర యుగారంభమునుండియు మార్పు నొందుచు, నందు కొన్ని నేటి కత్యంతము నిరర్థకములుగ, దురాచారములుగ పరిణమించెను. నేఁడు సనాతనమను చెప్పబడు విధులలో పెక్కులిటే వల కల్పింపబడినవే కాని ప్రాచీనధర్మములు కావని ఋజువు చేసితిమి. ప్రాచీన ధర్మములకు పరమ ప్రమాణమగు ద్రావిడ యుగమున, వ్యక్తిస్వాతంత్ర్యమును సంఘైక్యమును భంగించు నసాంఘిక నిబంధనలు నిర్మింపబడలేదు. ద్రావిడు లానాడు సంఘమంతయు నైకమత్యముతో సమముగ నభివృద్ధికి రాదగిన ధర్మములే ప్రబోధించియుండిరి.

జాతీయతను భిన్నపగచు వర్ణభేదములు అనికావు. ఆయుగమున స్త్రీలు పురుషులతోపాటు సర్వాపిద్యాస్వాతంత్ర్యములు కలిగి మతచర్చల యందును, కర్మలయందును పాల్గొనుచుండెడివారు. నాడు ప్రౌఢవివాహములు స్వయంవరములే కాని నిర్బంధ బాల్యవివాహములు లేవు. దేవాలయ జడవిగ్రహ పూజలు కాని, శ్రాద్ధ ప్రాయశ్చిత్త కాండములుగాని లేవు.

ఈ వర్ణ విభేదములు, విగ్రహారాధనలు, శ్రాద్ధ ప్రాయశ్చిత్త కాండములును, ఆర్యుల తదనంతరమే మన దేశమునకువచ్చినవి. ఆర్యఋషులు కొంతకాలమునకువర్ణ విభజనచేసిరి. ఆమార్పులే స్మృతుల రూపమున వెలసెను. వైదిక ధర్మములను స్మరించునవియే స్మృతులని వానికి విపుల వ్యాఖ్యానముల వంటివే పురాణములనియు నమాయకులగు ప్రజలను సనాతనవాదులు నేటికి నమ్మింప జూచుచున్నారు. ఈ ధర్మ శాస్త్ర విధులలో పెక్కులు సంఘములోని ఏక దేశసౌకర్యమును గోరి రచింపబడినవనుట స్పష్టము. వానిలో నెక్కువగ వ్యక్తులయు సంఘములయు సహజ స్వత్వముల నడచివైచు నిర్బంధ విధులే కాన్పించుచుండును. అట్టి వానిని ప్రమాణముగ గైకొన్నచో క్రిందివర్ణములవారికి బ్రతుకేలేదనవచ్చును. వానినిర్ణయమును బట్టి హిందూ సంఘములోని చాతుర్వర్ణ్యముగా స్వర్ణకార రథకార, చిత్రకార, శిల్పకారాది వివిధ వృత్తులవారును సంకరజాతులే కావలసివచ్చును. పూర్వమట్టివారే యావృత్తి నాచరించుచుండు వారనుట శుద్ధాబద్ధము. సూత్ర యుగమున సాంఘిక దౌర్జన్యము మెండై వీరి నిట్టి సంకరజాతులనుగ నభివర్ణించి యుండిరి. ఆ సంకీర్ణులలో చండాలు రనువారొకరు. స్మృతులలోని యీ నిర్వచనములను గాంచిన నింగితజ్ఞుడగు భారతీయు డెవ్వడును నేడు విశ్వసింపఁ జాలడు. ఆచార రూపమైనదిగాని, అనాచారరూప మైనదిగాని, పురోహితులు జెప్పినదిగాని, విమర్శింపకయే అంతయు యథార్థమను మూఢ విశ్వాసముతో వర్తించుచుండుటచేతనే మన సంఘము సాంఘిక విషయములందు సాటి సంఘములలో నవ్వులపాలు కావలసి వచ్చెనని తత్జ్ఞులెరుంగనిది కాదు. మానవులు స్వబుద్ధి

నుపయోగింపక నికృష్టమగు శబ్ద ప్రమాణమునకు దాసుడై
యంత్రకల్పుడగుటచేతనే, ప్రత్యక్షమగు మానవుని మర్త్య
తను గూర్చి, నేడు తాటియాకుల కట్టలు తడవవలసిన గతి
పట్టినది. అవిచ్ఛిన్నమగు మానవ విజ్ఞాన వాహినికి శాస్త్ర
ములు మెలురాళ్లవంటివి. అవి జ్ఞానవాహిని నడ్డుబరుపజాలవు.
ప్రజాక్షేమముకొఱకై జీవిత సర్వము ధారవోసెడి సంఘ సం
స్కర్తల యడుగుజాడలే సమకాలికులకు పరమ ప్రమాణ
ధర్మములు. అట్టివారి యనుభవముల అనంతరకాల పరిస్థితుల
ననుసరించి సాంఘికాభివృద్ధి కనుకూలించినంతవరకు జనసా
మాన్య మంగీకరించి యనుసరించునంతవరకు, నవియే భావి
కాలమునకు, నాచార ధర్మము లగునని మా ఆశయము.
ప్రస్తుత సంఘము నంటియున్న యస్పృశ్యతాది దురాచార
భూతములన్నియు నీ స్మార్త యుగోదితములే కాని, ప్రాచీన
ధర్మములు కావని పైన ఋజువు చేసితిమి. అనగ ప్రాచీనము
లన్నియు మంచివనిగాని, నవీనములన్నియు చెడ్డవని చెప్పుట
మా మతము కాదు. సనాతనము గానిమ్ము. కాకపోనిమ్ము.
శ్రేయస్కర ధర్మమెద్దియైన నాచరింప వలెననియే మా
ఆశయము. ప్రజా సామాన్యములో ప్రాయికముగ ప్రాత
వానియందు నాదరము మెండు. ఆ అవకాశము నూతగ
గొని ప్రతి పక్షులు నిజముగ సనాతనముగాని, దురాచార
ములు గూడ సనాతన ధర్మములే యని లోకమును వంచించు
చుండిరని హెచ్చరించుటయే మా అభిప్రాయము. లోక
కల్యాణము కోరి చేయు నెట్టి సంఘ పరిణామములకైన నీ సనా
తనులడ్డుపడు చుందురు. ప్రజల మౌఢ్యము నండజేసికొని
యెప్పటికప్పుడు సంస్కారుల నెదిరించుటయే యీ యాచార

దాసుల ఆశయము. వీరు ప్రమాణములని చెప్పుచుండు శాస్త్రములు వీరి యనుష్ఠాన రంగమునుండి యెన్నడో నిష్క్రమించినవని పాఠకలోక మెఱుంగనిది కాదు. తమకు పనికిరాని యీ శాస్త్రములను నోరులేని, ఏ అజ్ఞానుల మీదనో యగతికులగు నీ హరిజనులమీదనో ప్రయోగింప జూచుట యెంతయు హేయమైనది. మూల మతగ్రంథము లితరులు చదవరాదనియు, దేశ భాషలలో ననువదింపరాదనియు, వీరు నియమించుటచే సనాతన ధర్మమేదో, అధునాతన ధర్మమేదో శాస్త్రవిధులు ప్రస్తుత మెంతవరకమలులో నున్నవో తమ కర్తవ్యమెద్దియో పూర్ణముగ గ్రహించు నవకాశము ప్రజలకు గగనారవిందమయ్యెను. స్వాతంత్ర్యాలోచన పటిమ, సనుసిపోవుటచే విన్నన్న చెప్పినదే వేదమని కిమ్మనక సమ్ముగతి సంప్రాప్తించినది. కాని యిటీవల కొంతకాలము నుండియు మతగ్రంథములు కొన్ని దేశ భాషలలో పరివర్తితము లగుటచే జనసామాన్యమునకు సుగమ్యము లైనవి. పదభ్రష్టులైన అధికారులవలె నేటి సనాతన ధర్మములు నేతిబీరకాయలవంటివనియు తమధర్మశాస్త్రములు తామే యుల్లంఘించుచు నితరులనుష్ఠింపవలె ననుటలో నర్థము లేదు. లోకవంచనార్థమని ప్రజలు గ్రహించిరి. సంస్కారమున కడ్డుజెప్పు సమాజ, పురోభివృద్ధి నిరోధకులకు సవినయముగ నీ విధముగ ప్రశ్నింపగోనుచున్నారము.

(1) మతమనునది మరణానంతర మాముష్మిక సుఖ మొసగుటకు మాత్రమే పనికివచ్చునా?

ఐహిక జీవనమును పరిశుద్ధమొనర్చి మనశ్శక్తిని పెంపొందించి వ్యక్తుల నభివృద్ధి సౌధమునకు నడిపించుటకుకూడ పనికివచ్చునా?

(2) మతావలంబు లందఱకు సమదృష్టితో అభ్యుదయ మార్గము చూపించుటయే మత పరమార్థమా? లేక కొన్ని సంఘముల సుఖగౌరవ మోక్షములకొఱకే అది నిర్మింపబడినదా?

(3) అస్పృశ్యత, అతి బాల్య వివాహములు వీనికి విధులును స్త్రీవిద్యా స్వాతంత్ర్యము, ప్రౌఢ వివాహములు, నౌకాయానము, వర్ణాంతర వివాహము వీనికి నిషేధము చేసినవారెవరు?

దీనికి బాధ్యులెవరు? హిందూమత నియుంతలుకారే!

(4) సాంఘికాచారములు యుగ యుగము లందును మార్పుః జెందుచుండునని సభ్యదేశములన్ని ఘోషించుచుండ నేటి యస్పృశ్యతా ద్యాచారములు సృష్టితోడఁ బుట్టినవనియు, మధ్య మార్పరాని శిలాప్రాయము లనుటయు లోకవంచన ప్రయత్నము కాదా?

(5) ద్విజాతులకు కర్మలందు పశుహింస, మాంసభుక్తి, వర్ణాంతర వివాహము, వియోగము, నౌకాయానము, నరమేధము, శూద్రపాకము, స్మృతిసిద్ధములై యుండగా, నేడేల నిషిద్ధమై యుండెను?

(6) కలిశాసనుడగు పరాశరునిచే నిషేధింపబడినవి కాక మిగిలిన యంశములందితర స్మృతులు శ్రుతులును ప్రమాణముగ నంగీకరింతురా?

(7) కలినిషేధ విధిని ధిక్కరించిన వారికి ప్రత్యేకముగ నపవాద శాస్త్రిమేదియేని సృజంపబడినదా? అందుకధికార మేది?

(8) మన స్మృతి శ్రుతుల యధికార నైరంకుశ్యము నమాయకులు, నగతికులు, నతిదీనులు నగు హరిజనుల మీదను, అనాథల మీదను మాత్రమేనా రుద్దుట? హైందవ సమాజ మంతటిమీదను నేడములులో నుండెనా?

(9) పుట్టుకతోడనే మానవులలో హెచ్చులొచ్చులను కల్పించు నర్థరహితమగు నీనిర్బంధ వర్ణవ్యవస్థవలన మతము నకు ప్రాణకోశమనదగు సర్వ సమత్వ ధర్మము నిర్మూలనమై దినక్రమమున మతము క్షీణించుచున్నదని మీరెన్నడైనను విచారించితిరా?

విచారించినచో మతపునరుద్ధరణకు నేమి సంస్కారము గావింప నెంచితిరి?

(10) బౌద్ధక్రైస్తవాది మహామతములు మూల మత గ్రంథములలోని తత్త్వరహస్యములు ప్రజలందఱకు సుబోధక మగునట్లు దేశ భాషలలోనికి ననువదించి ప్రచారముచేసి యభివృద్ధి గాంచుచుండుట కన్నులార గాంచుచుండియు వేదముల నితరులు చదువరాదని దేశభాషలలోని కనువదింపక రహస్యముగ నింక నేల దాచిపెట్టి యుంచెదరు? అంతమాత్రమున నవి వెలువడక మానునా?

(11) ఎల్లరును మతధర్మములు గ్రహించిన మతమున కేమేని యనర్థము కలుగునా?

మత రహస్యముల నెల్లరెఱింగిన మతనియంతల యధి కారగౌరవములకు భంగము వాటిల్లునని భయముగల్గెనా ?

(12) ఎల్లరకు తెలియని ధర్మశాసనమును తిరస్కరించి రని శిక్షించుట న్యాయమగునా ? బోధాయన సూత్రము లోని (1_5_10 సూ. 24, (1-11-21 సూ.23) (11_1_2_సూ. 2_10) (11-1_2 సూ. 13_14) సూత్రములకు కలి నిషేధ మేమేని కలదా ? లేదేని గణకులు, గాయకులు, వర్తకులు, సేవకులు, వడ్డీవ్యాపారులు, కన్యా వర విక్రేతలు, కూట సాక్షులు, శూద్రసేవకులు, నట వట వైద్య వృత్తులు నగు నుచ్ఛజాతుల నస్పృశులఁ జేసి వెలివేయవలెను గదా !

(13) ఆపస్తంబ సూత్రములోని (1_1_2_సూ,22_31) (1_2_7 సూ. 4_5_6) (1_5_7) సూ. 14_16) (1_6_18సూ. 32_33) (1_7_21 సూ. 8) ఈ సూత్రములనుబట్టి ఉప్పు, కారము, వేడినీళ్లు, అభ్యంజనము, పాదరక్షలు, గొడుగు, బండ్లు, క్రయాన్నము, ఉపయోగించు విద్యార్థులకు ప్రాయ శ్చిత్తము నుపయోగింప వలయును. ఇది ఇప్పటి కాలము నసాధ్యమా? అగ్నిహోత్రము, వేదాధ్యయనము లేని విప్రు నింట భుజించువారు పతితులు ధర్మబాహ్యులు నగుదురు.

(14) గౌతమ ధర్మసూత్రములలో కలి నిషేధదోషము సోకని (అధ్యా. 4_27_28) (అధ్యా. 3_5) (అధ్యా. 5_4_6) (అ. 7_సూ. 1_15) (అధ్యా. 7_ సూ.25_సూ. 26) (అ.15_ సూ. 18) (అ. 17_సూ. 17) శాసనముల ననుసరించి పైజాతి

స్త్రీలకు జనించిన వారిని చండాలాదులుగను భావించియూరి వెలుపలకు తరిమివేయ వలయును. మేనమామ మేనయత్త కూతుండ్రను వివాహమైనవారిని, వేదమెరుగని ద్విజులను, రంగువస్త్రములు, ఔషధములు, బియ్యము, ఆవులు, గడ్డి, కట్టెలు భూములు, విక్రయించు బ్రాహ్మణులకు, జంత్రగాత్రములమీద పాటపాడువారిని, పోలీసు ఆఫీసరు, కారాగృహాధికారి శస్త్రివైద్యులు వీరి యిండ్లలో భోజనము చేసినవారిని పంక్తిబాహ్యులఁ జేసి వెలివెట్ట వలయును.

(15) మానవ ధర్మ శాస్త్రములోని కలినిషేధ సంబంధములుగాని (సూ. 4_10_12) (898_76_190_194) (సూ. 8_270-271_272_279_280_281) (సూ. 19_17-72) ఈ శాసనములను ధిక్కరించి కళ్ళములందు గింజల నేరికొని జీవింపక సమస్త ప్రాపంచిక తుచ్ఛవ్యవహారము లందును, ప్రవేశించునట్టియు, ద్విజేతరులకు సలహానిచ్చు నట్టియు, వారలనుండియు దానము గొనినట్టియు, ద్విజులకు ప్రాయశ్చిత్త మొనరింప వలయును. ద్విజుల పేరను, వర్ణములను తృణీకరించునట్టియు విధుల నుద్ఘాటించి వాదించునట్టియు సమాన పీఠము నధివసించునట్టియు శూద్రులను యథాశాస్త్రముగ కొఱత వేయింపవలెను. బ్రాహ్మణునికిఁ గావలసిన వస్తువు శూద్రుని దగ్గర నుండిన శాసన ధిక్కారముతో బలవంతముగ గైకొనవలసి యుండుచు. క్రింది వర్ణములవారు పైవర్ణమునందు కొన్ని తరములలోఁ జేరవచ్చునా ?

(16) కన్యా వర విక్రయములు, అన్న విక్రయము, యాచ్ఞావృత్తి, మృతవృత్తి, న్యాయవాది వృత్తి, వ్యభిచార

వృత్తి, వంచనా వృత్తి, కూటవృత్తి, నిషావస్తు సేవనము, పొట్ట కూటికై మ్లేచ్ఛ భాషలు నేర్చి మ్లేచ్ఛ దాసులగుటయు, సంతలు, సమావేశములు, జాతరులు, తిరునాళ్లు, తీర్థములు, నాటకములు, కల్లుపాకలు, కాఫీహోటళ్లు, రిఫ్రెష్‌మెంటురూములు టీపార్టీలు, హాస్పిటల్సు, సోడాషాపులు, మొదలైన వానిలో నిరాటంకముగ మాతంగుల తీర్థము సేవించుటయు, రైళ్ళు, ట్రాములు, మోటార్లు, విమానములు నెక్కుటయును, విదేశ వస్త్రములు, విదేశ వస్తువులు నుపయోగించుటయు. శాస్త్రీయముల సమర్థింప దగిన శాసనములు స్మృతిశ్రుతులలో నెచ్చటనైనను గలవా? లేక భవిష్యత్ స్మృతికర్తలే వీనికి గతులు కల్పింపవలెనా? బాలురు విన్న పరిహసింతురు అనియైన తలంపక యీ అపూర్వ కర్మముల నన్నింటిని యాపద్ధరములుగ సమర్థించుచు నాత్మ ప్రమాణశాస్త్రములనే అధః పాతాళమునకుఁ ద్రొక్కగలిగిన రాతిగుండె కల వారికి యథార్థముగ స్వసంఘ ధర్మములకు మహాపద సంభవించిన నేటి పరిస్థితులలో నతి దీనులగు హరిజన సోదరుల నుద్ధరించుటకైన ఆపద్ధర్మ సూత్రములు లక్ష్యము కాకపోవుటలో నచ్చెరువు కాదు.

## భావవికాసము

అస్పృశ్యత, కులవ్యవస్థ ఎప్పుడో నిర్మూనమైనవనియు, వాటిని గురించి ప్రస్తావించుట అప్రస్తుతమనియు కొందరి అభిప్రాయము. అస్పృశ్యత, కుల వ్యవస్థ మనకు స్వాతంత్ర్య భానూదయమైన తరువాత చాలా తీవ్రరూపము ధరించి వెర్రి తలలు వేయుచున్నదని చెప్పుటకు పెక్కు ఉదహారణలు

కలవు. దీనికి కారణము రాజకీయములు కావచ్చు, లేదా అగ్రకులముల అహంకారము కావచ్చు, లేక హరిజనులలో ఆత్మబలము లేకపోవుటచేత కాచ్చు.

ఇది గమనించిన మనపెద్దలు సర్వ సమానత్వము, సౌభ్రాతృత్వము, ప్రగతి, అభ్యుదయము అందరకు అందుబాటులో నుండునట్లు చూడవలెనని సమసమాజ నిర్మాణమునకు ఒక నూతన జీవిత ఆవిష్కరణకు, పూనుకొనిరి. ఇది మిక్కిలి ముదావహమైన విషయము. కాని ఈ విషయములో వారి పురోగతి, బహుస్వల్పము. వారు ఊహించినది ఒకటి, జరిగినది వేరొకటి. దీనికి కారణము లేకపోలేదు. విద్యాధికులు, మేధావులు, సంఘసంస్కర్తలు, విద్యార్థులు, నిమ్నజాతులు, ఈ పతాకచ్ఛాయల క్రింద సమీకృతులు కాకపోవుటయే! సమసమాజనిర్మాణముయొక్క భౌతిక నైతికవిలువలు విడదీయరానివే అయినప్పటికిని, ఆర్థిక రాజకీయ విలువలకన్న, నైతిక, సాంఘిక సాంస్కృతిక, విలువలకు ఎక్కువ ప్రాధాన్యము యివ్వ వలయును. సమసమాజ నిర్మాణము కేవలము తిండికొరకే కాదనియు, ధర్మబద్ధమైన ఒక వినూత్న సమాజ ఆవిష్కరణ కోసమని, మన ప్రజలు, ప్రత్యేకముగా నిమ్నజాతులు గ్రహించునట్లు చేయవలయును. ఈ నవసమాజ నిర్మాణము, కులవ్యవస్థలోనున్న కుళ్లునుపోగొట్టి, దుమ్మును దులిపివేసి, సత్యము, ప్రేమ, శాంతి, చిత్తశుద్ధి, సౌభ్రాతృత్వము, సమాజ సేవానిరతి మొదలైన మహోదాత్తములైన నైతిక విలువలపైన నాధారపడిన, న్యాయబద్ధమైన జీవితములు గడపగల్గిన, సమసమాజ నిర్మాణముకొరకని ప్రజ

లకు నచ్చజెప్పవలెను. దీనికి ప్రజల మనస్సులలో, భావము లలో, అభిప్రాయములలో, అనుభూతులలో మార్పు రావ లయును. అనగా ఒక్క మాటలో చెప్పాలంటే మనస్సు మారాలి, దీనినే మానసిక, విప్లవమనియు, భావ వికాస మనియు, భావవిప్లవమనియు, సాంస్కృతిక విప్లవమనియు అంటారు. భావ వికాసము రావాలంటే ఏమి జరగాలి! ప్రాత పద్ధతులు పోయి, క్రొత్తపద్ధతి రావాలి. ప్రాత పద్ధ తులలో ముందుగా పోవలసినది చాతుర్వర్ణ వ్యవస్థ, అనగా కుల నిర్మూలనము చేయవలయును,

## కులనిర్మూలనము

ఈ కులమనే జాడ్యము ఒక్క హిందూదేశములోనే ప్రబలముగా నున్నది. హిందూ మతములో పుట్టి, పెరిగి, ప్రస్తుతము క్రైస్తవ, మహమ్మదీయ మతములలోనికి కూడా వ్యాపించుచున్నది. క్రైస్తవ మతములో కూడా, రెడ్డిక్రైస్త వులు, బ్రాహ్మణక్రైస్తవులు, మాల క్రైస్తవులు అని వ్యవ హరించుట మనకందరకు తెలిసిన విషయమే. వీరి మధ్య కూడా అస్పృశ్యత వ్యాపించి యున్నది. ఇట్లు ఒక్క హిందూ మతాన్నే కాక యితర మతములను కూడా పాడుచేయుచు, భారత దేశమునే ధ్వంసము చేయుచున్న ఈ వ్యాధిని అరి కట్టుట ప్రతి భారతీయుని విద్యుక్తధర్మము కాదా?

ఈ వర్ణవ్యవస్థ చతులామయ నిర్మూలనమును గురించి ఆలోచించుటకు ముందు, దీనివలన సంఘమునకు, దేశమునకు కల్గు అరిష్టములను గూర్చి తెలుసుకొందము. శాస్త్రీయ

దృక్పథములో పరిశీలించి చూసిన, కులవ్యవస్థ ప్రకృతివిరుద్ధ మైన, హేతువాద విరుద్ధమైన, ఒక కృత్రిమ వ్యవస్థ. సహపంక్తి భోజనములు నిషేధించినంతమాత్రమున, వర్ణాంతర వివాహములు నిషేధించినంతమాత్రమున, ఉన్నతమైన జాతి ప్రాదుర్భావము చెందునని ఏ శాస్త్రము చెప్పలేదు. పైగా వర్ణాంతర వివాహముల వలననే పటిష్ఠమైన జాతి ఉద్భవించునని విజ్ఞాన శాస్త్రము చెప్పుచున్నది. కాన పటిష్ఠమైనజాతి నిర్మాణమునకు కుల నిర్మూలనము చేయవలయును.

హిందువులలో ఒకేజాతియన్న చైతన్యము లేదు. ఒకే కులమన్న సంకుచితభావ తత్వము ఎక్కువగా కలదు. దీని వలన ఐకమత్యము పోయి, జాతి శతధా భిన్నమైనదని చెప్పవచ్చును. జాతి ఐక్యతకు, భావ సమైక్యతకు కుల నిర్మూలనము చేయవలయును.

కులతత్వ లోతులలోనికి పోయినచో యింకను అనేక విపరీత విపత్కర పరిస్థితులకు దారి తీయుచున్నది. శాఖలు, ఉపశాఖలు, కులములు, చిన్నకులములు, వర్ణములు, ఉపవర్ణములు, ఈ మాదిరిగా భారతీయ సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నములై పోయినది. దీనివలన సంఘ వ్యతిరేక తత్వము, పరస్పర విభేద తత్వము ఎక్కువ అయి పోయినది. బ్రాహ్మణేతరలమీద బ్రాహ్మణులకు ద్వేషము, అగ్రవర్ణములమీద నిమ్న జాతులకు ద్వేషము, ఈవిధముగా ద్వేషము అసూయ, జుగుప్స ఇత్యాది నీచభావములతో సంఘము నిండిపోయినది. ఈ నీచభావములుపోవుటకు కులనిర్మూలనము చేయవలయును.

కులవ్యవస్థ పిరికితనమునకు దారితీయును. మహమ్మదీయులు మన దేశముమీదికి దండయాత్ర వచ్చినప్పుడు హిందువులలో ఒకే వర్ణమువారు పోరుసల్పిరి కాని, మిగిలిన కులములవారు పోరు సల్పలేదు. సంఘ, సమైక్యతా బలము లేకపోవుటచేత, హిందువులు భయభ్రాంతులై, పిరికితనముతో ఓడిపోవలసి వచ్చినది. కాని మహమ్మదీయులలో సాంఘిక బలము కలదు. వారిలో సమైక్యతగా పోరాడ శక్తి గలదు. అందుచేతనే మహమ్మదీయులు 300 సం॥ పరదేశములనుండి వచ్చి మనలను పరిపాలించినారు. మనలో పిరికితనము పోవాలంటే, కుల నిర్మూలనము జరిగితీరాలి.

## సాంఘిక విప్లవము

ఆర్థిక విప్లవము, రాజకీయ విప్లవము రాకమునుపే సాంఘిక విప్లవము రావలెను. కాని మన దేశములో అట్లు జరగలేదు. ముందే రాజకీయ విప్లవము వచ్చినది. ఇప్పుడు సాంఘిక విప్లవము చేపట్టవలసి యున్నది. దీనికి అభ్యుదయవాదులు, ప్రగతి కాముకులు, సంఘ సంస్కర్తలు అందరు ఏకమై పూనుకొనవలయును. ఇప్పుడు ఎటుచూసినా అడ్డు వచ్చేది కులవ్యవస్థ. ఇది యొక పెనుభూతములాగా తయారైనది. ఈ భూతాన్ని ముక్కలు, ముక్కలుగా నరికివేస్తేనే గాని, ఆర్థిక విప్లవము సాధించలేము. రాజకీయ వేత్తలు మాకు కుల వ్యవస్థలో నమ్మకము లేదని చెప్పినంతమాత్రమున సరిపోదు. అంతకన్న నమ్మదగిన అభయహస్తమివ్వాలి. వారి మనోతత్త్వములో మార్పు రావాలి. అదే భావవిప్ల

వము. ఇది మనలో లోపించి యున్నది. ఈ లోపాన్ని మనము సరిజేసుకొనవలయును.

## సాంఘిక విప్లవము రావాలంటే ఏమిచేయాలి?

ప్రజల భావములలోను, మూఢ విశ్వాసములలోను, ఆలోచనా విధానములోను మార్పు రావలి. సాంఘిక విప్లవానికి అడ్డుగోడలుగా నున్న పురాతన గోపుర ద్వారకవాట పంక్తులు బ్రద్దలుకొట్టి, పునాదులతో సహా పెకలించి వేయవలయును. వర్ణాంతర, మతాంతర, కులాంతర, శాఖాంతర వివాహాలు, సహపంక్తి భోజనములు, జోరుగా సాగిపోవాలి. కాని వర్ణాంతర వివాహాలు, సహపంక్తి భోజనములు ప్రజలలో భావ వికాసము లేకుండా బలవంతముగా జరగరాదు. దానివలన విపరీత, విపత్కర పరిస్థితులు దాపురించవచ్చును. అస్పృస్యత, కులము, మతము యివిఅన్నియు పాతభావములు. ప్రజలు అంధ విశ్వాసమువలన కులతత్వానికి లొంగిపోయారు. లోపము మతములో నున్నది. కుల, మత తత్వాన్ని బోధించే గ్రంథాలపైన దండయాత్ర సలుపవలెను. కులము పవిత్రమైనదని ఈ భావమును కల్గించిన మతమును అందులోని దోషములను ఎత్తిచూపించి, భావవిప్లవమును తీసుకొని రావలయును. అప్పుడే మతాంతర వర్ణాంతర వివాహాల వలన ప్రయోజనముంటుంది.

**మతము:-**

" మతమనుమాట మోసము సుమా ! యిదె మూలము ధర్మపీడకున్"

[కవిరాజు - భగవద్గీత]

మతమును గూర్చి యింత నిర్భయముగా చెప్పిన మహా కవిగాని, సంఘసంస్కర్తగాని లేడు.

మతమువలన సర్వ సమానత్వము, స్వాతంత్ర్యము, సౌభాగ్యము, సౌభ్రాతృత్వము ఐకమత్యము భగ్నమగు చున్నది. ఒక మతమునుండి మరియొక మతములోనికి బల వంతముగా మార్పిడి చేయుటకు అనేక యుద్ధములు జరిగినవి. మహమ్మదీయులు మన దేశముమీదికి దండెత్తివచ్చుట, వారి మతముకొరకై అనేక యుద్ధములు జరుగుట మనకు అనుభ వైక వేద్యమైన విషయమే కదా! సోమనాథ దేవాలయ ముట్టడిలో ఎంతమంది మహారథులు, అతిరథులు, ప్రాణ త్యాగము చేసినారో మనకందరకు తెలిసిన విషయమేగదా! క్రైస్తవుల పుణ్యక్షేత్రమైన జరుసలమ్ పట్టుకొనుటకు ఎన్ని మత యుద్ధములు జరిగినవో ఎంతమంది సామాన్య జనులు హతులైరో మనమెరుంగునది కాదు. ఆదిశంకరులు యెంత మంది, బౌద్ధ, జైన మతస్థులను దారుణముగ హతమార్చ లేదు. ఫ్రాన్సుదేశమున 1572 సంవత్సరమున అనేక వేలమంది ప్రొటెస్టెంటు క్రైస్తవులను చంపివేసిరి. స్పెయిను దేశములు క్రైస్తవ మతములో జేరుటకు నిష్టపడని వారిని అనేక వేల మందిని కాల్చి వేసిరి. ఈ విధముగ మతములు ప్రపంచ పరి ణామమునకు అడ్డుపడుచునే యున్నవి కాని తోడ్పడుటలేదు.

ఇక ఆత్మ, కర్మ, పరలోకములు, పితృదేవతలు మొదలైనవి కొంతమంది మతవాదులు, అవివేకులను, అజ్ఞానులను దోచుకొనడానికి అజ్ఞానాంధకారములో నుంచుటకు కల్పించి నవి. భగవంతుడొకడున్నాడు, అతడు సర్వాంతరయామి

అని చెప్పు మాటలుకూడ హేతువాద విరుద్ధములైన విషయములే. నిజముగా, సర్వశక్తివంతుడైన భగవంతు డొకడున్నచో. తన పేర జరుగు అత్యాచారములైనను తొలగించలేడా? ఈ మత వాదనలన్నియు, మానవుని పురుషకారమును జంపి, మానవునిలోని వ్యక్తిత్వమును నమ్మచేసి. బానిసలగ తయారు చేయుటకు మాత్రమే ఉపయోగపడును.

కాన ఈ మతమను ముసుగును తీసివేసి, కులనిర్మూలనము జేసి, సమసమాజ నిర్మాణమును స్థాపించవలయును.

## సెక్యులరిజము

కుల, మత, వర్గ తత్త్వాతీతమైన వ్యవస్థను సెక్యులరిజము అంటారు. అనగా కుల, మత, ప్రమేయములేని వ్యవస్థ, సెక్యులరిజము. మనకు క్రొత్తదేమీ కాదు. మన భారతీయ సంస్కృతికి విరుద్ధమైనదీ కాదు. ప్రాచీన కాలములో మన దేశములో కులములుగాని, మతములుగాని, వర్ణములుగాని లేవని మనము ముందుభాగములలో తెలిసికొనియున్నాము. దీనినే(Primitive Secularism) ప్రిమిటివ్ సెక్యులరిజం అని కూడా అంటారు. కాని యిటీవల కొందరు రాజకీయవేత్తలు దీనికి అనేక విధములుగా వ్యాఖ్యానములు చేయుటయే కాక విపరీతార్థములు కూడా తీయుచున్నారు. దీనిని పూర్తిగా అవగాహన చేసుకొనుటకు, దీని పుట్టు పూర్వములు సంక్షిప్తముగా తెలుసుకొందము.

"సెక్యులరిజము" అంటే మతమునకు, ఆధ్యాత్మికతకు సంబంధము లేనిదని అర్థము. ప్రిమిటివ్ సెక్యులర్ భావన, మొదట మన దేశములో అతి ప్రాచీన కాలములో ప్రారంభ మైనది. తరువాత రోమన్ సామ్రాజ్యమును, సీజర్ చక్ర వర్తి పరిపాలించు చున్నపుడు, క్రైస్తవులతోపాటు అన్ని మత స్థులవారు రాజ్యాంగమునకు విధేయులుగ నుండవలెనన్న ఆదేశముతో ప్రారంభమైనది. క్రైస్తవులు దీనిని వ్యతిరేకిం చుట వలన ఆచరణరూపములో జరగలేదు. సెక్యులరిజ మును ఆచరణ రూపములో మొట్టమొదట పెట్టినది అమెరి కనులు. భారత రాజ్యాంగముకూడ అధికార మతముగా దేనిని గుర్తించలేదు. మత ప్రసక్తియే లేదు. అంటే మతా నికి సంబంధించిన పూజలలోగాని, బోధనలలోగాని ప్రభుత్వ పరముగా ఎవరు పాల్గొనరాదు. ప్రభుత్వము ప్రజాక్షేమము రీత్యా, ఆరోగ్యము పేరుతోగాని, వ్యక్తిగతస్వేచ్ఛపేరుతో గాని, నీతిపేరుతో గాని, దేశమునకు, సంఘ కళ్యాణమునకు అరిష్టదాయకముగా నున్నచో మతమును నిరోధించవచ్చును. ప్రభుత్వమునకు లోబడియే మతసంస్థలుండవలయును.

కుల, మత, వర్గ అతీతంగా, మానవసమాజ నిర్మాణ మునకు, సెక్యులరిజము ఎక్కువగా తోడ్పడుతుంది. అనగా సమసమాజ నిర్మాణమునకు యితోధికముగా సహాయము చేయగలదు. భారత సమాజము సెక్యులర్ అయినపుడే, భారత ప్రభుత్వము కూడా సెక్యులర్ కాగలదు.

భారత సమాజము సెక్యులర్ కావలెనంటే అనేక అవరోధములున్నవి. మతసంస్థలు, పీఠాధిపతులు, బాబాలు, సెక్యులరిజానికి విరుద్ధంగా ప్రవర్తించడము మిక్కిలి శోచనీయము. మతము విలయ తాండవ మాడుచున్నది. విద్యాశాఖను కూడ యీ జాడ్యము వ్యాపించినది. కుల, మత, తత్వాతీతమైన నవ ప్రజాస్వామ్యములో తద్విరుద్ధాంశములు గల గ్రంథములను, పాఠ్యగ్రంథములగను, విరుద్ధ ధర్మాభిమానులగు ఉపాధ్యాయులను నియమింపరాదు. కాబట్టి మన సెక్యులర్ ప్రభుత్వము పాఠ్యగ్రంథ నిర్ణయములోను ఉపాధ్యాయ నిర్ణయములోను, మిక్కిలి విచక్షణాజ్ఞానము చూపునని తలంచుచున్నాము.

నవ ప్రజా స్వామ్యము, సెక్యులర్ భావములు కల్గిఉండాలంటే, అన్ని వర్గాలవారు, హరిజనులు, గిరిజనులు, నిమ్న జాతులు వెనుకబడినవారు, స్త్రీలు, దళిత వర్గాలవారంతా. మత, కుల ప్రసక్తి లేకుండా. రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో భాగస్వాములై, సమాజములో సవర్ణులతోపాటు, విభేదాలు లేకుండా సమసమాజ నిర్మాణము కొరకు కృషి చేయవలసి యున్నది.

## విశ్వమానవ - మానవతావాదము

మాది ద్రవిడ సంస్కృతి, మాది ఆర్య సంస్కృతి
మాది హైంద సంస్కృతి, మాది మహమ్మదీయ సంస్కృతి,

మాది బౌద్ధ సంస్కృతి అను భేదభావము లేక మానవులంతా ఒకటే అనే, వసుధైక కుటుంబ మహోదార భావముతో ప్రజలు ప్రవర్తించిన నాడే మన దేశమునకు మహోజ్వల భవిష్యత్తు గలదు.

"మంచి అన్నది మాల అయితే
మాలనే అగుదున్"
"మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటే నిలచి వెలుగును"

గురజాడ అప్పారావు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.

సమాప్తి

---

శ్రీ సర్వోదయ ప్రెస్, గుడివాడ.

Bà

AQUA103B139 BC

# డాక్టరు వెంకటేశ్వరరావుగారి రచనలు.

## కావ్యములు

కవితాంజలి.
అభ్యుదయము.
సాహిత్య సమ్రాటు.

## నా ట క ము లు.

జ్ఞానోదయము.
మహోదయము.
శుభోదయము.
అరుణోదయము.

## శాస్త్రీయ గ్రంధములు

నీవూ నీ శరీరము.
నీవూ నీ రూపము.
నీవూ నీ మెదడు.
అంటు వ్యాధులు.
నీవూ నీ కుటుంబము.
ప్రమాదములు ప్రధమ చికిత్స.

పుస్తకములు లభ్యమగుచోటు:
డా॥ త్రిపురనేని వెంకటేశ్వరరావు.
గుడివాడ. (కృష్ణాజిల్లా)

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA103B139 |
| పుస్తకం పేరు | యదార్థ భారతి |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | no |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 125 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | [illegible] |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Bhargavi |
| పేజీలు విడదీసినది | Hudhiya |
| స్కాన్ చేసినది | CL Naga Sai |
| పరీక్ష చేసినది | SARANYA |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |